నారాయణ విద్యార్థుల్లో 33% మంది డాక్టర్లని దేశానికి అందిస్తున్న నారాయణ !

NEET - 2026

AIR 1 ARYAN GUPTA App. No. 260410023990 (CIP)

AIR 9 GAURAV SINGH App. No. 260410079810 (nPrep)

నారాయణ విద్యాసంస్థలు

www.narayanagroup.com



www.prajapaksham.in

PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం



NEET - 2026

అన్ని కేటగిరీలలో 10 లోపు 7 ర్యాంకులు

100 లోపు 45 ర్యాంకులు | 1000 లోపు 163 ర్యాంకులు

నారాయణ విద్యాసంస్థలు

www.narayanagroup.com



సంపుటి 09, సంచిక: 229 | ఆదివారం | 19-07-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



47 YEARS OF EXCELLENCE

SRAMAYEVA JAYATHE

NARAYANA®

EDUCATIONAL INSTITUTIONS

nLearn® Online learning app

NEET 2026లో తెలుగు రాష్ట్రాల నుండి 2135 వరకు డాక్టర్లను సృష్టించి

నారాయణ విద్యార్థులలో ప్రతి ముగ్గురిలో ఒకరిని డాక్టర్‌ని చేసి 33% మంది డాక్టర్లని దేశానికి అందిస్తున్న నారాయణ

ఆల్ ఇండియా అన్ని కేటగిరీలలో




ARYAN GUPTA App. No. 260410023990 (CIP)

RANVEER KUMAR App. No. 260410035204 nPrep (Gen EWS)

ADITYA SHARMA App. No. 260410342685 nPrep (Gen EWS)

GAURAV SINGH App. No. 260410079810 nPrep

ANUSHKA CHOUDHARY App. No. 260410021314 nPrep (OBC-NCL)

ఓపెన్ కేటగిరీలో

ఆల్ ఇండియా టాప్ 10లో 2 ర్యాంకులు

ఆల్ ఇండియా టాప్ 50లో 10 ర్యాంకులు

ఆల్ ఇండియా టాప్ 100లో 18 ర్యాంకులు

nPrep : Narayana Digital Learning Programme
CIP : Coaching Integration Programme

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

## NEET 2026 ఓపెన్ కేటగిరీలో 500 లోపు టాప్ ర్యాంకులు

| AIR | Name | App.No. | Programme |
|---|---|---|---|
| 15 | Krish Gupta | 260411104787 | nPrep |
| 16 | Kartik Chaudhary | 260410189559 | nPrep |
| 22 | Harshil Gupta | 260410024522 | nPrep |
| 30 | Akshit K. Gaur | 260410850821 | nPrep |
| 31 | Prakhar Bansal | 260410156444 | nPrep |
| 35 | Sabyasachi Laskar | 260410945197 | nPrep |
| 39 | Ranveer Kumar | 260410035204 | nPrep |
| 50 | Arnav Jindal | 260410211081 | nPrep |
| 56 | Bhavika Gupta | 260410343476 | nPrep |
| 58 | Anushka Choudhary | 260410021314 | nPrep |
| 71 | Bhavyaa Gunwal | 260410001881 | Classroom |
| 72 | Krish Chauhan | 260410298589 | nPrep |
| 76 | Aditya Sharma | 260410342685 | nPrep |
| 78 | Thanth K Vijaybhai | 260410543156 | nPrep |
| 79 | Divit Jain | 260410146253 | nPrep |
| 97 | Vinayak Garg | 260410140823 | nPrep |
| 125 | Srinivasa Reddy. V | 260410246065 | Classroom |
| 142 | Chaithra Y | 260410013102 | Classroom |
| 145 | Nidhi Yadav. | 260410255961 | Classroom |
| 150 | N Sai Shravya | 260411027019 | Classroom |
| 188 | R Jaswanth Ram. | 260410271452 | Classroom |
| 194 | Lohith Kumar. Y | 260410511141 | Classroom |
| 199 | M B Vardhan Reddy. | 260410262142 | Classroom |
| 219 | Shreya Kale. | 260410028123 | Classroom |
| 237 | Tanush V | 260410280979 | Classroom |
| 238 | Eashan Jagdeep D | 260410100984 | Classroom |
| 258 | Nishita | 260410340507 | Classroom |
| 316 | S Rohith Raju. D | 260410723484 | Classroom |
| 347 | Vaibhav Jindal | 260411216433 | nPrep |
| 357 | Saisha Jain. | 260410096340 | Classroom |
| 371 | Prashil Makwana. | 260410346182 | Classroom |
| 434 | Guru Bala Akhil. A | 260411007179 | Classroom |
| 486 | M Yashika. | 260410226839 | Classroom |

Disclaimer: Some students are featured more than once for securing both Open Category and Category ranks.

NEET 2026 ఆల్ ఇండియా అన్ని కేటగిరీలలో టాప్ 10లో 7 ర్యాంకులు

NEET 2026 ఆల్ ఇండియా అన్ని కేటగిరీలలో టాప్ 100లో 45 ర్యాంకులు

NEET 2026 ఆల్ ఇండియా అన్ని కేటగిరీలలో టాప్ 1000లో 163 ర్యాంకులు

### NEET LONG TERM 2026-27 MERIT CONCESSION

| MARKS IN NEET-2026 | % ON CONCESSIONS | MARKS IN NEET-2026 | % ON CONCESSIONS |
|---|---|---|---|
| >370 | 90% | 330-339 | 40% |
| 360-369 | 75% | 320-329 | 30% |
| 350-359 | 60% | 300-319 | 20% |
| 340-349 | 50% | | |

nConnect Tech-enabled performance tracking

NEET LONGTERM 1st BATCH STARTS FROM 20-07-2026

#YourDreamsAreOurDreams

Toll Free: 1800 102 3344

www.narayanagroup.com





## గొప్ప ప్రయత్నం..



మానవత్వం, ప్రేమ, సానుభూతి ఎంతటి ప్రాణరక్షక శక్తిగా మారగలవో తెలియజేసే హృదయాన్ని కదిలించే నిజజీవిత సంఘటన. మిక్ ర్యాన్ అనే వ్యక్తి తన 22 ఏళ్ల కుమారుడు సీన్ పాల్ ఆత్మహత్య చేసుకోవడంతో కుంగిపోయాడు. అయితే, ఆ విషాదం ఆయన జీవితాన్ని శాశ్వతంగా మార్చేసింది. అతను బాధలోనే కూరుకుపోకుండా, మరొక కుటుంబం ఇలాంటి దుఃఖాన్ని అనుభవించకూడదనే సంకల్పంతో ఆయన ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఆత్మహత్యలు ఎక్కువగా జరిగే వంతెనలపై చిన్న టెడ్డీ బొమ్మలను ఉంచి, వాటితో పాటు 'మీ కుటుంబ సభ్యులు, మీ స్నేహితులు మిమ్మల్ని ప్రేమిస్తున్నారు' అనే సందేశాన్ని, ఆత్మహత్య నివారణ సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లను ఉంచడం ప్రారంభించారు. ఆత్మహత్య గురించి ఆలోచిస్తున్న వ్యక్తి ఆ సందేశాన్ని ఒక్కసారి చదివినా, తన నిర్ణయాన్ని మార్చుకోవచ్చనే ఆశతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాడు. ఈ ప్రయత్నం ఫలించింది కూడా. ఒక యువకుడు ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో వంతెనపైకి వెళ్లినప్పుడు, అక్కడ ఉన్న టెడ్డీ బొమ్మను, దానిపై ఉన్న ప్రేమపూర్వక సందేశాన్ని చూసి మనసు మార్చుకున్నాడు. ఇంటికి తిరిగి వెళ్లి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి, అవసరమైన సహాయం పొందాడు. ఆ చిన్న సందేశం ఒక ప్రాణాన్ని కాపాడింది. ఈ సంఘటన మనకు ఒక గొప్ప సత్యాన్ని గుర్తు చేస్తుంది. తీవ్రమైన మానసిక వేదనలో ఉన్న వ్యక్తికి పెద్ద పెద్ద సలహాలు అవసరం కాకపోవచ్చు. కొన్నిసార్లు నువ్వు ఒంటరివి కాదు, నిన్ను ప్రేమించే వాళ్లు ఉన్నారు అనే చిన్న మాటలే జీవితం పట్ల కొత్త ఆశను కలిగిస్తాయి. బాధలో ఉన్న వ్యక్తిని విమర్శించడం కంటే, అతని మాటలను ఓపికగా వినడం, అతని భావాలను అర్థం చేసుకోవడం, అవసరమైతే నిపుణుల సహాయం తీసుకునేలా ప్రోత్సహించడం ఎంతో అవసరం. మిక్ ర్యాన్ తన కుమారుడిని తిరిగి పొందలేకపోయినా, తన వ్యక్తిగత విషాదాన్ని సమాజానికి మేలుచేసే సేవగా మార్చుకున్నారు. ఆయన చేసిన చిన్న ప్రయత్నం ఎంతోమంది జీవితాల్లో ఆశాకిరణంగా మారింది.


## గగనతలంలో అలల మేఘాలు!






ప్రపంచంలో అత్యంత అరుదుగా కనిపించే మేఘాల ఆకృతుల్లో ఒకటైన 'అస్పెరిటాస్' విశేషంగా ఆకట్టుకుంటాయి. ఆకాశంలో సముద్రపు అలలు ఒక్కసారిగా గడ్డకట్టినట్లుగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఈ దృశ్యం చూసినప్పుడు తుఫాను వీచే సముద్రం మన తలపైకి వచ్చినట్లుగా అనిపిస్తుంది. అందుకే ప్రకృతి సృష్టించిన అత్యంత అద్భుతమైన, నాటకీయమైన మేఘాల రూపాల్లో ఇవి ప్రత్యేక స్థానం పొందాయి. 'అస్పెరిటాస్' అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. దీనికి 'ఎగుడుదిగుడుగా ఉండే ఉపరితలం' లేదా 'అలలతో కూడిన ఆకృతి' అనే అర్థం ఉంది. సాధారణ మేఘాల మాదిరిగా కాకుండా వీటి అడుగు భాగం భారీ అలల మాదిరిగా మెలికలు తిరుగుతూ కనిపిస్తుంది. 'అస్పెరిటాస్' మేఘాలు సాధారణంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసిన తర్వాత లేదా తీవ్రమైన వాతావరణ బీభత్సం తగ్గుముఖం పట్టే సమయంలో ఏర్పడతాయి. వాతావరణంలోని వివిధ పొరల్లో గాలి వేర్వేరు వేగాలతో, వేర్వేరు దిశల్లో కదలడం వల్ల ఈ అలల ఆకృతులు ఏర్పడతాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఇవి ఎలా ఏర్పడతాయనే విషయంపై ఇప్పటికీ పూర్తిస్థాయి శాస్త్రీయ వివరణ లేదు. అందువల్ల ఇవి వాతావరణ శాస్త్రంలో ఆసక్తికరమైన రహస్యంగా కొనసాగుతున్నాయి. ఈ మేఘాలు భయానకంగా కనిపించినప్పటికీ, అవి తప్పనిసరిగా తుఫాను లేదా ప్రకృతి విపత్తుకు సంకేతం కావు. చాలా సందర్భాల్లో తుఫాను ముగిసిన తర్వాత కూడా ఇవి కనిపిస్తాయి. 2017లో ప్రపంచ వాతావరణ సంస్థ అంతర్జాతీయ క్లౌడ్ అట్లాస్‌లో 'అస్పెరిటాస్'ను ప్రత్యేక మేఘాల ఆకృతిగా అధికారికంగా గుర్తించింది. ఈ మేఘాలు ప్రకృతిలో ఇంకా ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయనే విషయాన్ని కూడా గుర్తుచేస్తాయి.

## చారిత్రక గ్రంథాలయం 'జొయనినా'



పోర్చుగల్‌లోని 'జొయనినా' గ్రంథాలయం ప్రపంచంలోని అత్యంత అందమైన చారిత్రక గ్రంథాలయాలలో ఒకటి. 18వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ గ్రంథాలయం బరోక్ శిల్పకళకు అద్భుతమైన నిదర్శనం. బంగారు అలంకరణలు, అద్భుతమైన చెక్క నగిషీలు, కళాత్మక చిత్రాలతో అలరారే ఈ భవనం పుస్తకాల భాండాగారంగా విరాజిల్లుతున్నది. అంతేగాక, పోర్చుగల్ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచింది. ఈ గ్రంథాలయాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెట్టే అంశం ఇక్కడ నివసించే గబ్బిలాల చిన్న కాలనీ. పగటిపూట ఇవి పుస్తకాల అలమరల వెనుక దాక్కుని విశ్రాంతి తీసుకుంటాయి. రాత్రి సమయంలో బయటకు వచ్చి పుస్తకాలను దెబ్బతీసే చిమ్మటలు, మిడతలు, ఇతర కీటకాలను వేటాడి తింటాయి. దీంతో అరుదైన పాత పుస్తకాలు, విలువైన హస్తప్రతులు కీటకాల బారిన పడకుండా సహజసిద్ధంగా రక్షించబడతాయి. రసాయనిక పురుగుమందులు ఉపయోగించకుండా ప్రకృతినే సంరక్షకుడిగా మార్చుకున్న ఈ విధానం విశేషమైనది. అయితే గబ్బిలాల నివాసం వల్ల కొంత అసౌకర్యం కూడా ఉంటుంది. అవి విసర్జించే మలంతో బల్లలు, ఫర్నిచర్ మురికిగా మారకుండా ఉండేందుకు ప్రతి సాయంత్రం గ్రంథాలయ సిబ్బంది పఠన బల్లలపై ప్రత్యేక తోలు కవర్లు పరుస్తారు. ఉదయం వాటిని తొలగించి బల్లలను శుభ్రం చేస్తారు. ఈ విధంగా గబ్బిలాల వల్ల కలిగే ఇబ్బందిని తగ్గిస్తూ, వాటి సహజ సేవలను కొనసాగిస్తున్నారు. ప్రపంచంలో గబ్బిలాలు శాశ్వతంగా నివసిస్తూ పుస్తకాలను సంరక్షించే గ్రంథాలయాలు చాలా అరుదు. అందువల్ల జొయనినా గ్రంథాలయం చరిత్రకారులు, పరిశోధకులు, పుస్తకప్రియులు, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రకృతితో సహజీవనం చేస్తూ అమూల్యమైన వారసత్వ సంపదను కాపాడవచ్చని, పర్యావరణహిత పరిష్కారాలు శతాబ్దాల పాటు ఫలితాలను అందించగలవని ఈ గ్రంథాలయం ప్రపంచానికి చక్కని సందేశాన్ని అందిస్తోంది.

## మొహెంజొదారో అద్భుత దృశ్యం



సూర్యాస్తమయ సమయంలో మొహెంజొదారోలోని 'స్తూప దిబ్బ' బంగారు కాంతిలో మెరిసిపోతూ అద్భుతమైన దృశ్యాన్ని సృష్టిస్తుంది. మొహెంజొదారోలో అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఒకటైన ఈ దిబ్బ, సింధు నాగరికత కాలానికి చెందినది కాదు. సింధు నాగరికత పతనమైన అనేక శతాబ్దాల తరువాత బౌద్ధమతం వ్యాప్తిచెందిన కాలంలో ఈ స్తూపాన్ని నిర్మించారు. ప్రారంభ పురావస్తు శాస్త్రవేత్తలు స్తూపదిబ్బను గ్రేట్ బాత్, కాలేజ్‌గా పిలువబడే భవనం వంటి నిర్మాణాల నుంచి వేరుచేసే వీధికి 'డివినిటీ లేన్' అనే పేరు పెట్టారు. ఈ ప్రాంతం మతపరమైన కార్యకలాపాలకు కేంద్రంగా ఉండి ఉండవచ్చని వారు భావించారు. సింధు నాగరికత ప్రజలు ఈ వీధిని ఏమని పిలిచేవారో, దానికి ప్రత్యేక పేరు ఉండేదో కూడా ఇప్పటికీ తెలియదు. కాబట్టి 'డివినిటీ లేన్' అనేది చారిత్రకంగా నిర్ధారిత పేరు కాకుండా, ఆధునిక పురావస్తు శాస్త్రవేత్తలు ఉపయోగించిన పేరు మాత్రమే. మొహెంజొదారోలోని డిజికెఐ హెచ్ఆర్ ప్రాంతాల పురాతన వీధులు సాయంత్రపు సూర్యకాంతిలో మరింత మనోహరంగా కనిపిస్తాయి. అస్తమించే సూర్యుడి బంగారు కిరణాలు వేల సంవత్సరాల నాటి ఇటుకలపై ప్రసరించినప్పుడు, ఆ ప్రాచీన నగరం మళ్లీ జీవం పొందినట్లుగా అనిపిస్తుంది.

– బిఎస్ఎస్ మైత్రేయి

# దీక్షపై దౌర్జన్యం

ఊహించిందే జరిగింది. ప్రజాస్వామిక ఉద్యమాలను అణిచివేసేందుకు గతం నుంచి అనుసరిస్తోన్న పద్ధతినే మోదీ ప్రభుత్వం మరోసారి ప్రయోగించింది. నీట్ పరీక్షాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న శాంతియుత నిరశనపై దౌర్జన్య అస్త్రాన్నే ప్రయోగించింది. ఇరవై ఒక్కరోజులుగా ఆయన నిరవధిక నిరాహార దీక్షకు వేదికగా నిలిచిన జంతర్‌మంతర్ శిబిరంపై మఫ్టీలో ఉన్న పోలీసులు ఒక్కసారిగా విరుచుకపడ్డారు. ఇందుకు శిబిరం పలుచగా ఉండే ఉదయం ఏడు గంటల సమయాన్ని ఎంపిక చేసుకొన్నారు. శరవేగంగా వాంగ్‌చుక్ శయనించిన వేదికపైకి దూసుకపోయి, పైన జరిగేదేమి కనపడకుండా తెల్ల దుప్పట్ల తెరను అడ్డుగా ఉంచారు. ఆయనను దౌర్జన్యంగా ఎత్తుకెళ్ళే దృశ్యాలు కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకే సర్కారు పన్నిన పన్నాగాన్ని పక్కాగా అమలు చేసేందుకే ఈ తాపత్రయమంతా. ఆ సమయంలో సోనమ్ వాంగ్‌చుక్‌ను ఎత్తుకెళ్ళకుండా అడ్డుపడిన వారిపై పోలీసుల దండప్రయోగం జరిగింది. వారందరినీ తప్పించి ఆయనను భారీ పోలీసు బందోబస్తు మధ్య సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు.

హైకోర్టు ఆదేశాల మేరకే తామీ పనిచేసినట్లుగా ఢిల్లీ పోలీసు డిప్యూటీ కమిషనర్ తమ చర్యను సమర్థించుకున్నారు. అయితే, ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం ఏమి చెప్పింది? దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను బలవంతంగానైనా ఆసుపత్రిలో చేర్చి ద్రవరూపంలో పోషకాలను అందించాలని కోరుతూ మూడు రోజుల క్రితం ఒక వ్యక్తి కోర్టు తలుపు తట్టాడు. దీనిపై ప్రభుత్వ వాదనలు విన్న తరువాత హైకోర్టు – ఆయన(వాంగ్‌చుక్)కు నిరంతరం, ప్రతిరోజూ ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరగాలని, నివేదికల ఆధారంగా అవసరమైతే చికిత్స అందించాలని, ప్రతి ప్రాణం అమూల్యమైనదని ఆదేశాలు జారీ చేసింది. తాను బలహీనంగా ఉన్నప్పటికీ, కండరాలు సడలినప్పటికీ, చురుకుగానే ఉన్నానని, దీక్షను కొనసాగిస్తానని, ప్రభుత్వ నిస్పందనకు నిరసనగా జులై 20న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని వాంగ్ చుక్ దీక్ష 18వ రోజున వీడియో సందేశమిచ్చారు. శుక్రవారం ఆయనను పరీక్షించిన వైద్యుడు సైతం ఒంట్లో నీరు తగ్గినప్పటికీ, ఆరోగ్యం నిలకడగానే ఉందని వెల్లడించారు.

మరుసటి రోజే కేంద్రం కనుసన్నల్లో పనిచేసే ఢిల్లీ పోలీసులు దీక్షా శిబిరంపై దాడి జరిపారు. దుప్పట్లో చుట్టేసి ఆయనను ఆసుపత్రికి తరలించారు. నిజంగానే వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ప్రభుత్వానికి శ్రద్ధే కనుక ఉంటే, ఆయనను వాకబు చేసి, ఆసుపత్రికి తీసుకెళ్తామని మర్యాదగా కోరాల్సింది. అలా కాకుండా, శిబిరంపై విరుచుకుపడి, కనీసం స్ట్రెచర్ కూడా తీసుకురాకుండా, దుప్పట్లోనే చుట్టి బలవంతంగా ఆయనను ఆసుపత్రికి తరలించటంలోనే ఆంతర్యం స్పష్టం. ఆసుపత్రికి వెళ్ళిన వాంగ్‌చుక్ జీవిత సహచరి గీతాంజలి ఆంగ్మో ఆయనను కలిసిన తరువాత దీక్ష కొనసాగుతోందని ప్రకటించారు. ముందురోజు వరకూ రక్తంలో వాంగ్‌చుక్ 4.8శాతం ఉన్న పొటాషియం స్థాయి సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలో చేరిన వెంటనే 2.9 శాతానికి పడిపోయినట్లు ఆసుపత్రి వర్గాలు చెప్పడంపై ఆమె వ్యక్తం చేసిన సందేహాలలో కూడా వాస్తవం లేక పోలేదు. ఇప్పటికే 21 రోజులుగా దీక్షలో ఉన్న అఖిల భారత విద్యార్థి సంఘం (ఐసా) నాయకులు నేహా, ఆమీన్, మనీశ్ లతో పాటు మరో విద్యార్థి హమద్‌లను కూడా ఎత్తుకెళ్ళేందుకు ఉదయం వచ్చిన పోలీసులకు విద్యార్థులు అడ్డుగోడగా నిలిచారు. ఆ నలుగురు కూడా దీక్షను కొనసాగిస్తున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కూడా జంతర్ మంతర్ దీక్షా శిబిరంలో తక్షణమే నిరవధిక దీక్షకు దిగడమే కాకుండా, 20న చలో పార్లమెంట్ యథావిధిగా కొనసాగుతుందనడం ద్వారా పాలకుల ఆశలను నీరుగార్చారు. ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో ప్రభుత్వ తీరును ఖండించటమే కాకుండా, వాంగ్ చుక్‌కు అండగా నిలిచాయి.

ఈ సందర్భంగా గతంలో అన్నా హజారే ఇదే జంతర్‌మంతర్‌లో దీక్ష చేసిన ఘట్టాన్ని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం నిరంతరం ఆయనతో చర్చలు జరిపి, ఆయన కోరినట్లుగా చట్టాన్ని తీసుకువస్తామనే హామీతో దీక్ష విరమింపజేసింది. నేడు అందుకు పూర్తిగా విరుద్ధంగా, 21 రోజులుగా వాంగ్‌చుక్ దీక్షను మోదీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే పట్టించుకోవడం లేదు. ఇతరుల తప్పులనే ఎన్నడం నేర్చుకొని, తమ తప్పులను కప్పిపుచ్చటమే కాకుండా, ఎత్తిచూపిన వారిని నిరంకుశంగా అణిచివేయటం ఈ ప్రభుత్వానికి అలవాటే.

గతంలో ఢిల్లీ సరిహద్దులోని రైతుల నిరసన, జంతర్‌మంతర్ వద్ద 'ఒకే ర్యాంక్– ఒకే పెన్షన్' కావాలంటూ మాజీ సైనికాధికారుల నిరసన, తమపై అధికార పార్టీ ఎంపి ఆగడాలపై మహిళా రెజ్లర్ల నిరసన, షాహీన్‌బాగ్‌లో సిఎఎ నిరసనలపై ఇదే రీతిలో ఉక్కుపాదం మోపడాన్ని చూశాం. ఇప్పుడూ అదే జరుగుతోంది. అయితే, ఈ సారి ప్రభుత్వ నియంతృత్వ సెగలను నవతరం (జెన్‌జీ), గతంలో బిజెపికి అండగా నిలిచిన పట్టణ మధ్యతరగతి వర్గం చవిచూస్తుండడం కొత్త పరిణామం. తమ మొరను ప్రభుత్వం పట్టించుకోకపోయినా, నిర్బంధాలను, ఆటంకాలను దాటుకొని ప్రజలు కట్టుదప్పక శాంతిపథంలోనే తమ నిరసనను దేశ రాజధాని గడపకు చేర్చుతుండడం విశేషమే. ఇది భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల వారి అమోఘమైన విధేయతకు నిదర్శనమంటే అతిశయోక్తి కాదేమో.

ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేయక ఇప్పటికైనా ప్రభుత్వం మొండితనాన్ని వీడి, తమ సొంత ప్రజల మాటను ఆలకించటం పాలకులకు, దేశానికి శ్రేయస్కరం. నియంతృత్వం హద్దులు దాటితే ప్రజలు సహించబోరనేది చరిత్ర చెప్పిన సత్యం. ●

# వాస్తు, జ్యోతిష్యాలను నిరసించిన ఖగోళ శాస్త్రవేత్త... నార్లేకర్




డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త,
విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

వైజ్ఞానిక ప్రపంచంలో మన దేశం తలెత్తుకుని చెప్పుకోగల ఓ పది మంది శాస్త్రవేత్తలలో డాక్టర్ జయంత్ విష్ణు నార్లేకర్ ఒకరు, (19 జులై 1938 – 20 మే 2025) పాప్యులర్ సైన్స్ రచయితగా ప్రసిద్ధుడు. అంతే కాదు, సాహిత్యరంగంలో కూడా తనదైన ముద్ర వేసుకున్నవాడు. బహు గ్రంథకర్త. పూనాలో నెలకొల్పిన ఇంట ర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమి – (ఖగోళ శాస్త్ర అంతర్ విశ్వవిద్యాలయం కేంద్రానికి ప్రారంభదశలోనే డైరెక్టర్‌గా ఉన్నవాడు. జీవిత చరమాంకంలో కూడా జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో, సింపోజియాలలో చురుకుగా పాల్గొనేవాడు. దేశంలో దూరదర్శన్ ఒక్కటే ఉన్న రోజుల్లో అది ప్రసారం చేసే వైజ్ఞానిక కార్యక్రమాలలో తరచూ కనిపిస్తుండేవాడు.ఆ రోజుల్లో దూరదర్శన్ కార్యక్రమాలలో 'సురభి' అనే ప్రోగ్రాం ప్రత్యేకంగా ఉండేది. అందులో జయంత్ నార్లేకర్ శ్రోతలు/ప్రేక్షకులు అడిగిన వైజ్ఞానిక సంబంధమైన ప్రశ్నలకు జవాబులిస్తుండేవాడు. వారి సందేహాలు తీరుస్తూ ఉండేవాడు. వయసు మీద పడిన సమయంలో కూడా ఆయన తన పరిశోధనలు కొనసాగిస్తూనే వచ్చాడు. ముఖ్యం గా 'బ్లాక్ హోల్స్'మీద టఖియాన్స్ (Tachyons) మీద ఆయన పరిశోధనలు చెప్పుకోదగ్గవి. భూమ్యాకర్షణ శక్తి మీద ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, 1964లో అంటే, తన ఇరవై ఆరవ యేటనే విజ్ఞాన జగత్తును ఆశ్చర్యపరిచాడు – విశేషంగా ఆకర్షించాడు! ఫలితంగానే, 'భారతదేశపు ఐన్‌స్టీయిన్'గా ప్రశంసలందుకున్నాడు. ఇంతటి ప్రతిభావంతుడైన మన భారతీయ శాస్త్రవేత్త ఇటీవల రెండు నెలల కింద కన్నుమూస్తే, మన దేశంలో పత్రికలూ, మీడియా సంస్థ లు తమకేమీ పట్టనట్టు మిన్నకున్నాయి. ఎంత విషాదం? అదే రాజకీయ నాయకుల తిట్ల పురాణాలు, సినిమా, క్రికెట్ వార్తలు ఢంకా బజాయిస్తూ వెలుగులోకి తెస్తాయి. సమాజంలో వివేకం పెంచడానికి జీవితాలు ధారపోసిన వారిని పట్టించుకోవు.

జయంత్ నార్లేకర్ చిన్నతనం నుండే చురుకైన విద్యార్థిగా ఉండడానికి కారణం, వారిది విద్యావంతుల కుటుంబం. ఇంట్లో అందరికందరూ హేమహేమీలు. తండ్రి విష్ణు వాసుదేవ్ నార్లేకర్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్. తల్లి సుమతి నార్లేకర్ సంస్కృత పండితురాలు. తల్లి సోదరుడు – మామ, గణాంక శాస్త్ర నిపుణుడు. ఆయన దగ్గరైతే పిల్లవాడు వృద్ధిలోకి వస్తాడని తల్లిదండ్రులు జయంత్‌ను వారణాసిలోని మామగారింట్లో ఉంచారు. పుట్టిందైతే మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో – ఆ మామగారు చదువు విషయంలో చాలా కఠినంగా ఉండేవాడు. పొద్దున్నే లేచి నల్లబల్లమీద ఒక లెక్కరాసి ఉంచేవాడు. ఇక బాల జయంత్ నానా తంటాలు పడి ఆ లెక్క సాయంత్రంలోగా పూర్తి చేయాల్సిందే! లెక్కలు, భౌతికశాస్త్రం, ఖగోళశాస్త్రం ఇంట్లో ఎప్పుడూ చర్చనీయాంశాలవుతూ ఉండేవి. బాల్యంలో లభించిన ఆ వాతావరణం జయంత్ నార్లేకర్‌పై ఎంతో ప్రభావం చూపింది. బాల్యంలో అతను వారణాసిలోని హిందూ బోయ్స్ స్కూల్లో చదువుకున్నాడు. తర్వాత బెనారస్ విశ్వవిద్యాలయంలో 1957లో బిఎస్‌సిలో చేరాడు. తర్వాత లండన్ వెళ్ళి, అక్కడి కేంబ్రిడ్జి యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఫిడ్జి విలియం కాలేజిలో చేరాడు. అది ఒకప్పుడు తన తండ్రి విష్ణు వాసుదేవ్ నార్లేకర్ చదువుకున్న కళాశాలే. అక్కడి నుంచి జయంత్ గణిత శాస్త్రంలో బిఎ డిగ్రీ తీసుకున్నాడు. అయితే ఆయన సీనియారిటీని, సిన్సియారిటీని, ప్రతిభను గుర్తించి, చదవకుండానే వారు ఈయనకు ఎంఎ డిగ్రీ ప్రదానం చేశారు. ఇలాంటి సంఘటనలు సామాన్యంగా జరగవు కదా?

ఆ తర్వాత జయంత్ నార్లేకర్ ఫ్రెడ్ హొయిలీ దగ్గర పరిశోధన కోసం చేరాడు. ఆయన పర్యవేక్షణలో నార్లేకర్, పిహెచ్‌డి సాధించాడు. ఆ రోజుల్లోనే ఈయనకు రీసర్చ్ గైడ్‌గా ఉన్న ఫ్రెడ్ హొయిలీ కేంబ్రిడ్జిలో 'థియరిటికల్ ఆస్ట్రానమీ'– అనే సంస్థను ప్రారంభించాడు. అందులో నార్లేకర్ సీనియర్ ఫెలోగా ఉంటూ, తన గైడ్ హొయిలీకి పూర్తి సహాయ సహకారాలు అందించాడు. ఏవో ఇతర కారణాల వల్ల ఫ్రెడ్ హొయిలీ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అందువల్ల జయంత్ నార్లేకర్ కూడా ఇక అక్కడ కొనసాగలేక భారతదేశానికి తిరిగి వచ్చాడు. అన్ని అర్హతలున్నాయి కాబట్టి, రావడం రావడంతోనే ముంబాయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చిలో ప్రొఫెసర్‌గా చేరాడు. అక్కడ చాలాకాలం పనిచేశాడు. అక్కడ థియరిటికల్ ఆస్ట్రోఫిజిక్స్ గ్రూపును తయారు చేసుకున్నాడు. అనతికాలంలో ప్రపంచ వైజ్ఞానికుల దృష్టిని ఆకట్టుకున్నాడు. అందుకు కొన్ని కారణాలున్నాయి.

పరమాణువంతటి వస్తువు పెద్ద శబ్దం చేస్తూ విచ్ఛిన్నమవడంవల్ల ఈ నక్షత్రాలు, గేలక్సీలు, న్యుబులేల వంటివి ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞుల నమ్మకం. కానీ, అందుకు వ్యతిరేకంగా నార్లేకర్ స్టెడీ స్టేట్ థియరీ ని ప్రవేశపెట్టాడు. దీని ప్రకారం పదార్థం నక్షత్రాలుగా, గెలాక్సీలుగా, ఇతర ఆకారాలుగా విశ్వమంతా సమానంగా వ్యాపించి ఉంది. ఒకవేళ గెలక్సీల కదలికవల్ల, తీవ్రమైన వేగంవల్ల ఎక్కడైనా ఖాళీలు ఏర్పడితే వాటిని కొత్తగా ఏర్పడ్డ పదార్థం పూరిస్తూ ఉంటుంది. 'స్టెడీ స్టేట్ థియరీ'తో పాటు, తన పరిశోధక గురువు ఫ్రెడ్ హొయిలీతో పనిచేస్తున్నప్పుడు నార్లేకర్, గురుత్వాకర్షణపై కూడా కృషి చేశాడు. చిన్న వయసులోనే తన అసమాన ప్రజ్ఞ ప్రదర్శించి, వైజ్ఞానిక ప్రపంచాన్ని అబ్బురపరిచి, తన స్థానం సుస్థిర పరుచుకున్నాడు. ఇక భారతదేశానికి తిరిగి వచ్చి, ఇక్కడి టాటా ఇన్‌స్టిట్యూట్‌లో తన విద్యార్థులతో అనేక పరిశోధనలు చేయించాడు. బ్లాక్ హోల్స్ కంటే, వెలుతురు కణాల కంటె వేగంగా ప్రయాణించగల టఖియాన్స్ మీద జరిపించిన పరిశోధనలు విలువైనవి. ఒక చెంచా వెడల్పుగల బ్లాక్ హోల్ బరువు కొన్ని టన్నులుంటుంది. దాని ఉపరితలం నుంచి కనీసం వెలుగు రేఖల్ని కూడా అది పోనీయదు. నార్లేకర్ ప్రతిపాదించిన దాన్ని బట్టి బ్లాక్ హోల్ టఖియాన్స్‌ని తనలో ఇముడ్చుకుని (పీల్చుకుని) తన ఉపరితల వైశాల్యాన్ని తగ్గించుకోగలుగుతుంది. అందువల్ల టఖియాన్స్‌ని వెతకడం అంటే తగ్గిపోతున్న బ్లాక్ హోల్స్‌ని వెతకడమే!



జయంత్ నార్లేకర్ నిర్వహించిన ఉన్నత పదవులు, స్వీరించిన అత్యున్నత పురస్కారాలు ఎన్నో ఉన్నాయి. 1981లో వరల్డ్ కల్చరల్ కౌన్సిల్‌కు ఈయనే సంస్థాపక సభ్యుడు. 1988లో పూణేలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమి అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ కు తొలి డైరెక్టరయ్యాడు. ఆ కాలంలోనే అంతర్జాతీయ ఆస్ట్రానమికల్ యూనియన్‌కు అధ్యక్షుడయ్యాడు. బోధన, పరిశోధనలకు మాత్రమే కాకుండా, ఈయనకు రచనలో కూడా ప్రవేశముంది గనుక, భారతప్రభుత్వం నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సిఇఆర్‌టి) కి చైర్మన్‌గా నియమించింది. ఆ కాలంలోనే నార్లేకర్ వాస్తు శాస్త్రం, జ్యోతిష్యాలను తీవ్రంగా దుయ్యబట్టారు. నిరూపణ లేని వాటిని శాస్త్రం – సైన్సు అని అనగూడదనీ, అలాంటివన్నీ – "సూడో సైన్స్" అని ప్రకటించాడు. భారతప్రభుత్వం నుండి 1965లో పద్మభూషణ్, 2004లో పద్మవిభూషణ్ వంటి పౌర సన్మానాలు స్వీకరించాడు. ఆయన చేసిన సరళ విజ్ఞాన శాస్త్ర ప్రచారాన్ని గుర్తించి యునెస్కో 1996లో కళింగ ప్రైజ్ ప్రకటించింది. ఇంకా లెక్కలేనన్ని అంతర్జాతీయ మెడల్సూ, బహుమతులు స్వీకరించాడు. ఆ లిస్టు చాలా పెద్దది.

వైజ్ఞానిక పరిశోధనా రంగంలోనే కాకుండా జయంత్ నార్లేకర్ సాహిత్యరంగంలో కూడా విశేషమైన కృషి చేశాడు. మరాఠీ భాషలో తొమ్మిది; ఇంగ్లీషులో మూడు; హిందీలో ఒకటి – ఇలా పలు సృజనాత్మ క రచనలు ప్రకటించాడు. అందులో 'చార్ నగరాంతలే మాజే విశ్వ' – అని, ఆయన మరాఠీలో రాసుకున్న ఆత్మకథకు 2014లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. 2021 నాసిక్‌లో జరిగిన 94వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించాడు. పాపులర్ సైన్స్ రచయితగా నార్లేకర్ రాసిన పుస్తకాలలో ఒకటి తెలుగులో కూడా "ఆలోకం" పేరుతో అనువదించబడింది. ఈయన 'యూనివర్స్' అనే టి.వి. సీరియల్‌ను 1995లో దూరదర్శన్ ప్రసారం చేసింది. ఆ సంవత్సరమే ఇందిరా గాంధీ సైన్స్ పాపులరైజేషన్ అవార్డు స్వీకరించాడు. మరీ ముఖ్యంగా 1986–90 మధ్యకాలంలో నాలుగేళ్లపాటు భారత ప్రధానికి సైన్సు సలహాదారుగా ఉన్నాడు.

జయంత్ నార్లేకర్ భార్య మంగళ నార్లేకర్ కూడా గణితశాస్త్ర పరిశోధకురాలే. ఆమె కూడా ప్రొఫెసర్‌గా పనిచేసింది. ఈ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వారంతా ఉన్నత విద్యావంతులు. పెద్దమ్మాయి గీత కాలిఫోర్నియా యూనివర్సిటీలో బయో మెడికల్ రీసెర్చ్ చేసింది. తరువాత వాళ్ళు – గిరిజ, లీలావతి కంప్యూటర్ సైన్స్ రంగాన్ని ఎంచుకున్నారు. భార్య మంగళ – జయంత్ నార్లేకర్ కన్నా రెండేళ్ళ ముందే చనిపోయింది. ఇక జయంత్ నార్లేకర్ ఎనభై ఆరేళ్ళ వయసులో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ, 2025, మే 20న మహారాష్ట్ర – పూణేలో స్వంత ఇంట్లో నిద్రలోనే ప్రశాంతంగా కన్నుమూశారు. ఎన్ని గౌరవాలు లభించినా, ఆయన తన కృషిని చివరి క్షణం వరకు ఆపలేదు.

నిత్య శోధకుడిలా, నూతన విద్యార్థిలా, కొత్త కొత్త పథకాలతో కొత్త దిశలు వెతుకుతూనే వచ్చాడు. మృదుభాషి, వినయ సంపన్నుడు, స్నేహశీలి అయిన జయంత్ నార్లేకర్ వ్యక్తిత్వం, వైజ్ఞానిక – సాహిత్య కృషి నేటి యువతరానికి ఆదర్శప్రాయం కావాలి!

శాస్త్రవేత్తల పరిశోధనలన్నీ, పరిశోధనల ఫలితాలన్నీ సమాజానికి లభిస్తున్నందువల్లనే – సమాజం త్వరితగతిన ప్రగతి పథాన పయనిస్తోంది. అలాంటప్పుడు వారిని ఆయా రంగాలకు మాత్రమే పరిమితం చేయకుండా, తెరవెనుక ఉండి కృషి చేస్తున్న 'సంఘ సంస్కర్తలు'గా గుర్తుంచుకోవాలి. వివేకవంతమైన సమాజం ఎప్పుడూ సమాజ నిర్మాణంలో భాగస్వాములయ్యే వారిని–అందరినీ గుర్తించుకుంటూ ఉండాలి!గౌరవించుకుంటూ ఉండాలి!! అప్పుడే అది ఆరోగ్యకరమైన సమాజం అవుతుంది.

*(19 జులై జయంత్ విష్ణు నార్లేకర్ జయంతి )*

# మహిళల రాజకీయ ప్రాతినిధ్యం.. నెరవేరని వాగ్దానం

భారత స్వాతంత్ర్యోద్యమం నుంచి మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నప్పటికీ, శాసనసభలు, పార్లమెంట్ వంటి నిర్ణయాత్మక వేదికల్లో వారి ప్రాతినిధ్యం ఇప్పటికీ చాలా తక్కువగానే ఉంది. ప్రస్తుతం లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం సుమారు 14 శాతం మాత్రమే కాగా, రాష్ట్ర శాసనసభల్లో అది సగటున 9 శాతానికి పరిమితమైంది. రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎంపికలో మహిళలకు సమాన అవకాశాలు లభించకపోవడం దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చాలనే లక్ష్యంతో దాదాపు ఐదు దశాబ్దాలుగా మహిళా సంఘాలు, మహిళా నాయకులు శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. 2023లో పార్లమెంట్ 'నారీ శక్తి వందన్ అధినియమ్'ను ఆమోదించి లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలని నిర్ణయించినప్పటికీ, జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన పూర్తయ్యాకే అది అమల్లోకి వస్తుందని నిబంధన విధించడంతో ఈ చట్టం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.

**పునర్విభజన రాజకీయాలు..**

కేంద్ర ప్రభుత్వం 2026లో మహిళల రిజర్వేషన్ అమలును వేగవంతం చేస్తామని ప్రకటిస్తూ మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. వాటిలో రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఉన్నాయి. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచాలని భావించారు. అయితే ఈ విస్తరణకు స్పష్టమైన రాజ్యాంగ హామీలు లేకపోవడం, రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గదనే హామీని చట్టంలో పొందుపరచకపోవడం, అలాగే ఎన్నికల సమయంలోనే ఈ బిల్లులను ప్రవేశపెట్టడం తీవ్ర విమర్శలకు దారితీసింది.


చివరకు రాజ్యాంగ సవరణ బిల్లు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోవడంతో విఫలమైంది. దాంతో మిగిలిన బిల్లులను కూడా ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, మహిళల రిజర్వేషన్ అసలు లక్ష్యం కాకుండా నియోజకవర్గాల పునర్విభజనకు రాజకీయంగా మార్గం సుగమం చేయడమే ఈ ప్రయత్నం వెనుక ప్రధాన ఉద్దేశం. మహిళల రిజర్వేషన్‌ను లోక్‌సభ విస్తరణకు ముడిపెట్టాల్సిన రాజ్యాంగపరమైన అవసరం లేదని వారు వాదిస్తున్నారు.

**నియోజకవర్గాల పునర్విభజనపై సమాఖ్య ఆందోళనలు**

నియోజకవర్గాల పునర్విభజన ప్రస్తుతం అత్యంత వివాదాస్పద అంశంగా మారింది. రాజ్యాంగం ప్రకారం జనాభా ఆధారంగా రాష్ట్రాలకు లోక్‌సభ స్థానాలు కేటాయించాలి. అయితే కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు ప్రాతినిధ్యం కోల్పోకుండా ఉండేందుకు 1971 జనాభా లెక్కల ఆధారంగా స్థానాల పంపిణీని 2026 వరకు నిలిపివేశారు. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చి తాజా జనాభా ఆధారంగా స్థానాలను పునర్విభజిస్తే, జనాభా వేగంగా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది. ఫలితంగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రభావం తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా నియోజకవర్గాల సరిహద్దుల నిర్ణయంలో పారదర్శకత లేకపోతే రాజకీయ ప్రయోజనాల కోసం సరిహద్దులను మార్చే 'జెరిమాండరింగ్' ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నా రు.

**ప్రజాస్వామ్య సమతుల్యతకు సవాళ్లు**

మహిళల రిజర్వేషన్ భారత ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన సంస్కరణ అనే విషయంలో పెద్దగా విభేదాలు లేవు. అయితే దానిని లోక్‌సభ విస్తరణ, నియోజకవర్గాల పునర్విభజన వంటి విస్తృత రాజ్యాంగ మార్పులతో ముడిపెట్టడం కొత్త రాజకీయ వివాదాలకు దారితీస్తోంది. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరగడం వల్ల హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాల రాజకీయ బలం మరింత పెరిగి, జాతీయ రాజకీయ సమీకరణాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ పరిణామం భవిష్యత్తులో అధికార పార్టీకి దీర్ఘకాలిక ఎన్నికల ఆధిక్యాన్ని కల్పించే విధంగా రాజకీయ వ్యవస్థను పునర్నిర్మించవచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. అందువల్ల మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడం ఎంత అవసరమో, అదే సమయంలో సమాఖ్య వ్యవస్థ, ప్రాంతీయ సమతుల్యత, సమాన ప్రాతినిధ్యం వంటి రాజ్యాంగ సూత్రాలను కాపాడటం కూడా అంతే కీలకం. మహిళల రిజర్వేషన్‌ను మరింత ఆలస్యం చేయకుండా అమలు చేయడం ప్రజాస్వామ్య అవసరం. అయితే దానిని ఇతర వివాదాస్పద రాజ్యాంగ మార్పులతో అనవసరంగా అనుసంధానించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది.




www.prajapakshAM.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

టిఎంసి రెబల్స్‌కు ప్రత్యేక సీట్లు

పార్లమెంటులో 'తుఫాన్'కు అధికార, ప్రతిపక్షాలు సిద్ధం

విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలి 07

సంపుటి 09, సంచిక: 229 | ఆదివారం | 19-07-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# పోడు భూములపై నిర్బంధాలు ఆపాలి

## గిరిజన హక్కుల రక్షణకు పోరాడుదాం

- ఉపాధిహామీ పథకాన్ని రక్షించుకుందాం : సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా
- అణచివేతలపై ఉద్యమించక తప్పదు : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- ఘనంగా ప్రారంభమైన గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు
- కదం తొక్కిన గిరిజనం, భారీ ప్రదర్శన, హోరెత్తిన నినాదాలు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/పాల్వంచ

గిరిజనుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిలభారత ఆదివాసీ మహాసభ ఇన్‌చార్జి, సిపిఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా పిలుపునిచ్చారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో తెలంగాణ గిరిజన సమాఖ్య(టిజిఎస్) రాష్ట్ర 3వ మహాసభలు ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ నుండి దమ్మపేట, అంబేద్కర్ సెంటర్ల మీదుగా భారీ ప్రదర్శన పాత ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గల అమరజీవి సిద్ధి వెంకటేశ్వర్లు స్మారక స్థూపం వరకు సాగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషాతో కలిసి ఆమె సిద్ధి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ప్రధాన రహదారిపై సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. అడుగడుగునా చేసిన నినాదాలతో పాల్వంచ మార్మోగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో అనీ రాజా మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. పోడు సాగుదారులపై జరుగుతున్న నిర్బంధాలను అణిచివేతలను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. అడవులను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. సహజ వనరులపై ఆదివాసీలకు ఉన్న తరువాయి 8లో

## బలవంతంగా ఆసుపత్రికి

# సోనమ్ తరలింపు

**జంతర్‌మంతర్ వద్ద కొద్దిసేపు పరిస్థితి ఉద్రిక్తం**



- పోలీసులు నాపై దాడి చేశారని అభిజీత్ దీప్కే ఆరోపణ
- నిరాహార దీక్ష ప్రారంభించిన సిజెపి వ్యవస్థాపకుడు
- సిరాతో మహిళ దాడి
- సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో వాంగ్‌చుక్‌కు చికిత్స
- పోలీసుల దురుసు ప్రవర్తనపై భగ్గుమన్న ప్రతిపక్ష నేతలు
- ముంబయిలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతల ఆందోళన, అరెస్టు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 21 రోజులుగా చేస్తున్న నిరవధిక నిరాహారదీక్షను శనివారం పోలీసులు అడ్డుకుని బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, వైద్యుల సలహా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. వాంగ్‌చుక్‌ను తరలించే క్రమంలో జంతర్ మంతర్ వద్ద హైడ్రామా నెలకొంది. కొంతమంది నిరసనకారులు అడ్డుపడటానికి ప్రయత్నించడంతో స్వల్ప గందరగోళం నెలకొంది. నిరసనకారులు తమ ఆందోళనను విరమించుకోవాలని, నిరసన స్థలాన్ని వీలైనంత త్వరగా శాంతియుతంగా ఖాళీ చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. కొద్దిసేపటికే, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం నాడు నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. తమ ఉద్యమం ఆగదన్నారు. నిరవధిక తరువాయి 8లో




వాంగ్‌చుక్ తరలింపునకు నిరసనగా ముంబాయిలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతల ఆందోళన, అరెస్ట్


### వాంగ్‌చుక్ తరలింపుపై అనుమానాలు : సిపిఐ

శాంతియుత నిరాహార దీక్ష చేస్తున్న ప్రదేశం నుండి సోనమ్ వాంగ్‌చుక్‌ను తరలించడం అనేక తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో సంప్రదింపులు జరిపి, వారి న్యాయమైన డిమాండ్లకు స్పందించడానికి బదులుగా, ప్రభుత్వం మరోసారి బలప్రయోగ, నిర్బంధ మార్గాన్ని ఎంచుకుందని మండిపడ్డారు. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుల వెనుక ఢిల్లీ పోలీసులు దాక్కోలేరని, సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని కోర్టు ఆదేశించిందన్నారు. అతని ఇష్టానికి వ్యతిరేకంగా నిరసన తరువాయి 8లో

ఇస్రో వేదిక నుండి భారత తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం

## విక్రమ్–1 విజయవంతం

- దేశ అంతరిక్ష యాత్రలో కీలకఘట్టం : మోదీ
- హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ నిర్వాహకులకు ప్రశంసలు



**శ్రీహరికోట :** ప్రైవేటురంగంలో నూటికి నూరు శాతం పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందిన విక్రమ్–1 (టెస్ట్‌ఫ్లైట్–1) రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. 450 కి.మీ ఎత్తులోకి సమీక్ష భూకక్షలోకి దూసుకువెళ్ళిన ఈ సబ్–ఆర్బిటల్ రాకెట్(కృత్రిమ ఉపగ్రహం కాదు) విజయవంతంగా తన లక్ష్యమైన బాహ్య అంతరిక్షాన్ని చేరుకుంది. కేవలం 28 ఏళ్ళ వయసుగల హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే స్కైరూట్ ఏరోస్పేస్ నిర్వాహకులు పవన్‌కుమార్ చందన (వ్యవస్థాపకుడు), నాగ భరత్ డాకా(సహవ్యవస్థాపకుడు)ల నాయకత్వంలో ఈ ప్రైవేట్ రాకెట్ నిర్మించారు. ఈ ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా వారిద్దరికీ ఫోన్‌చేసి తరువాయి 12లో

# ఏడాదిలో 70వేల ఉద్యోగాలు

- మేకతోలు కప్పుకున్న తోడేలులాగా నిస్సిగ్గుగా కెటిఆర్ ప్రేలాపనలు
- దోచుకునేందుకు కల్వకుంట్ల కుటుంబానికే ఉద్యోగాలు
- పదేళ్లలో ఉద్యోగాలివ్వకుండా పరీక్షా పత్రాలను అమ్ముకున్నారు
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపాటు
- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ఘట్‌కేసర్

పదేళ్ల కాలంలో ఒక్క ఉద్యోగమైనా ఇవ్వకుండా పరీక్షా పత్రాలను పల్లీలు, బఠాణీల్లా అమ్మి కోట్లాది రూపాయలు వెనుకేసుకున్న బిఆర్‌ఎస్ పాలకులు నిరుద్యోగులను నిలువునా వంచించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కెటిఆర్ మాత్రం కెసిఆర్ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నియామకాలు చేస్తోందంటూ మేకతోలు కప్పుకున్న తోడేలులాగా నిస్సిగ్గుగా ప్రేలాపనలు చేస్తున్నారన్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలను కెసిఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో నిర్లక్ష్యంతో వదిలేయగా, 16 ఏళ్ల తర్వాత తమ ప్రభుత్వం 2026లో గ్రూప్–1 పరీక్షలు నిర్వహించిందన్నారు. అధికారం చేపట్టిన తరువాయి 8లో

# నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల్లోంచి తప్పుకుంటా

- పోలీసు ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటారా?'
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు మండిపాటు
- సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సు



ప్రజాపక్షం/రంగారెడ్డి

'70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. రాహుల్‌గాంధీకి జై కొడతా. నోటిఫికేషన్లతో సహా నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. పోలీసు ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటారా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు విరుచుకుపడ్డారు. తెలంగాణలో నిరుద్యోగ యువత సమస్యలు, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలను ప్రధాన అజెండాగా తీసుకొని బిఆర్‌ఎస్ పార్టీ శనివారం సరూర్ నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహించింది. సదస్సుకు శాసనసభ పక్ష ఉపనేత పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో కలిసి కెటిఆర్ ముఖ్యఅతిథిగా తరువాయి 8లో


కల్తీల నిరోధానికి కఠిన చట్టం

సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి : సిఎం రేవంత్‌రెడ్డి

10

మహిళా సాధికారతే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్‌కు స్థలాల కేటాయింపు




# తెలుగులో ఉత్తమ చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'

- జాతీయ ఉత్తమ చిత్రం 'ఆర్టికల్ 370'
- ఉత్తమ నటులు మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్
- ఉత్తమ నటి యామి గౌతమి
- 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన







**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను శనివారం ప్రకటించింది. ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ జాతీయ చలనచిత్ర అవార్డుల విజేతల జాబితాను జ్యూరీ విడుదల చేసింది. 2024 డిసెంబర్ దాకా సెన్సార్ అయిన సినిమాలను ఈ అవార్డులకు పరిశీలించారు. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 ఎంపిక కాగా, తెలుగులో ఉత్తమ చిత్రంగా కొణిదెల నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రాళ్లు' ఎంపికైంది. అలాగే ఉత్తమ నటుడి అవార్డును మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి (భ్రమయుగం), కార్తిక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) సంయుక్తంగా దక్కించుకున్నారు. ఉత్తమ నటి అవార్డు యామి గౌతమి (ఆర్టికల్ 370)కి లభించింది. నిజానికి ఈనెల మొదటి వారంలోనే అవార్డులను ప్రకటించాల్సి ఉండింది. కానీ, జ్యూరీ సభ్యుల షెడ్యూల్ కారణంగా ఎంపిక ఆలస్యమైంది. భారత సినిమా రంగంలో ఈ అవార్డును అత్యున్నత పురస్కారంగా భావిస్తారు. ఇందులో ఫీచర్, నాన్ ఫీచర్ సినిమాల్లో నటన, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, సంగీతం, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ ఇతర టెక్నికల్ తరువాయి 8లో

# రాష్ట్రంలో ఎల్‌నినోపై అధ్యయనం

- డాక్టర్ జి. చిన్నారెడ్డి చైర్మన్‌గా 27 మంది సభ్యులతో నిపుణుల కమిటీ ఏర్పాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయం, అనుబంధ రంగాలపై చూపే ప్రభావాన్ని అధ్యయనం చేసి నివారణ చర్యలు సూచించేందుకు తెలంగాణ ప్రభుత్వం 27 మంది సభ్యులతో ఉన్నత స్థాయి వివిధ విభాగాల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు (ఆర్‌టిఈ నెం.427) శనివారం జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డిని కమిటీ చైర్మన్‌గా నియమించగా, తరువాయి 12లో

## వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలి

ఆర్ఐ విజయ్ భాస్కర్



**ప్రజాపక్షం/నారాయణపేట:** నారాయణపేట జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం రోజు ఎంటిఒ ఆర్ఐ విజయభాస్కర్ పోలీసు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉపయోగించే ప్రతి పోలీసు వాహనం ఎల్లప్పుడూ సాంకేతికంగా మెరుగైన స్థితిలో ఉండేలా చూసుకోవాలని, వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని పోలీసు డ్రైవర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వాహనాలు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించడంలో కీలక పాత్ర శుభ్రపరచడంలో పాటు ఇంజిన్, బ్రేకులు, టైర్లు, లైట్లు, సైరన్ బ్యాటరీ తదితర భాగాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, రాత్రివేళల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు డ్రైవర్లు పూర్తి ఏకాగ్రతతో వాహనాలు నడపాలని, సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, ఇంధన వినియోగం, సర్వీసింగ్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. పోలీసు వాహనాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటే అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ తనిఖీ సందర్భంగా పోలీసు డ్రైవర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/ వెల్దండ :** మండల కేంద్రానికి చెందిన భయ్య జగదీష్ ఇటీవలే మృతి చెందాడు. దీంతో మండల కేంద్రానికి చెందిన గణేష్ యూత్ సభ్యులు జగదీష్ కుటుంబాన్ని పరామర్శించి రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ జగదీష్ సే వాభావం కల్గిన యువకుడని, ఆయన అకాల మరణం అందరిని తీవ్ర ది గ్ర్భాంతికి గురి చేసిందన్నారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహాయం గా ఈ ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా జగదీష్ కుటుంబానిక అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరో సా ఇచ్చారు. గణేష్ యూత్ సభ్యుల ఈ ఉదారతను స్థానికులు అభినందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరి త్వరగా కోలుకోవాలని పూజలు



**ప్రజాపక్షం/మాగనూర్:** జ్వరంతో బాధపడుతున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని కోరుతూ మాగనూరు మండల కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాగనూరులోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో మంత్రి ఆరోగ్యం కుదుటపడాలని ప్రత్యేక అభిషేకాలు అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివరాంరెడ్డి, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, మండల కాంగ్రెస్, యూత కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పలువురు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచ్‌లు మాజీ ఎంపీటీసీలు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

## పంచలింగాల స్టేజీ వద్ద రోడ్డు ప్రమాదం



**ప్రజాపక్షం/అలంపూర్:** జోగులాంబ గద్వాల్ జిల్లా మానవపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన చాకలి రాముడు తన కూతురిని అల్లుడి ఇంటి నుంచి తీసుకుని బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. పంచలింగాల స్టేజి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో చాకలి రాముడి కూతురి తల బస్సు టైర్ కింద నుజ్జు నుజ్జు కావడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. తండ్రి చాకలి రాముడికి తీవ్ర గాయాలయ్యాయి.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి:** మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన గండుబాల్ చంద్రయ్య శనివారం ఉదయం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచి చింతకింది కృష్ణమ్మ విష్ణు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వేనిపల్లి గణేష్ రావు మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేసి, బిఆర్ఎస్ పార్టీ పరంగా ఆదుకుంటామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఉన్నారు.

## 'నీట్'లో మెరిసిన అజయ్ గౌడ్



**ప్రజాపక్షం/అయిజ:** అయిజ మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామంలో ఆల్ ఇండియా నీట్ ర్యాంకులో మెరిసిన మరో ఆణిముత్యం అజయ్ గౌడ్ వివరాల్లోకి వెళితే చిన్న తాండపాడు గ్రామస్తుడు బుజ్జిగౌడ్ (మాజీ టీడీపీ సుధాకర్ గౌడ్ తమ్ముని) కుమారుడు అజయ్ గౌడ్ మొన్న రాసిన నీట్ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకులో (277వ ర్యాంక్) 720 మార్కులకు గాను 680 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడని సుధాకర్ గౌడ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించడం చాలా గర్వంగా ఉందని ప్రతి ఒక్కరూ ఇలా కష్టపడితే తప్పకుండా ఉన్నత విద్యలను పొంది కీర్తి ప్రతిష్టలు నిలుపుకుంటారని అన్నారు. తమ గ్రామ అబ్బాయి ఉన్నత విద్యను అభ్యసించడం మాకెంతో గర్వకారణమని గ్రామస్తులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు.

# 'సర్' ప్రక్రియ వేగంగా పూర్తి చేస్తే నగదు బహుమతులు

తొలి బహుమతి రూ.10 వేలు
రెండో బహుమతి రూ.5 వేలు
మంత్రి జూపలి కృష్ణారావు



**ప్రజాపక్షం/వీపనగండ:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సమర్థవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని మంత్రి సమీక్షించి ప్రతి గ్రామంలో చేపడుతున్న నమోదు ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రక్రియ మందకొడిగా సాగుతున్నట్లు గుర్తించిన మంత్రి, వెనుకబడిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బిఎల్ఒ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి, ఉద్యోగాలు, విద్య తదితర కారణాలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, వారిని ఫోన్ ద్వారా సంప్రదించి అవసరమైన వివరాలను సేకరించి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పూర్తి పారదర్శకతతో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ప్రతీ బిఎల్ఒ, బిఎల్ఏ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా, అనర్హుల పేర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10,000, రెండో బహుమతి నిలిచిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈ ప్రోత్సాహకాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, వీపనగండ్ల సర్పంచు మీసాల పార్వతమ్మ, బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, కాల్వరాల సర్పంచు రాముడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల నారాయణరెడ్డి, రవీందర రెడ్డి, గోపి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

### లబ్ధిదారులకు 5 ఎకరాల భూమి

**పెద్దకొత్తపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ ఆధ్వర్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని గ్రామాల స్వచ్ఛంద పునరావాస పథకం1 లబ్ధిదారులకు బాచార గ్రామ ఫారెస్టులో ఇండ్ల స్థలాలతో పాటు ఇండ్లను నిర్మించుకోవడానికి రూ.15 లక్షలతో పాటు ఐదు ఎకరాల భూమిని పంపిణీ చేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని సార్లపల్లి, గుడి చింతలబైలు, తాటిగుండాల పెంట, కొల్లంపెంట గ్రామాల లబ్ధిదారులకు బాచారం ఫారెస్టు ప్రాంతంలో ఇండ్ల స్థలాల పట్టాలను లాటరీ పద్ధతిలో మంత్రి జూపల్లి కృష్ణా రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ అమ్రాబాద్ అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు ప్రతిరోజు వన్యప్రాణుల మధ్య భయాందోళనలతో జీవించడం బాధకరమని ఈనేపథ్యంలో ప్రభుత్వం మొదటి విడతలో 256 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబానికి 5 ఎకరాల భూమితో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.15 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. అదే విధంగా పునరావాస కాలనీలలో అన్ని మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, రహదారులు క్రీడా వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగా ఈ పథకంలో భాగస్వాములైన ప్రజలకు మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, మార్కెట్ చైర్మన్ దండ నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సత్యం, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. .

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా చర్యలు

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగేలా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. తరగతుల వారీగా చేరికలు తగ్గిన పాఠశాలలను ఎంఈవోలు క్షేత్రస్థాయిలో సమీక్షించి, కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించి విద్యార్థుల నమోదును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, అమలవుతుండడమే కాక సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్న విషయాన్ని వివరిస్తూ విద్యార్థులను చేర్పించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదును ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు నమోదైన విద్యార్థుల వివరాలను వెంటనే యుడైస్ పోర్టల్‌లో నమోదు పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ నమోదు పూర్తి చేయాలని ఎలాంటి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతినెల 15వ తేదీలోగా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అపార్ నమోదు పెరగాలని, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు రెన్యువల్, కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి , అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం నిధులతోనే రాష్ట్రాల అభివృద్ధి



**ప్రజాపక్షం/గట్టు:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల కార్యకర్తలు, పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం ఉపాధి హామీపథకం ద్వారా నిధులు కేటాయిస్తున్నందున పల్లె ప్రకృతి వనాలు, స్మశాన వాటికలు, సీసీ రహదారులు నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. కేంద్రం నిధుల కేటాయింపు విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించే విధంగా కార్యకర్తలు సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సురేష్, కిట్టు, స్వామి, హరి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ల కొరతతో రోగులకు ఇబ్బంది

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను సిపిఎం నాయకులు శనివారం పరిశీలించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సర్వే నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డ్యూటీ డాక్టర్‌కు సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు నక్క ఈశ్వర్ మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రిగా ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజలకు అవసరమైన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని విమర్శించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పలుమార్లు ఆసుపత్రిని సందర్శించిన సందర్భాల్లో డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ రెగ్యులర్ పీజీ డాక్టర్ల నియామకం జరగలేదని తెలిపారు. పేరుకు మాత్రమే 30 పడకల ఆసుపత్రిగా కొనసాగుతున్న ఈ వైద్యశాలలో ప్రజలకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందడం లేదని, ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ పీజీ డాక్టర్లను నియమించి, పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీహెచ్ వెంకటయ్య, వెంకటేశ్వర్ల గౌడ్, మధుగని, రామకృష్ణ,జెట్టి నవీన్, వెంకన్నగౌడ్, నరసింహ, శరత్, శ్రీకాంత్, అనుకొలి రాజుతో పాటు పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు డిఎపి అమ్మకాలు..పట్టించుకోని అధికారులు

అధిక ధరలు నియంత్రించకపోతే ఆందోళన తప్పదు
బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు



**ప్రజాపక్షం/మక్తల్ :** అధికారుల నిర్లక్ష్యం వల్ల మక్తల్‌లో ఫర్టిలైజర్ వ్యాపారులు అధిక ధరలకు డిఎపి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు ముదిరాజ్ డిమాండు చేశారు. శనివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మక్తల్ మండలంలో డిఎపి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నియంత్రణ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫర్టిలైజర్ వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలను పెంచి అమ్ముతున్నారని అన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పి 1350 ఉంటే రూపాయలు ఉంటే 19వందలు నుండి రూ.2500 వరకు విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. రైతులు వర్షాలు రాక ఎన్నో ఇబ్బందులకు గురై విత్తనాలు వేసిన వర్షాలు రాకపోవడంతో అప్పుల పాలై మదన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో పాటు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసి పంటలు వేయడంతో రైతులు నష్టపోయి అప్పుల పాలు అవుతున్నారని అన్నారు. వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి రైతులను నట్టేట ముంచుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. స్థానిక అధికారులతో పాటు జిల్లా అధికారులు స్పందించి అధిక ధరలకు డిఎపి విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం స్పందించి ఎరువుల అధిక ధరలను నియంత్రించకుంటే నారాయణపేట జిల్లా కిషన్ మోర్చా తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్ హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాంరెడ్డి, మక్తల్ మండల అధ్యక్షుడు ఎం.ప్రతాపరెడ్డి, మహాద్వార్ సర్పంచ్ డా.శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ మహదేవమ్మ, ఖానాపురం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు సంతలో అక్రమ వసూళ్లు

**ప్రజాపక్షం/పెబ్బేరు:** తెలంగాణ రాష్ట్రంలోని కాకుండా దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధమైనటువంటి పెబ్బేరు సంత ప్రస్తుత అక్రమార్కుల కబంద హస్తాలతో నలిగిపోతుంది. పెబ్బేరు మున్సిపాలిటీకి కోట్ల రూపాయల ఆదాయం వచ్చే సంత నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయింది. పెబ్బేరు మున్సిపాలిటీకి సంబంధం లేకుండా పాత కాంట్రాక్టర్లే నిరంతరం సంతలో పెబ్బేరు మున్సిపాలిటీ పేరు మీద రసీదు లిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రతి సంవత్సరం గతం లో గ్రామపంచాయితీ ప్రస్తుత మున్సిపాలిటీ అయిన పెబ్బేరు పురపాలక సంఘం తైబజారు,గొర్ల వేలం, పశువుల వేలం విడివిడిగా నిర్వహిస్తూ సంవత్సరం కాలం పాటు ప్రస్తుతం నిర్దేశించిన టాక్స్ వసూలు చేయడానికి కాంట్రాక్టర్లకు పర్మిషన్ ఇచ్చేది. స్థల వివాదంలో మున్సిపాలిటీ అధికారులు వేలం నిర్వహించడం లేదు. అయినప్పటికీ పాత సంత కాంట్రాక్టర్లే నిరాటంకంగా, ఇష్టారాజ్యంగా, చేతికి అందినంత టాక్స్‌లు వసూలు చేస్తూ ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని తమ సొంత ఖాతాలో వేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు జిల్లా యంత్రాంగానికి తెలిసినప్పటికీ హై కోర్టులో కేసుల నేపథ్యంలో ప్రేక్షక పాత్ర వహించారు. దీంతో కోట్ల రూపాయల ఆదాయం పెబ్బేరు మున్సిపాలిటీ కోల్పోతుంది. మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండానే పురపాలక సంఘం పెబ్బేరు పేరు మీద రసీదులు ముద్రించి బాహాటంగా పన్నులు వసూలు చేస్తే అడిగే నాథుడే లేకుండా పోయాడు. ఇప్పటికైనా నూతన బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ గణేష్, జిల్లా యంత్రాంగం పెబ్బేరు సంతలో ప్రతి శనివారం జరుగుతున్న అక్రమ వసూళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రయవిక్రయాలకు ఎలాంటి ఆటంకం జరగకుండా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ లక్ష్మణజ తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్య, వసతి, భోజన, ఆరోగ్య సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని వివిధ విభాగాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సమాజంలోని పేద, వెనుకబడిన , మైనార్టీ వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వం గురుకుల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందన్నారు. విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా విద్య, వసతి, పోషకాహారం, క్రీడలు, వైద్య సే వలు, ఆధునిక సౌకర్యాలు అందించే దిశగా ప్ర భుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. విద్యార్థులు ఆరోగ్యంతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, భద్రతా ప్రమాణాల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట ఇంచార్జ్ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ అర్చన, నాగర్‌కర్నూల్ తాహసీల్దార్ తబితా రాణి, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్ చోరీ



**ప్రజాపక్షం/చిన్నంబావి:** చిన్నంబావి మండల కేంద్రంలోని చిన్నమారూర్ గ్రామ లిఫ్ట్ ఇరిగేషన్ సంత్వెల్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని దుండగులు కాపర్ వైర్‌ను చోరీ చేసిన ఘటనను చిన్నంబావి మండల బిజెపి పార్టీ నాయకులు.. మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ నాయకులు మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య తాలూక కన్వీనర్ మేకల శ్రీనివాస్ యాదవ్, జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, జిల్లా ఓబీసీ జనరల్ సెక్రెటరీ మేకల చెన్నయ్య, మండల జనరల్ సెక్రెటరీ అనుకలి సంపత్, మండల ఓబీసీ జనరల్ సెక్రెటరీ జింకల కిరణ్ కుమార్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, గోపి నాయుడు, దాసరి నారాయణ, శేఖర్ రెడ్డి, లక్ష్మి పల్లి సుధాకర్ తో పాటు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మండల అధ్యక్షుడు బొగ్గుకురుమయ్య మాట్లాడుతూ చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను కూడా సందర్శించి పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్‌వైర్ చోరీలు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ తరపున డిమాండు చేశారు. నిందితులను పట్టుకోని ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇలాంటి విషయాలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై అధికారులపై ఉన్నది కావున ఈవిషయంపై తక్షణమే స్పందించకపోతే బిజెపి పార్టీ ఆధ్వర్యంలోన ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా బిజెపి పార్టీ చిన్నంబావి మండల అధ్యక్షులు బొగ్గు కురుమయ్య ఈ సందర్భంగా తెలియజేశారు.

## సనాతన సంస్కృతికి జగన్నాథ రథయాత్ర ప్రతీక



**ప్రజాపక్షం/జడ్చర్ల:** ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జడ్చర్ల మున్సిపాలిటీలో తొలిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్ర మహోత్సవంలో జడ్చర్ల శాసనసభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. శనివారం నాడు జడ్చర్ల పట్టణానికి చేరుకున్న జగన్నాథ రథ యాత్రలో జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రమ్మల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రథయాత్రను ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జగన్నాథుని ర థయాత్ర భారతీయ సనాతన సంస్కృతికి ప్రతీక అని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సేవాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. జడ్చర్లలో తొలిసారిగా ఈ మహోత్సవాన్ని నిర్వహించిన ఇస్కాన్ సంస్థ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి ధార్మిక కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులకు అస్వస్థత

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నర్సింగ్ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్తతకు గురైన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం నర్సింగ్ కళాశాలలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కళాశాలలో మొత్తం 191 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా వీరంతా మధ్యాహ్నం 12.30 నిమిషాలకు దొండకాయ కూర, సాంబారు, పెరుగుతో భోజనం చేశారు. కొద్దిసేపటి తరువాత కొంత మంది విద్యార్థులకు వాంతు లు, విరోచనాలు, కడుపునొప్పితో అనారోగ్యానికి గురయ్యారు. దీంతో అధ్యాపకులు చికిత్స కోసం వారిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మొత్తం 13 మంది విద్యార్థులు అస్వస్తతకు గురికాగా ఐదుగురు కోలుకోగా, మరో 8 మంది చికిత్స పొందుతున్నారు. దీనిపై హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా ఫుడ్‌పాయిజన్ జరిగితే అందరి విద్యార్థులు అస్వస్థతకు గురికావాలి కాని కొంతమందే అస్వస్తతకు గురి కావడం జరిగిందన్నారు. గత రాత్రి హాస్టల్‌లో ఓ విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు ఇచ్చిన కేక్ మూలంగా ఇలా జరిగి ఉండవచ్చని చెప్పారు.

## శిక్షల శాతం పెంపులో పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయం కీలకం : ఎస్‌పి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో నమోదవుతున్న క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు ప్రతి దశలో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు.శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.జిల్లాలో నమోదవుతున్న పోక్సో,ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్,ఎన్.డి.పి.ఎస్,హత్య,దోపిడీ వంటి తీవ్రమైన కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రతి కేసులో బలమైన సాక్ష్యాధారాలను సేకరించి చట్టపరమైన అన్ని ప్రక్రియలను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.నాణ్యమైన దర్యాప్తు, శా)య ఆధారాల సేకరణ, చట్టపరమైన నిబంధనల అమలుతోనే శిక్షల శాతాన్ని పెంచడం సాధ్యమవుతుందని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, డీఎస్‌పిలు శివరాం రెడ్డి,రవి,శ్రీనివాస్ రావు,డిసిఆర్‌బి సీఐ శ్రీను నాయక్, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీవాణి, అఖిల పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో 'సినాప్స్' కళాశాల విద్యార్థుల సంచలనం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) 2026 ఫలితాల్లో సినాప్స్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సంచలన ర్యాంకులు సాధించారు. జిల్లాలోనే అత్యుత్తమ మార్కులు కైవసం చేసుకుని విద్యాసంస్థ కీర్తిని అగ్రగామిగా నిలిపారు. ఈ ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థి ఎం యశ్వంత్ రెడ్డి (రోల్ నెంబర్: 4220101190) 576 మార్కులతో ఆల్ ఇండియా 2287 ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. మరో విద్యార్థి ఆర్. రాజేష్ (రోల్ నెంబర్: 4201311203) 400 మార్కులు సాధించి ఆల్ ఇండియా 7311 ర్యాంకుతో కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు టి. సురేందర్‌రెడ్డి, కె.గిరిధర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. విద్యాసంస్థలో అనుసరిస్తున్న క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ వలనే విద్యార్థులు ఈ విధమైన జాతీయ స్థాయి ర్యాంకులు సాధించడానికి దోహదపడిందని విశ్లేషించారు. అనంతరం జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి కళాశాల పేరు నిలబెట్టిన విద్యార్థులను అధ్యాపక బృందంతో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ విజయంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయోత్సవ వేడుకల్లో సినాప్స్ విసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ కోర్టు సముదాయాన్ని పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ కోర్టు సముదాయంలోని మౌలిక వసతులు, కోర్టుల పనితీరు, భవనాల పరిస్థితిని నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వసంత్ పరిశీలించారు. శనివారం కోర్టు సముదాయాన్ని సందర్శించిన ఆయన వివిధ కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస గృహాలు, పార్కింగ్ సౌకర్యాలను తనిఖీ చేసి సంబంధిత వివరాలు తెలుసుకున్నారు. సముదాయంలోని ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టు, సబ్ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒకటో మరియు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను పరిశీలించారు. అలాగే వినియోగంలో లేని న్యాయమూర్తుల నివాస గృహాల పరిస్థితిని కూడా పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణం అవసరమవుతుందని, 1980లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతో ప్రారంభమైన ఈ సముదాయం కాలక్రమేణా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, జిల్లా జడ్జి కోర్టులతో విస్తరించిందని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రతిపాదనలు, కోర్టు సముదాయ అభివృద్ధికి సంబంధించిన అంశాలను రాష్ట్ర హైకోర్టు, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.పర్యటనలో ఐదో అదనపు జిల్లా జడ్జి కె.వి. చంద్రశేఖర్ రావు, సీనియర్ సివిల్ జడ్జిలు అర్జున్, పురుషోత్తం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్యారాణి పాల్గొన్నారు.



# పెద్ద అంబర్ పేటలో నకిలీ డిఏపి తయారీ ముఠా గుట్టురట్టు!

### చాకచాక్యంతో వెలుగులోకి వచ్చిన నకిలీ ఎరువుల దందా!

### రూ.కోటి 50లక్షల విలువైన వేయి బస్తాలు స్వాధీనం : సిఐ చరమందరాజు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ సిఐ చరమందరాజు నేతృత్వంలో పోలీసులు చేపట్టిన దాడులతో పెద్ద అంబర్‌పేటలో నిర్వహిస్తున్న నకిలీ డిఏపి ఎరువుల తయారీ ముఠా గుట్టురట్టైంది. సుమారు రూ.కోటి 50 లక్షల విలువైన 1000 నకిలి డిఏపి బస్తాలను స్వాధీనం చేసుకోగా, పోలీసుల రాకను గమనించిన నిందితులు పరారయ్యారు. సిఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ రైతు నకిలీ డిఏపి కొనుగోలు చేసిన ఘటనపై మఠంపల్లి మండలంలో నమోదైన కేసు విచారణలో కీలక ఆధారాలు లభించాయని, ఆ దర్యాప్తును విస్తరించిన పోలీసులు పెద్ద అంబర్‌పేటలోని గోదాముపై మెరుపుదాడి నిర్వహించడం జరిగిందని తెలిపారు. తనిఖీల్లో సాల్ట్, గ్రోమోర్, కొరమండల్, అన్నపూర్ణ తదితర ప్రముఖ కంపెనీల పేర్లతో ఉన్న ఖాళీ సంచుల్లో ఉప్పు, మట్టి తదితర నాసిరకం పదార్థాలను రసాయనాలతో కలిపి డిఏపిగా తయారు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ప్రింటింగ్, స్టిచ్చింగ్ యంత్రాలతో అసలు ఎరువుల సంచుల మాదిరిగానే ప్యాకింగ్ చేసి రైతులను మోసం చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. నకిలీ ఎరువులను డిసిఎం వాహనాల ద్వారా మేళ్లచెరువు, నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి తదితర ప్రాంతాలకు ఏజెంట్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలిందని సిఐ తెలిపారు. ఒక్కో బస్తాను సుమారు రూ.1500 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. స్వాదీనం చేసుకున్న ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగించామని, పరారీలో ఉన్ననిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతుందని సిఐ చరమందరాజు తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని, అనుమానస్పద ఎరువులపై వెంటనే పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యాపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తాజా మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తాజా మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా నియమించబడిన వెలుగు వెంకన్నతోపాటు రాష్ట్ర, జిల్లా కార్యవర్గంలో ఎన్నికైన వారిని పటేల్ రమేష్ రెడ్డి తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్‌కి గత మూడు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు తక్కువగా వచ్చాయని, మండలాల్లో సాధించిన ఓట్లతో పోలిస్తే సూర్యాపేటలో ఓట్లు తక్కువగా వస్తున్నాయని, ఈ సారి సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్‌కి అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు పడే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే వ్యూహరచన చేయాలన్నారు. సీనియర్ నాయకులు, కౌన్సిలర్ వెలుగు వెంకన్నకు పట్టణ అధ్యక్షుడు పదవి రావడం కాంగ్రెస్‌కి బలాన్ని ఇస్తుందన్నారు. ఆయన నాయకత్వంలో సూర్యాపేటలో బ్రాహ్మాండమైన మెజార్టీ సాధించాలన్నారు. పట్టణంలో ప్రతి వార్డులో కూడా కమిటిలు వేయాలని పట్టణ అధ్యక్షులుకు సూచించారు. వెలుగు వెంకన్న వివాదరహితుడని, అంకితభావంతో పనిచేసే నాయకుడన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేటలో నాయకులు కలిసిమెలిసి పనిచేయడం వలన కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని, పార్టీలో వర్గపోరు వల్లనే ఎమ్మెల్యేగా జగదీష్ రెడ్డి గెలవడం జరిగింది తప్ప బిఆర్‌ఎస్‌కు బలం లేదన్నారు. ఈసారి నాయకులందరూ ఏకమై ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా గట్టిగా ప్రయత్నం చేయాలని సూర్యాపేటను కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి ముదిరెడ్డి రమణారెడ్డి, నేరెళ్ళ మధు, బెల్లంకొండ శ్రీరాములు, బంటు చొక్కయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫిఉల్లా, మార్కెట్ కమిటి చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, బైరబోయిన శ్రీనివాస్, పిల్లల రమేష్ నాయుడు, ఫారూక్ పాల్గొన్నారు.

## తక్కువ నోటిఫికేషన్లు వేయడం సరికాదు

### ప్రభుత్వ ఉద్యోగాలు అన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలి

### సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని అందుకు సంబంధించిన నోటిఫికేషన్లను జారీ చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు యల్లావుల రాములు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ సంయుక్తంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ మూడో మహాసభ ఎఐవైఎఫ్ మాజీ నాయకులు యల్లావుల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎక్కువ ఖాళీలు ఉన్నప్పటికీ తక్కువ నోటిఫికేషన్లు వేయడం సరైనది కాదని, పూర్తిస్థాయిలో పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంతో నూతనంగా ప్రభుత్వం ఏర్పడేటప్పుడు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. కాని నేటికి అమలు చేయడం లేదని వారు విమర్శించారు. తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారన్నారు. సరైన నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పన రాష్ట్ర ప్రభుత్వం అందించకపోవడం వల్ల యువకులు ఇతర వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, భవిష్యత్ తరాలకు యువత ఎంతో ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు చేసి, వారి శక్తిని రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం యువత భవిష్యత్‌పై పలు తీర్మానాలు చేశారు. అలాగే నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, చక్రాల స్టాలిన్, తెల్లబోయిన వీరయ్య, రాము గోపి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అప్రమత్తం

### తాగునీరు,భూభారతి, డబుల్ బెడ్ రూం ఇళ్లపై కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సూచించారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో రెవెన్యూ అధికారులతో ఆయన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆయా మండలాల వారీగా తాగునీరు,వ్యవసాయం తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు విపత్తు నిర్వహణ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలు, పాఠశాలలు,ప్రభుత్వ సంస్థల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.రానున్న ఒకటి, రెండు రోజుల్లో 90 మ్యాపింగ్ పూర్తి చేయాలి.చివరి వరకు వేచి చూడొద్దు. ఈ నెలాఖరు నాటికి భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి. జూన్ 15 వరకు ఉన్న అన్ని దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి.ఇప్పటికే నిర్మించిన ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,సర్వే ల్యాండ్ రికార్డ్స్ రాష్ట్ర శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్ పాషా,ఆర్‌డిఓలు వై.అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



**భూముల రీ సర్వేలో సర్వేయర్లు పారదర్శకంగా పనిచేయాలి**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తిగా వాస్తవాధారంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారుల ను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో తహసీల్దార్లు, గిర్దావర్లు, ఆర్‌ఐలు (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు), సర్వేయర్లతో భూ రీసర్వే పై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిడి చాంద్ పాషా,అసిస్టెంట్ డైరెక్టర్ తాలుమా,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, ల్యాండ్ సర్వే ఏడి దేవరాజ్, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, గిర్దావర్లు, ఆర్‌ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## ప్రేమ వేధింపుల విషాదం.. ఇద్దరి మృతి

### వైద్య విద్యార్థిని ఆత్మహత్య.. గంటల వ్యవధిలో యువకుడి బలవన్మరణం

### మునుకుంట్లలో విషాదఛాయలు.. పోలీసు బందోబస్తు





**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్):** ప్రేమ వేధింపులు భరించలేక ఓవైద్య విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామంలో చోటుచేసుకుంది.ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న కొద్ది గంటల్లోనే వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు కూడా ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శాలిగౌరారం సీఐ రాజశేఖర్,ఎస్‌ఐ మునుగోటి రవీందర్,కుటుంబ సభ్యులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుకుంట్ల గ్రామానికి చెందిన సుక్క లింగయ్యయాదమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లింగయ్య ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టెలికాం విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు.పెద్ద కుమార్తె లక్ష్మీప్రియాంక హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్ చదువుతోంది.చిన్న కుమార్తె సుక్క లక్ష్మీ ప్రసన్న (21) సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది.గత రెండు నెలలుగా లక్ష్మీ ప్రసన్న స్వగ్రామం నుంచి రోజూ బస్సులో కళాశాలకు రాకపోకలు సాగిస్తోంది. ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన చిలుముల రాంచరణ్ (25) ప్రేమ పేరుతో గత కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో ఈనెల 16న కళాశాల నుంచి ఇంటికి వచ్చింది. ఈనెల 17న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉన్న ఇనుప పైపుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈనెల 17న మధ్యాహ్నం 1.20 గంటలకు తన చెల్లెలు ఫోన్ చేసి తాను ఎక్కడ ఉన్నానని అడిగిందని,తాను హైదరాబాద్ నుంచి వస్తున్నానని చెప్పినట్లు తెలిపారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు మూసి ఉండటంతో తెరిచి చూడగా తన చెల్లెలు ఉరివేసుకుని కనిపించిందన్నారు. చుట్టుపక్కల వారి సాయంతో వెంటనే కిందకు దించి 108కు సమాచారం అందించగా, సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని తెలిపారు.

**భయంతో యువకుడి ఆత్మహత్య**

లక్ష్మీ ప్రసన్న మృతి విషయం తెలుసుకున్న రాంచరణ్ భయాందోళనకు గురై గంటల వ్యవధిలోనే తన వ్యవసాయ బావి వద్ద ఉన్న తాటి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఆత్మహత్యకు ముందు తన తండ్రి సమాధిపై రక్తంతో కొన్ని పదాలు రాసినట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.లక్ష్మీ ప్రసన్న మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి, రాంచరణ్ మృతదేహానికి నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.మృతురాలి అక్క లక్ష్మీ ప్రియాంక ఫిర్యాదు మేరకు శాలిగౌరారం సీఐ రాజశేఖర్, కట్టంగూర్ ఎస్‌ఐ రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

### ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**ప్రజాపక్షం/చిట్యాల:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం బొంగోనిచెర్వు గ్రామంలో రూ. 63 లక్షల అంచనా నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం అత్యధిక నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేస్తూ వాటి వికాసానికి పాడుపడుతున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. బొంగోనిచెరువు గ్రామ ప్రజల సౌకర్యార్థం మంచినీటి వసతి కోసం ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానని, రైతులు, మహిళల సౌకర్యార్థం ఐకెపి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు వెలుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌పై బిఆర్‌ఎస్ నాయకులు అర్థంలేని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పది సంవత్సరాల బిఆర్‌ఎస్ పాలనలో తెలంగాణా రాష్ట్రాని అప్పుల పాలుచేసిన వారు కాంగ్రెస్ వారిని విమర్శించే హక్కును కోల్పోయారని వీరేశం దుయ్యపట్టారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత, గ్రామ సర్పంచ్ కట్ట ఆశయ్య, ఉప సర్పంచ్ సామిడి సాయికృష్ణారెడ్డి, నాయకులు పిశాటి భీష్మారెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, యానాల రాంరెడ్డి, యానాల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ పర్యాటక వైభవాన్ని ఆస్వాదించిన తెలంగాణ లేబర్ కమిషనర్

**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ లేబర్ కమిషనర్ పమేల సత్పతి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను సందర్శించారు.విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్న ఆమెకు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్, రెవిన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు.పర్యటనలో భాగంగా నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన ఆమె అనంతరం బౌద్ధ వారసత్వానికి ప్రతీకగా నిలిచిన బుద్ధవనాన్ని సందర్శించారు.బుద్ధ చరితవనం,ధ్యానవనం, స్తూపవనాలను పరిశీలించి, బుద్ధవనం విశేషాలను తెలియజేసే లఘు చిత్రాన్ని వీక్షించారు. మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శాసఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్రలు కండువా, జ్ఞాపికలను అందించి సత్కరించారు. స్థానిక పర్యాటక మార్గదర్శి సత్యనారాయణ నాగార్జునసాగర్ డ్యాం,బుద్ధవనం చారిత్రక, పర్యాటక విశిష్టతలను వివరించారు.

## ప్రజాసేవకే అంకితమైన మహానేత కొమ్మిడి నరసింహారెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రజాసేవకే అంకితమైన స్వర్గీయ కొమ్మిడి నరసింహారెడ్డి సేవలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో జరిగిన మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొమ్మిడి నరసింహారెడ్డి సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని బోనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సంతాప సభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొమ్మిడి కోదండరామిరెడ్డి సోదరుడైన నరసింహారెడ్డి తనకు ఉన్న సుమారు 300 ఎకరాల భూమిని పేద ప్రజలకు దానం చేసిన మహోన్నత వ్యక్తి అయినప్పటికీ ఆయనకు సొంత ఇల్లు కూడా లేకపోవడం ఆయన త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో శంకుస్థాపన చేసిన ఎయిమ్స్ ఆసుపత్రి ప్రారంభించేందుకు ఆయన నిరాహార దీక్ష చేసిన మహా వ్యక్తిని అదేవిధంగా ఈ ప్రాంతంలో సాగు, తాగు నీటికోసం గోదావరి జలాలను తరలించి ఈ ప్రాంతాన్ని సస్య శ్యామలం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మండల కార్యదర్శి దయాకర్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలు వేగవంతం

ఎంపిడిఒ రాధారాణి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో అందరం సమర్థవంతంగా అమలు చేయాలని యాచారం ఎంపిడిఒ రాధారాణి అన్నారు. శనివారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. విఒ బిల్డింగ్, వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణను సక్రమంగా పరిశీలించాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న ముందుండి పరిష్కరించాలన్నారు. అందరికి అందుబాటులో ఉంటు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీలత, పంచాయతి కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటన సంబందించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి.ఇబ్రహీంపట్నం పెద్ద చెర్వులో సుమారు (50) సంత్సరాల నల్లరంగు రెడ్ చెక్స్ జాకెట్, కాషాయం పింక్ చెక్స్ కలర్ గల చీర ధరించి ఉన్నా ఎరుపు శరీరం గల గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు తెలిపారు. ఈ మహిళ శవాన్ని గుర్తు పట్టిన వారు ఇబ్రహీంపట్నం ఎస్‌ఎచ్ఒ ఫోన్ నెంబర్ : 8712662361, ఇబ్రహీంపట్నం ఎస్ఐ ఫోన్ నెంబర్: 8712553724 గల నెంబరులను సంప్రందించగలరని తెలిపారు. ఈ సంఘటనపై గుర్తు తెలియని శవంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తూ జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

## ఎఎన్‌ఎంకు ఉత్తమ సేవా అవార్డు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మంచాల మండలం ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో బోడకొండ ఆరోగ్య ఉప కేంద్రంలో గత 24 సంత్సరాలుగా సుధీర్ఘ కాలంలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రులలో జిల్లా అధికారులు ఆదేశాల మెరకు పలు గ్రామలలో కుటుంబ సంక్షేమం, మహిళల ఆరోగ్యం, తల్లీ శిశు సంరక్షణ, పలు వైద్యసేవలతో పాటు పలు అంశాలపై ప్రతి నిత్యం ఓర్పు, సహనం, క్రమశిక్షణ, నీతి, నిజాయితీగా అంకిత భావంతో గిరిజన తండా ప్రాంతంలోని నిస్వార్థంగా విధులు నిర్వహించి వృత్తినే దైవంగా భావించి ఆహోర్నిషలు నిరుపేదలకు వైద్య సేవలు అందించిన కాంట్రాక్టు ఏఎన్‌ఎం ఎం జంగమ్మను జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా డిఎంఎచ్ఒ స్వర్ణ కుమారితో పాటు జిల్లా వైద్యాధికారులు శుక్రవారం సాయంత్రం నగరంలో డిఎంఎచ్ఒ కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏఎన్‌ఎంకు మోమోంటో, ఉత్తమ సేవా అవార్డు ప్రసాంశా పత్రం అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వం నా సేవలను గుర్తించి ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందచేయటం హర్షనీయమన్నారు. అవార్డుకు సహకరించిన జిల్లా కల్లెక్టరుకు, జిల్లా డిఎంఎచ్ఒకు, జిల్లా వైద్యాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రేపటి ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీన తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి కీలక సమీక్షా సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే,ఈ నెల 27వ తేదీ నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా ప్రతి సోమవారం కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## సైబరాబాద్‌లో ఐదు దేవాలయాల్లో దివ్య వస్తువుల సేకరణ విజయవంతం



**ప్రజాపక్షం/సైబరాబాద్ :** పర్యావరణహిత వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో శనివారం కార్పొరేషన్ పరిధిలోని ఐదు దేవాలయాల్లో దివ్య వస్తువుల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు జరిగిన కార్యక్రమాన్ని సంప్రదాయ పూజలతో ప్రారంభించారు. అనంతరం భక్తులు స్వచ్ఛందంగా పాత విగ్రహాలు, ఫొటో ఫ్రేములు, క్యాలెండర్లు తదితర దివ్య వస్తువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రాలకు అందజేశారు. సేకరించిన వస్తువులను శాస్త్రీయంగా వేరు చేసి, పర్యావరణహిత పద్ధతుల్లో రీసైక్లింగ్, నిర్వహణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. దివ్య వస్తువులను గౌరవప్రదంగా సేకరించి శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నిర్వహణకు ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.

## చెక్ బౌన్స్ కేసుల పరిష్కారంలో ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించిన తొలి ప్రత్యేక లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి విశేష స్పందన లభించింది. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ (టిజిఎల్ఎస్ఎ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 255 లోక్ అదాలత్ బెంచీల ద్వారా 2,826 చెక్ బౌన్స్ కేసులు, 318 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారమై మొత్తం 3,144 కేసుల్లో రూ.41.23 కోట్ల మేర రాజీ అవార్డులు జారీ అయ్యాయి. హైకోర్టులో నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 23 కేసులు రాజీ కుదిరాయి. వీటిలో 18 మోటార్ ప్రమాద పరిహార అప్పీలు, 3 చెక్ బౌన్స్ కేసులు ఉండగా, మోటార్ ప్రమాద బాధితులకు రూ.2.56 కోట్లు, చెక్ బౌన్స్ కేసుల్లో రూ.40.30 లక్షలు చెల్లింపునకు అవార్డులు జారీ చేశారు. అదే రోజు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అభ్యర్థన మేరకు ప్రత్యేకంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో 450 రుణ వసూలు కేసులు రాజీ కుదిరి రూ.95 కోట్ల విలువైన సెటిల్‌మెంట్‌లు జరిగాయి. చెక్ బౌన్స్ కేసుల పెండెన్సీ తగ్గించి, తక్కువ ఖర్చుతో త్వరితగతిన న్యాయం అందించడమే ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ సభ్య కార్యదర్శి చి.పంచాక్షరి తెలిపారు. తదుపరి ప్రత్యేక లోక్ అదాలత్‌ను నవంబర్ 21, 2026న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంత్రి సందర్శించి పాఠశాలలోని విద్యా, క్రీడా, మౌలిక వసతులను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలను చూసి సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక విద్యా వాతావరణం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తమ చిన్నతనంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడి చదివి ఎదిగామని, ప్రస్తుతం విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం,క్రమశిక్షణ,పట్టుదల,అంకితభావం అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, తల్లిదండ్రుల ఆశలు, త్యాగాలను గుర్తుంచుకోవాలని, ఓటమిని చూసి నిరాశ చెందకుండా నిరంతర సాధనతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పడే స్నేహాలు జీవితాంతం నిలుస్తాయని, పరస్పర గౌరవం, సహకారం, ముఖ్యంగా బాలికలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ పాఠశాల నుంచి భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు ,శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, పరిపాలనా అధికారులు తయారై రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు.

**విద్యాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలు -అదనపు కలెక్టర్**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీల పెంపు, విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్యను అందించేలా ఆధునిక మౌలిక వసతులతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కృతజ్ఞతాభావంతో చదువుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషితో ప్రతి విద్యార్థి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కోట్ల నవీన్ కుమార్ రెడ్డి, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇ-బైక్, స్కూటీలకు గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుండి కుట్టు యంత్రాలు, చిరువ్యాపారాలు అండ్ ఇబైక్, ఇస్కూటీ మోటార్ బైక్ పోస్టుల కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ల గడువు పొడిగించడం జరిగిందని, రంగారెడ్డి జిల్లా మైనారిటీ అధికారి కోట్ల నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను, అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుండి కుట్టు యంత్రాలతోపాటు చిరువ్యాపారాలు అండ్ ఇబైక్, ఇస్కూటీ, మోటార్ బైక్ పోస్టుల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల గడువు పొడిగించబడినదని, క్రిస్టియన్ మైనారిటీ వర్గాల నుండి అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చని, కుట్టు యంత్రాలు, చిరు వ్యాపారాల కోసం 21 నుండి 55 సంవత్సరాల వయస్సు గల వారితో పాటు ఇబైక్ కోసం 21 నుండి 50 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. అంతేకాకుండా పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షల కంటే తక్కువ, గ్రామీణ ప్రాంతాలలో రూ. ఒక లక్ష 50 వేల కంటే తక్కువ వార్షిక కుటుంబ ఆదాయం ఉండాలని తెలిపారు. కావున అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీస్ తమ దరఖాస్తులను ఆన్‌లైన్ tsobmms.cgg.gov.in సమర్పించుటకు తేది.18.07.2026తో 31-07-2026 వరకు పొడిగించబడినది. కావున అర్హులు క్రిస్టియన్ మైనారిటీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగలరని జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

జలమండలి డైరెక్టర్ వాస సత్యనారాయణ




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జలమండలి డైరెక్టర్ వాస సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వహణ పద్ధతులపై అవగహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జలమండలి డైరెక్టర్ వాస సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షభావ పరిస్థితులు నెలకొంటున్నాయని అదృష్టవశాత్తు అప్పుడప్పుడు కురిసే వర్షాలను ఒడిసి పట్టుకొని భూగర్భ జలాలు పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అగ్రికల్చర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులకు, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులకు అభినందలు తెలియజేశారు. సిజిఎం నగేందర్ కుమార్ మాట్లాడుతూ నీటిని వృధా చేసే వారిని గుర్తించి అవగహన కల్పించాలని తెలిపారు. వినని వారికి ఫెనాల్టీస్ కూడా విధించే అవకాశం ఉంటుందన్నారు. ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జాల సత్యనారాయణ మాట్లాడుతూ కాలనీలో బోర్వెల్ వేసే ప్రతి ఒక్కరు ఇంజక్షన్ పద్ధతి కోసం ప్రక్కనే 180200 ఫీట్స్ మరో బోర్వెల్ వేసి ఇంకుడు గుంత నిర్మిస్తే భూగర్భ జలాలు పెంచేందుకు అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ రావుల శ్రీను మాట్లాడుతూ ఎంతో ఎక్కువ మొత్తంగలో ఖర్చు చేసి నీటిని సేకరించి శుద్ధి చేసి నాణ్యతమైన నీటిని అందించడం కోసం జలమండలి 24/7 పనిచేస్తుందన్నారు. మేనేజర్ భవ్య మాట్లాడుతూ నీటిని పొదుపు చేస్తే అన్నిటిలో పొదుపు అలవార్చుకోవాలని, ఇంట్లో ధనం నిలుస్తుందని తెలిపారు. సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి.సురేందర్ మాట్లాడుతూ జల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ కోసం తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టి. బుచ్చిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారులను వదిలేసి, పేదలకు నోటీసులివ్వడం దుర్మార్గం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడుతున్న పెద్ద తిమింగలాలను వదిలిపెట్టి, నిరుపేద సామాన్య పౌరులను రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధిలో ఇటీవల ఇంజాపూర్ రెవెన్యూ సర్వే నెంబర్ 126లో నకిలీ బై సర్వే నెంబర్లను సృష్టించి, తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన భూబకాసురులకు హైకోర్టు ఆదేశాలతో గూడు కదిలి, పెద్ద వణుకు పుట్టిందని ఆయన పేర్కొన్నారు. మునగనూరు సర్వే నెంబర్ 44లో సైతం ఇలాగే నకిలీ బై సర్వే నెంబర్లతో భారీగా భూకబ్జాలు జరిగాయని, ఇవి మండలంలో జరుగుతున్న వ్యవస్థీకృత భూదందాలకు సజీవ నిదర్శనాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు అసలైన భూకబ్జాదారులను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తున్నారని యాదయ్య విమర్శించారు. ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములను మింగేసిన పెద్దలను వదిలేసి, వారి వద్ద నమ్మి మోసపోయి 60 గజాల నుండి 200 గజాలలోపు చిన్న ఇండ్లు కట్టుకున్న సామాన్యులకు నోటీసులు జారీ చేయడం ఏ రకమైన న్యాయమని ఆయన ప్రశ్నించారు. అధికారుల నిర్వాకం వల్ల కొండను తవ్వి ఎలకను కూడా పట్టలేనట్లుగా ఉందే తప్ప, అసలైన ప్రభుత్వ భూమిని కాపాడే ఉద్దేశం కనపడటం లేదన్నారు. భూకబ్జాదారులు చేసిన తప్పులకు సామాన్య ప్రజలను బలిపశువులను చేయాలని చూస్తే సిపిఐ పార్టీ చూస్తూ ఊరుకోదని, బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. మండలంలో భూకబ్జాదారులు ఇంతలా రెచ్చిపోవడానికి రెవెన్యూ అధికారుల ప్రేక్షక పాత్రే ప్రధాన కారణమని ఆరోపించారు. గతంలో సర్వే నెంబర్ 126పై సిపిఐ పార్టీ తరపున అనేక ఆధారాలతో ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం వహించారని, ఆ కారణంగానే కబ్జాలు యథేచ్ఛగా సాగాయని గుర్తుచేశారు. కబ్జాదారులు ప్రభుత్వ భూములను సాధారణ ప్రజలకు అమ్మి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్న ఇప్పుడు రెవెన్యూ అధికారులు నిద్రలేవడంలో ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. పేదవాడు 60 గజాల స్థలంలో తలదాచుకోవడానికి ఇల్లు కట్టుకుంటే క్రిమినల్ కేసులు పెడుతున్న అధికారులు, గత పదేళ్ల కాలంలో వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను పోగుచేసుకున్న కబ్జాదారులపై ఎందుకు క్రిమినల్ చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేసి, సామాన్యులకు విక్రయించిన భూకబ్జాదారుల పూర్తి వివరాలను సేకరించి, వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి, గత 10 సంవత్సరాలుగా అక్రమ భూదందాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించి, పోగుచేసుకున్న భూకబ్జాదారుల ఆస్తులన్నింటినీ ప్రభుత్వం తక్షణమే జప్తు చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ పౌరులకు నోటీసులు ఇచ్చి భయాందోళనలకు గురిచేసే ప్రక్రియను వెంటనే నిలిపివేసి, కబ్జాలకు సహకరించిన నాటి రెవెన్యూ అధికారుల జాబితాను సేకరించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు, మిగిలిన ప్రభుత్వ భూములను సంరక్షించడానికి శాశ్వత చర్యలు చేపట్టాలి. లేనియెడల ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## బిసి కమిషన్‌కు శాశ్వత సిబ్బంది నియామకంపై ప్రతిపాదనలు

పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో రిజర్వేషన్ల ఫిర్యాదుపై సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర బిసి కమిషన్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సమావేశంలో నిర్ణయించినట్లు బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వివిధ శాఖల నుంచి డెప్యుటేషన్‌పై వచ్చిన ఉద్యోగులతో కమిషన్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, కమిషన్ విధివిధానాలు, కులాల అంశాలపై పూర్తి అవగాహన కలిగిన సిబ్బంది అవసరమని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బిసి కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, మెంబర్ సెక్రెటరీ బి. బాల మాయదేవి పాల్గొన్నారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతోందన్న ఫిర్యాదుపై బోర్డు సమర్పించిన నివేదికను సమీక్షించారు. అలాగే అనాథల గుర్తింపునకు వయోపరిమితి పెంపు, 'సాతాని' పదం తొలగింపు అంశాలపై ఇటీవల నిర్వహించిన విచారణ వివరాలపై కూడా కూలంకషంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి ఎన్.సునీత, సెక్షన్ ఆఫీసర్ జి.సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి.లక్ష్మీ నారాయణ తదితర అధికారులు హాజరయ్యారు.

# బహదూర్‌గూడలో రైతుల ఆందోళన

పోలీసులు- రైతుల మధ్య తోపులాట

బిఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్‌గూడలో శనివారం భూముల వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం తమ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆవేదనకు గురైన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన బాటపట్టారు. మా భూములు మాకు కావాలంటూ నినాదాలు చేస్తూ అధికారుల చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. గత కొంతకాలంగా తమ భూములను కాపాడుకోవాలని రైతులు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, అధికారులు భూముల స్వాధీనం ప్రక్రియను కొనసాగించేందుకు ముందుకు రావడంతో రైతులలో ఆగ్రహం మరింత పెరిగింది. హైడ్రా అధికారులు జెసిబిల సహాయంతో భూముల వద్ద ఫన్సింగ్ వైర్లు ఏర్పాటు చేయడం ప్రారంభించగా, రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రైతులు, పోలీసు మధ్య తోపులాట చోటుచేసుకుంది. తోపులాటలో రైతు నరసింహ అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అతడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేందుకు అధికారులు ప్రయత్నించగా, తోటి రైతులు అడ్డుకుని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. తమ సొంత భూముల్లోకి కూడా వెళ్లనివ్వడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. ఇదే సమయంలో రైతులకు మద్దతుగా వెళ్లేందుకు ప్రయత్నించి బిఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ పరిణామంతో రాజకీయంగానూ ఈ భూముల వివాదం చర్చనీయాంశంగా మారింది.

## 'వాక్ ఫ్రీ' డ్రైవ్‌లో 420 ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాదచారులకు సురక్షితమైన, అడ్డంకులు లేని ఫుట్‌పాత్‌లను అందించాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో నిర్వహించిన వారాంతపు 'వాక్ ఫ్రీ' ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 420 ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. శనివారం మూడు జోన్‌ల పరిధిలోని 15 సర్కిళ్లలో 16 ప్రాంతాల్లో మొత్తం 16.7 కిలోమీటర్ల మేర తనిఖీలు నిర్వహించి ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ జోన్‌లోని చింతల్, జీడిమెట్ల, కొంపల్లి, గాజులరామారం, నిజాంపేట్, దుండిగల్, మేడ్చల్ సర్కిళ్లలో 8.2 కిలోమీటర్ల మేర డ్రైవ్ నిర్వహించి 197 ఆక్రమణలను తొలగించారు. కూకట్‌పల్లి జోన్‌లోని మాదాపూర్, ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి సర్కిళ్లలో 1.5 కిలోమీటర్ల మేర తనిఖీలు చేపట్టి 67 ఆక్రమణలను తొలగించారు. శేరిలింగంపల్లి జోన్‌లోని నార్సింగి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, మియాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లలో 7 కిలోమీటర్ల మేర నిర్వహించిన డ్రైవ్‌లో 156 ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తం చేసి పాదచారులకు సురక్షితమైన రాకపోకలు కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. దుకాణదారులు, వీధి వ్యాపారులు, వాణిజ్య సంస్థలు ప్రజా స్థలాలను ఆక్రమించకుండా సహకరించాలని, ప్రజా మౌలిక వసతుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది.



# ప్రాజెక్ట్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నిర్ణీత గడువులోగా ఫ్లైఓవర్‌ల పనులు పూర్తి చేయాలి

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రాజెక్ట్ పనులను నాణ్యతా ప్రమాణాలు, భద్రతా నిబంధనలను పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. హైదరాబాద్ పశ్చిమ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు చేపడుతున్న ఐఐఐటి జంక్షన్, ఖాజాగూడ జంక్షన్ గ్రేడ్ సెపరేటర్ ప్రాజెక్టుల పురోగతిని సిఎంసి కమిషనర్ శనివారం సమీక్షించారు. పనులు గచ్చిబౌలి, లింగంపల్లి, కొండాపూర్, విప్రో జంక్షన్‌లను అనుసంధానించే కీలక కూడలిగా ఉన్న ఐఐఐటి జంక్షన్‌లో రూ.459 కోట్ల వ్యయంతో బహుస్థాయి గ్రేడ్ సెపరేటర్ నిర్మాణం కొనసాగుతోంది. ఇందులో ఐఎస్‌బి రోడ్ నుంచి డిఎల్‌ఎఫ్ వైపు 720 మీటర్ల నాలుగు లేన్‌ల ద్విమార్గ ఫ్లైఓవర్, డిఎల్‌ఎఫ్ నుంచి లింగంపల్లి వైపు 948 మీటర్ల మూడు లేన్‌ల ఏకమార్గ ఫ్లైఓవర్, ఐఎస్‌బి నుంచి గచ్చిబౌలి వైపు 1.20 కిలోమీటర్ల మూడు లేన్‌ల ఫ్లైఓవర్‌తో పాటు గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు 520 మీటర్ల ఆరు లేన్‌ల అండర్‌పాస్ నిర్మిస్తున్నారు. మొత్తం 3.39 కిలోమీటర్ల పొడవు గల ఈ ప్రాజెక్టును 2027 మే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం నాలుగు కారిడార్‌లలో ఫౌండేషన్లు, పియర్లు, పియర్ క్యాప్‌లు, పిఎస్‌సి గిర్డర్ కాస్టింగ్ పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొండాపూర్, లింగంపల్లి, ఓఆర్ఆర్ వైపు ట్రాఫిక్ సాఫీగా సాగనుంది. అలాగే రూ.220 కోట్ల వ్యయంతో ఖాజాగూడ జంక్షన్ వద్ద చేపడుతున్న ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. నానక్‌రామ్‌గూడ నుంచి షేక్‌పేట్ వైపు 1,085 మీటర్ల మూడు లేన్‌ల ఫ్లైఓవర్, షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు 540 మీటర్ల మూడు లేన్‌ల అండర్‌పాస్ నిర్మాణం జరుగుతోంది. మొత్తం 1.625 కిలోమీటర్ల పొడవు గల ఈ ప్రాజెక్టును 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

## టిఎంసి రెబల్స్‌కు ప్రత్యేక సీట్లు

### షిండే వర్గంలో యుపిటి ఎంపిల విలీనానికి స్పీకర్ బిర్లా ఆమోదం

**న్యూఢిల్లీ :** శివసేనలోని (యుబిటి) ఆరుగురు ఎంపిలు శివసేనలో (షిండే వర్గం) విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం ఆమోదం తెలిపారు. దీంతో థాక్రే వర్గానికి చెందిన ఎంపిలు ఇప్పుడు మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో విలీనమైనట్లు అధికారికంగా గుర్తించారు. దీంతో లోక్‌సభలో షిండే శివసేన బలం 13 మంది ఎంపిలకు పెరగ్గా, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేనకు (యుబిటి ఉద్ధవ్ బాల్ థాక్రే) ముగ్గురు ఎంపిలే మిగిలారు. అదే సమయంలో స్పీకర్ మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నుంచి విడిపోయి 'నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)' లో విలీనమైనట్లు ప్రకటించిన 20 మంది రెబల్ ఎంపిలకు లోక్‌సభలో ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేసేందుకు కూడా స్పీకర్ అనుమతి ఇచ్చారు. అయితే వారి పార్టీ విలీనాన్ని మాత్రం ఇంకా అధికారికంగా గుర్తించలేదు. కానీ లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్‌తో కాకుండా వేరుగా కూర్చునేందుకు అనుమతిని ఇచ్చారు. గత నెలలో టిఎంసి రెబల్ ఎంపి కాకోలి ఘోష్ దస్తిదార్ నేతృత్వంలోని 20 మంది ఎంపిలు టిఎంసిని వీడి ఎన్‌సిపిఐలో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. అలాగే శివసేనలోనూ (యుబిటి) చీలిక ఏర్పడి, ఆరుగురు లోక్‌సభ సభ్యులు శివసేనలో (షిండే వర్గం) చేరగా వీటికి సంబంధించి తాజాగా స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయాలు ప్రకటించారు. లోక్‌సభ సెక్రటేరియట్ □క్రటేరియట్ ఆఫీస్ ఇప్పటికే సవరించిన పార్టీ బలాబలాల జాబితాను శనివారం విడుదల చేసింది. షిండే నేతృత్వంలోని శివసేన బలం లోక్‌సభలో 13 మంది ఎంపిలకు చేరగా, దీంతో ఎన్‌డిఎలో బిజెపి తర్వాత అత్యధిక మంది ఎంపిలు కలిగిన రెండో మిత్రపక్షంగా నిలిచింది. ప్రస్తుతం తెలుగు దేశం పార్టీకి (టిడిపి) 16 మంది ఎంపిలు ఉండగా ఎన్‌డిఎలో ఎక్కువ మంది ఎంపిలు ఉన్న మొదటి మిత్రపక్షంగా ఉంది. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు కూడా బిజెపిలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం స్పీకర్ సహా లోక్స్‌భలో ఎన్‌డిఎ బలం 298కి చేరింది. టిఎంసి రెబల్ ఎంపిల విలీనానికి కూడా స్పీకర్ ఆమోదం లభిస్తే ఎన్‌డిఎ బలం ఏకంగా 318 కి చేరుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులు ఉండగా, 3 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మూడింట రెండొంతుల మెజార్టీకి అవసరమైన సంఖ్యకు ఎన్‌డిఎ మరింత చేరువయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## పార్లమెంటులో 'తుఫాన్'కు
# అధికార, ప్రతిపక్షాలు సిద్ధం

> రాముడి విరాళాలు, ప్రధాన్ రాజీనామా కీలకం
> రేపటి నుండి వర్షాకాల సమావేశాలు ప్రారంభం
> ధరలు, విదేశాంగ విధాన వైఫల్యం, అవినీతిసహా కీలకబిల్లులపై కాంగ్రెస్ ఎదురుదాడి వ్యూహం



**న్యూఢిల్లీ:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుండీ ప్రారంభం కానున్నాయి. బయట ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు నెలకున్నప్పటికీ, ఈసారి పార్లమెంటు సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు తుఫాన్ తరహా వాగ్యుద్ధానికి ప్రతిపక్షాలు సన్నద్ధమవుతుండగా, అధికారపక్షం కూడా అదేతరహాలో ప్రతిఘటించేందుకు సిద్ధమవుతున్నది. అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాల దుర్వినియోగం–అవినీతిపై కేంద్ర,రాష్ట్ర (యుపి)పాలకుల అలసత్వం,నీట్ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నిర్వక్ష్యం,కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్,పార్లమెంటుకు కేవలం రెండు మూడు కి.మీ దూరంలో ఉండే జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి)బైఠాయింపు,,సమావేశాల ప్రారంభం మొదటిరోజు పార్లమెంటుకు సిజెపి తలపెట్టిన నిరసన ప్రదర్శన వంటి తీవ్ర ఉద్రిక్తత మధ్య సర్వత్రా ఉత్కంఠ నెలకుంది. రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడం,కుంభకోణాలు,అవినీతి, ధరల పెరుగుదల, నీట్ పరీక్షల్లో వైఫల్యం, విదేశాంగ విధానంలో వైఫల్యాలు వంటి అంశాలు ప్రధానంగా సభలో ప్రస్తావిస్తామని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఇప్పటికే ప్రకటించారు. కాగా ఆదివారం (జులై 19)న ప్రభుత్వం సంప్రదాయబద్ధంగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తోంది.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్,అయోధ్యలో రామాలయానికి భక్తులు ఇచ్చిన విరాళాల అవినీతి అంశాలపై ప్రతిపక్షాలు ఎక్కువ దృష్టి కేంద్రీకరించనున్నాయి. దాదాపు ప్రతిపక్షాలతో సమానంగా ప్రభుత్వం కూడా పోరాట ధోరణినే అనుసరిస్తూ, తమకు అవసరమైన బిల్లులన్నింటినీ ఆమోదింపజేసుకునే విషయాలపై దృష్టి పెట్టేందుకు సిద్ధపడింది.ప్రస్తుతం ఆసుపత్రికి తరలించిన కాక్రోచ్ జనతాపార్టీ నాయకుడు సోనమ్ వాంగ్‌ఛుక్ 21 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభం దినం సోమవారం వరకూ తాను ఖచ్చితంగా ఉంటానని, ఒకవేళ అప్పటిలోగా సిజెపి ఆశయాలు నెరవేరకపోతే ఆ తర్వాత తాను ఆత్మరూపంలో వచ్చి డిమాండ్ చేస్తానని సోనంవాంగ్‌ఛుక్ వాఖ్యలు చేశారు.

ఎలాంటి పరిస్థితులు ఎదురైనాగానీ గత సమావేశాల కాలంలో పెండింగ్‌లో పడిన వాటితోసహా కీలకమైన అన్ని బిల్లులను ఈసారి ఆమోదించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇందులో ఆర్బిట్రేషన్ కౌన్సిల్ బిల్లును ఆమోదించే విషయంలో కూడా సర్వోన్నత న్యాయస్థానం నుండి పరోక్ష ఒత్తిడి వస్తోంది. ఎఫ్‌సిఆర్‌ఏ సవరణ బిల్లు,వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లు,వందేమాతరం క్రిమినల్ అఫెన్స్ బిల్లు వంటివి కూడా ఉన్నాయి. రెండు ముఖ్యమైన బిల్లుల విషయంలో ఎన్‌డిఎ ఎంపీలు వ్యతిరేకతతోనే ఉంటారని కాంగ్రెస్‌పార్టీ విశ్వాసంతో ఉన్నప్పటికీ రాష్ట్రాలకు తగిన రక్షణలు ఉంటే నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజ్వర్వేషన్ బిల్లు ముసాయిదాలలో మార్పులు పరిశీలించాక స్పందిస్తామని ఎన్‌సిపి–ఎస్‌పి,శివసేన(యుబిటి) సంకేతాలు ఇచ్చాయి. డిఎంకె కూడా 131వ రాజ్యాంగ సవరణను తీవ్రంగా వ్యతిరేకించి గడచిన ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో దీనిని ఓడించినప్పటికీ,కొత్త ముసాయిదా బిల్లు ఎలా ఉంటుందో చూశాక స్పందిస్తామని పర్కొంది. కానీ ఈ విషయంలో మిత్రులంతా తమతోనే ఉంటారని కాంగ్రెస్‌పార్టీ పూర్తి విశ్వాసంతో ఉంది.

కొన్ని అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితాల తర్వాత ఈసారి పార్లమెంటులో ఫిరాయింపులు కారణంగా సమీకరణలు మారిపోయాయి. శత్రు శిబిరాల నుండి ఫిరాయింపులతో ఎంపీలు స్థానాలు మారడంతో పరిస్థితులు మారాయి. దీంతో ఈసారి అధికారపక్షం నిర్వాకాలపై ప్రతిపక్షాలు పదునైన పదజాలంతో ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధమైంది. 20 మంది టిఎంసి ఎంపీలు ఎన్‌డిఎకు అనుకూలంగా మారారు.మరో ఆరుగురు ఎస్‌ఎస్‌ఎస్–యుబిటి ఎంపీలు వారివారి సొంత పార్టీలకు దూరమై లోక్‌సభలో ఎన్‌డిఎకు మద్దతుగా ఉన్నారు. స్పీకర్ గనుక తిరుగుబాటు ఎంపీలపట్ల సానుకూలంగా వ్యవహరిస్తే లోక్‌సభలో ఎన్‌డిఎ బలం కొంత పెరుగుతుంది. పార్లమెంటు ఎజెండాలో చేర్చకపోయినప్పటికీ కొత్త వాతావరణం మధ్య గత సమావేశాల్లో వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణతోపాటు మహిళా బిల్లు మరోసారి చర్చకు వచ్చే అవకాశం ఉంది. కానీ రాజ్యాంగ సవరణ ఆమోదానికి ఈ బలం చాలదు. ప్రస్తుతం 540 మంది ఎంపీలు ఉంటే సభలో 360 మంది ఎంపీల బలం కావాలి. కానీ మూడుస్థానాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. రాజ్యాంగ సవరణను ఆమోదించాలంటే మూడింట రెండు వంతుల మెజార్టీ ఉండాలి. రాజ్యసభలో ఎన్‌డిఎకు కొన్ని సీట్ల మెజార్టీ తక్కువగా ఉంది. ఎవరైనా గైరుహాజరైతే వారికి సహాయపడవచ్చు కూడా. వీటిని ఆమోదింపజేసుకునేందుకు అధికారపక్షం మరోసారి గట్టి ప్రయత్నం చేసే అవకాశం ఉంది. బిజెపి,ఎన్‌డిఎ వ్యూహకర్తలు చురుగ్గా వీటిపై ఆలోచనలు చేస్తుండగా, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీ ఎదురుదాడి వ్యూహానికి సన్నద్ధమైంది. మరోవైపు జమ్మూ కశ్మీరు స్వయంప్రతిపతి అంశం కూడా మరో అంశంగా అక్కడి ఎంపీలు చాలా గట్టిగా ప్రస్తావించేందుకు సిద్ధమయ్యారు.

## రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన
# నిందితులను తక్షణమే అరెస్ట్‌చేయాలి

### సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా




**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లోని రాణిగంజ్‌లో మహాపండిట్ రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించింది. భారతదేశపు గొప్ప పండితులు, స్వాతంత్ర్య సమరయోధులు, మార్క్సిస్ట్ ఆలోచనాపరులు, ప్రజా మేధావులలో ఒకరైన ఆయన విషయంలో జరిగిన ఈ చర్య హేయమైన, రాజకీయ, సైద్ధాంతిక, విధ్వంసక చర్య అని శనివారం సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆక్షేపించారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్ట్‌చేసి, వారిని కఠినంగా శిక్షించాలని, ఆలస్యం చేయకుండా రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహాన్ని పునరుద్ధరించాలని రాజా డిమాండ్ చేశారు. రాహుల్ సాంకృత్యాయన్ ఒక గొప్ప సాహిత్యవేత్త మాత్రమే కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఒక విశిష్ఠ నాయకుడు అని పేర్కొన్నారు. 1940లో ఆల్ ఇండియా కిసాన్ సభకు జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన సాంకృత్యాయన్ తన జీవితాన్ని, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల పోరాటాలకు అంకితం చేసిన నాయకుడన్నారు. బిజెపి పాలనలో పెరుగుతోన్న అరాచకత్వం, శిక్షల నుంచి తప్పించుకోగలమనే ధీమా, దేశంలోని ప్రగతిశీల. ప్రజాస్వామ్య వారసత్వంపై దాడులకు ఊతమిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ చర్యలు దేశవ్యాప్తంగా హేతువాద, లౌకిక, వామపక్ష సంప్రదాయాల వారసత్వాన్ని తుడిచిపెట్టి భారతదేశపు సుసంపన్నమైన, బహుళత్వ, ప్రగతిశీల చరిత్ర స్థానంలో సంకుచిత మతతత్వ ధోరణిని ప్రవేశపెట్టడానికి ఒక వ్యవస్థీకృత ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహంపై దాడి ఈ ప్రమాదకరమైన భావజాలాన్ని ప్రదర్శించడంలో భాగమేనని, దానిని ఆ నేపథ్యంలోనే చూడాలన్నారు. స్వేచ్ఛ, శాస్త్రీయ దృక్పథం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారి వారసత్వాన్ని చెరిపివేసే ఇలాంటి కుటిల ఆలోచనలు, ప్రయత్నాలను ఐక్యంగా ప్రతిఘటించాలని ప్రజాస్వామ్య, లౌకిక, ప్రగతిశీల శక్తులు, రచయితలు, మేధావులు, భారతీయ ప్రజలకు డి.రాజా పిలుపునిచ్చారు.

## ఈ నెల 20 నుంచి సాట్‌జీ క్రీడా అకాడమీల ప్రవేశ ఎంపికలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఎటిజి) ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ క్రీడా అకాడమీలు, ప్రాంతీయ క్రీడా వసతి గృహాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 20 నుంచి 28 వరకు ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన బాలురు, బాలికలకు వివిధ క్రీడా విభాగాల్లో ప్రవేశ అవకాశాలు కల్పించేందుకు ఈ ఎంపికలు చేపడుతున్నట్లు వెల్లడించింది. సైక్లింగ్, రెజ్లింగ్, వాలీబాల్, హాకీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ తదితర విభాగాలకు హైదరాబాద్, ఖమ్మం, సిద్ధిపేట, మహబూబ్‌నగర్, హనుమకొండ కేంద్రాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఎంపికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఉప సంచాలకులు, జిల్లా యువజన క్రీడాధికారులు, కోచ్‌లు, సంబంధిత క్రీడా సంఘాల ప్రతినిధులు, అంతర్జాతీయ క్రీడాకారులతో ప్రత్యేక ఎంపిక కమిటీలను ఏర్పాటు చేసినట్లు సాట్‌జీ వెల్లడించింది. అర్హులైన యువ క్రీడాకారులు నిర్ణీత తేదీల్లో సంబంధిత వేదికలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ విజ్ఞప్తి చేసింది.

## లాలూకు అనారోగ్యం.. ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలింపు



**పాట్నా :** రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అస్వస్థతకు గురయ్యారు. దాంతో ఆయనను పాట్నాలోని ఇందిరాగాంధీ వైద్య విజ్ఞానసంస్థలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం శనివారం ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించనున్నారు. శుక్రవారం సాయంత్రం రక్తపోటు హెచ్చుతగ్గులకు గురికావడంతో ఆయనను పాట్నాలోని ఇందిరా గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ లో చేర్పించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించి అత్యవసర చికిత్స చేశారు. అనంతరం ఆరోగ్యం కుదుటపడటంతో డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం తదుపరి వైద్య పరీక్షల కోసం లాలూని ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకెళ్తామని ఆయన పెద్ద కుమార్తె, ఆర్‌జెడి ఎంపి మిసా భారతి తెలిపారు. కాగా, లాలూ చాలాకాలంగా పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. 2022 డిసెంబర్‌లో సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

## ఉగ్రవాదం పట్ల 'జీరో సహనం' ఒక ప్రకటన మాత్రమే కాదు...
# భారతదేశానికి ఒక కార్యాచరణ విధానం

### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** స్వదేశీ రక్షణ ఉత్పత్తికి లభించిన భారీ ప్రోత్సాహంతో, భారతదేశం హిందూ మహా సముద్రం నుండి ఇండో–పసిఫిక్ వరకు తన వ్యూహాత్మక ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, వేగంగా ఒక విశ్వసనీయమైన ప్రపంచ భద్రతా భాగస్వామిగా ఎదుగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ పాకిస్థాన్‌కు ఒక గట్టి సందేశం పంపారు. ఉగ్రవాదంపై న్యూఢిల్లీ తన వైఖరిని యావత్ ప్రపంచం ముందు స్పష్టంగా వెల్లడించిందని సింగ్ తెలిపారు. 'ఉగ్రవాదం పట్ల 'జీరో సహనం' అనే ది మాకు కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు.అది ఒక కార్యాచరణ విధానం' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. 'మేం ఉగ్రవాదంపై కేవలం దాడులు వారి ఇంటి వద్దనే కాకుండా, వారి ఇంటికి వెళ్ళి దాడులు చేస్తాం. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం అంతా దీనిని చూసింది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. స్వదేశీ రక్షణ తయారీ రంగంలో భారతదేశం సాధించిన విజయాన్ని రక్షణ శాఖ మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశంలో తయారైన రక్షణ ఉత్పత్తులు 100దేశాలకు ఎగుమతి అవుతున్నాయని, దేశం మొత్తం రక్షణ ఉత్పత్తి విలువ వార్షికంగా 1.78లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరుకుందని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. 'నేడు భారతదేశం కేవలం రక్షణ పరికరాలను తయారుచేయడం మాత్రమే కాదు, ప్రపంచానికి ఒక విశ్వసనీయమైన భద్రతా భాగస్వామిగా ఎదుగుతోంది. హిందూ మహా సముద్రం నుండి ఇండో పసిఫిక్ వరకు భారతదేశ పాత్ర నిరంతరం బలపడుతోంది' అని ఆయన హిందీలో అన్నారు. 2029నాటికి దేశం రూ.3లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తి మైలురాయిని చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రక్షణ మంత్రి వివరించారు.'ఒక దేశం ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నావిగేషన్ వ్యవస్థలు, క్షిపణులు, ర్యాడార్లు, డ్రోన్‌లపై ఇతర దేశాలపై ఆధారపడితే, దాని వ్యూహాత్మక , సైనిక సంపత్తి కూడా పరిమితం అవుతుంది. దీనిని పూర్తిగా మార్చాలనే పూర్తి ఉద్దేశంతో మేము ఉన్నాం' అని ఆయన అన్నారు. 'ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత భారత పరిశ్రమలపై ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని బలోపేతం చేసే దిశగా 'మోదీ'ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద అడుగు ఇదే' అని సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ అనేది సాంకేతిక యుద్ధానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అన్నారు. ఈ ఆపరేషన్‌లో ఆకస్తీర్, ఆకాష్, క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్ వంటి అధునాతన క్షిపణి వ్యవస్థలతో పాటు అనేక తాజా పరికరాలు కూడా ఉపయోగించబడినాయని, భారతదేశ సాయుధ బలగాలు మార్పును అర్థం చేసుకోవడమే కాకుండా, విశ్వాసంతో కూడా పనిచేస్తున్నాయన్నది ఆపరేషన్ సిందూర్ రుజువు చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

## రామ మందిరం విరాళాల చోరీ పిటిషన్లపై...
# 20న 'సుప్రీం' విచారణ

### యుపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'సిట్' ఒక స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిరానికి సంబంధించిన విరాళాల దుర్వినియోగంపై నిష్పాక్షికమైన, నిర్ణీత కాల పరిమితితో కూడిన దర్యాప్తును కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు జులై 20న విచారణ చేపట్టనుంది. జులై 20నాటి సుప్రీంకోర్టు కేసుల జాబితా ప్రకారం ఈ అంశానికి సంబంధించిన నాలుగు వేర్వేరు పిటిషన్లు ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానున్నాయి. జులై 13న ఈ పిటిషన్లను విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తమకు ఒక స్టేటస్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించింది. 'కొన్ని రిట్ పిటిషన్‌లపై ఎఫ్‌ఐఆర్‌లు ఇప్పటికే నమోదు అయ్యాయని, ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ఒక సిట్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నందున ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేసిన సిట్ ఈ కోర్టుకు స్పెషల్ స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని మేం ఆదేశిస్తున్నాం'అని సుప్రీంకోర్టు పేర్కొంది.ఈ కేసు పిటిషనర్లలో ఒకరైన నరేంద్ర కుమార్ గోస్వామి ఈ కేసులో సిబిఐ విచారణను కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రామ మందిరం వ్యవహారాలను నిర్వహించే శ్రీ రామ్ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆడిట్ చేయాలని కూడా ఆయన కోరారు. సుప్రీంకోర్టులో పిటిషన్లలో ఒక దానిని దాఖలు చేసిన అజయ్ కుమార్ రాయ్, దినేష్ కుమార్ యాదవ్, ఆలయ ట్రస్ట్ వ్యవహారాలు, పరిపాలనకు సంబంధించిన ఆరోపిత ఆర్థిక అవకతవకలు, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలపై సిబిఐ నేతృత్వంలోని బహుళ విభాగాల కమిటీ దర్యాప్తు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ కోరడంతోపాటు ట్రస్ట్ మొత్తం ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని కూడా ఆర్‌జెడి ఎంపి సుధాకర్ సింగ్ తన మూడవ పిటిషన్‌లో కోరారు. హిందూ ధర్మ పరిషత్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌లో ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని కోరారు. రామ మందిరానికి అందిన విరాళాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నేపథ్య ంలో ఆలయ ట్రస్ట్ చేసిన అభ్యర్థన మేరకు జూన్ 13న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసింది. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) కిరణ్ ఎస్, స్పెషల్ సెక్రటరీ (ఫైనాన్స్) నీల్ రతన్ 'సిట్'కు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

## విద్యావ్యవస్థను పునర్నిర్మించాలి

### ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** దేశంలో కొనసాగుతున్న విద్యావ్యవస్థపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. పిల్లలకు ఒత్తిడి లేని సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేలా, అలాగే తల్లిదండ్రులు తమ త్యాగాలకు తగిన ఫలితాన్ని పొందేలా విద్యా వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డెహ్రాడూన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) ర్యాలీకి సంబంధించిన వీడియో క్లిప్‌ను రాహుల్‌గాంధీ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. మే నెలలో పేపర్ లీక్ ఆరోపణల కారణంగా నీట్‌యుజి పరీక్ష రద్దయిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న రియా కుమారి తండ్రి రాజేష్ కుమార్‌ను రాహుల్‌గాంధీ వేదికపైకి పిలిచారు. 'తన కుమార్తెను కోల్పోయిన బాధలో రియా తండ్రి రాజేష్ జీ ఎంతగా కుంగిపోయారంటే, ఆయనను చూసిన ప్రతి ఒక్కరి కళ్లలోనూ నీళ్లు తిరిగాయి. ఇది కేవలం ఒక కుటుంబం పడుతున్న బాధ మాత్రమే కాదు; పేపర్ లీక్ కారణంగా ఇలాంటి అనేక కుటుంబాల నుంచి పిల్లలు దూరమయ్యారు. ప్రతి పేరు వెనుక ఒక తల్లి, ఒక తండ్రి ఉంటారని, వారికి ఇకపై ఎటువంటి భవిష్యత్తు లేదు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'ఈ విద్యా వ్యవస్థను మొదటి నుంచీ పునర్నిర్మించాలి. పిల్లలకు ఒత్తిడికి బదులుగా భద్రత లభించేలా, తల్లిదండ్రులు కన్నీళ్లకు బదులుగా తమ త్యాగాలకు తగిన ఫలితాన్ని పొందేలా ఒక వాతావరణాన్ని సృష్టించాలి' అని రాహుల్‌గాంధీ అన్నారు. విద్యా సంస్థలపై ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థకూ ఆధిపత్యం ఉండకూడదని శుక్రవారం నాడు గాంధీ పేర్కొన్నారు. అలాగే, పేపర్ లీక్ సమస్యపై రాజకీయ ఏకాభిప్రాయం సాధించాలని, ఇది అందరి బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. శుక్రవారం సాయంత్రం డెహ్రాడూన్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ, మొత్తం విద్యా వ్యవస్థ— పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు— పేపర్ లీక్‌లలో భాగమైందని, దీనివల్ల ఇప్పటివరకు 7.5 కోట్ల మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని ఆయన ఆరోపించారు.

## అభిషేక్ బెనర్జీ ఆఫీసు కూల్చివేత



**కోల్‌కతా :** బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బుల్డోజర్ చర్యలకు పాల్పడుతున్నాయి. తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గళం ఎత్తితే అణచివేతకు చర్యలకు పాల్పడుతున్నాయి. తాజాగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన బిజెపి కూడా బుల్డోజర్ చర్యలను ప్రారంభించింది. ఆమోదిత భవన ప్రణాళిక లేకుండా, నిబంధనలను ఉల్లంఘించి అమ్తాలలోని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అభిషేక్ బెనర్జీ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేసేందుకు దక్షిణ 24 పరగణాల జిల్లా యంత్రాంగం శనివారం నాడు చర్యలు ప్రారంభించిందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. పోలీసులు, కేంద్ర బలగాలు కార్యాలయ ప్రాంగణాన్ని గార్డ్ రెయిల్స్‌తో దిగ్బంధించడంతో ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. మధ్యాహ్నం సమయంలో మూడు బుల్డోజర్లను తీసుకువచ్చి, యంత్రాంగం కార్యాలయం ముందు ఉన్న షెడ్డును తొలగించడం ప్రారంభించింది. ఆ తర్వాత భవనం ముందు భాగాన్ని కూల్చివేసింది. ముందుజాగ్రత్త చర్యగా అగ్నిమాపక, అత్యవసర సేవల సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు. తప్పనిసరిగా పాటించాల్సిన పరిపాలనా ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే ఈ చర్య చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కూల్చివేత ప్రక్రియ సందర్భంగా, పోలీసులు భవనం నుంచి అనేక కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, పెద్ద సంఖ్యలో ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కూల్చివేతతో ఆ ప్రాంతంలో గుమిగూడిన బిజెపి కార్యకర్తలు, మద్దతుదారులు సంబరాలు చేసుకుని పైశాచిక ఆనందం పొందారు. వారు తమ పార్టీకి మద్దతుగా నినాదాలు చేశారు. అభిషేక్ బెనర్జీ పార్టీ కార్యాలయాన్ని భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించారని బిజెపి అమ్తాలా ఎమ్మెల్యే అగ్నిశ్వర్ నస్కర్ ఆరోపించారు.

## రాయ్‌పూర్‌లో ఐదుగురు మృతి

**ఛత్తీస్‌గఢ్:** రాయ్‌పూర్‌లోని ఓ ఇంట్లో ఐదుగురి మృతి కలకలం రేపింది. ఇంట్లో దంపతులతో పాటు కుమారుడు, ఇద్దరు మైనర్ కూతుర్లు మృతిచెంది ఉన్నట్లు శనివారం పోలీసులు తెలిపారు. సంజయ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో మరణాల విషయం శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చిందని వారన్నారు. ఒక వ్యక్తి కుటుంబసభ్యులకు విషమిచ్చి అనంతరం ఉరివేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.


### పత్రిక ప్రకటన

నేను, **గుండ్ల జగన్, తండ్రి చంద్రయ్య,** మారుతి నగర్, బిసైడ్ ఫ్రూట్ మార్కెట్, కొత్తపేట్. యాచారం మండల్ & విలేజ్‌లో సర్వే నెంబర్ 9/p,10/p, 11/p లో గల వెంచర్‌లో ప్లాట్ నెంబర్ 23, 22. మొత్తం 400 గజాలు, డాక్యుమెంట్ నెంబర్స్ **29681/2019, 29682/2019** డాక్యుమెంట్స్ సాగర్ రింగ్ రోడ్డు నుండి ఇబ్రహీంపట్నం వెళ్లే బస్సులో ప్రయాణించేటప్పుడు మార్గం మధ్యలో పోయినవి. దయచేసి ఎవరికైనా దొరికితే పై చిరునామాలో ఇవ్వగలరు.
**మొబైల్ నెంబర్: 7997777341**

### సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మూసాపేట సర్కిల్-53.

Lr No. 13/CMC/MPT-53/EE/2026-27 Date: 17.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 13/CMC/MPT53/ EE/2026-27 Dated: 17.07.2026 | సిఎంసి, మూసాపేట సర్కిల్-53లో బోనాల పండుగ పనులు | రూ. 7.30 లక్షలు | 24.07.2026 01:00 PM 27.07.2026 02:00 PM | శ్రీమతి టి.రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మూసాపేట సర్కిల్-53, సెల్: 8897507674 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మూసాపేట సర్కిల్-53, సిఎంసి.
DIPR R.O. No. : 6312-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్కిల్-23 & సర్కిల్-24

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

**Nit No.** 20/EE-23&24/RJNRZ/GHMC/2026-27, **పని పేరు:** (07) నెంబర్ల పనులు, **అంచనా విలువ:** రూ.67.25 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 21.07.2026 సా.5:00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ: 24.07.2026 సా.5:00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ బి.నాగేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23 & సర్కిల్-24, ఆర్‌జెఎన్ఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, ఫూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చంద్రాయణగుట్ట & సర్కిల్-24, జంగంమెట్/ ఆర్‌జెఎన్ఆర్‌జెడ్/జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 6284-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

### మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-12

Date: 18.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 10/EE12/ SRNR/MMC/2026-27, Dated: 18-07-2026 | ఒకరు (01) "కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం" పనికి సంబంధించి | రూ. 12.20 లక్షలు | 20.07.2026 @03:10 PM | శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.eprocurement.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి.
DIPR R.O. No. : 6299-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

### తెలంగాణ ప్రభుత్వం
### రోడ్లు & భవనాల శాఖ
(ఆర్&బి) విభాగం : కామారెడ్డి

NIT No. 11-12/DB/T3/EE/R&B/KMR/2026-27 తేదీ : 13.07.2026

| క్ర. సం. | N.I.T No. & Dated. | పని పేరు | అంచనా మొత్తం |
|---|---|---|---|
| 1 | 11/2026-27 తేదీ: 13.07.2026 | కామారెడ్డి జిల్లాలోని బాన్స్‌వాడ బిచుకుంద రోడ్‌లో కి.మీ. 4/0-6 వద్ద ఉన్న బ్రిడ్జికి దెబ్బతిన్న విస్తరణ జాయింట్లకు అత్యవసర మరమ్మతులు. | రూ.3.50లక్షలు |
| 2 | 12/2026-27 తేదీ: 13.07.2026 | నిజామాబాద్ జిల్లాలో (కొత్తగా ఏర్పడిన కామారెడ్డి జిల్లా) ధర్మారెడ్డి నుండి ముద్దాపూర్ వయా వెంకంపల్లి రోడ్డు, పి.ఆర్.రోడ్డు వరకు మంజీరా నదిపై హెచ్‌ఎల్‌బి నిర్మాణం (ఉపపని : పైలాన్ నిర్మాణం) | రూ.4.00లక్షలు |

1. టెండర్ల స్వీకరణ ప్రారంభం: 21.07.2026 సాయంత్రం 4.00 గంటలలోపు టెండర్‌దారులు 14.07.2026 సాయంత్రం 4గంటల నుండి ఇ-మార్కెట్ ప్లేస్ అనగా, https//tenders.telangan.gov.in నుండి టెండర్ షెడ్యూళ్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
2. సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరు మరియు చిరునామా: "శ్రీ పి.మోహన్ , బి.టెక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి) డివిజన్ : కామారెడ్డి మొబైల్ నెం. 09247890376"
3. మరిన్ని వివరాల కోసం @ e-procurement market place : https//tenders.telangana.gov.in ను సందర్శించండి.
4. సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్&బి) నిజామాబాద్ సర్కిల్ వారికి సమాచారం నిమిత్తం ప్రతి సమర్పించడమైనది.
5. సమాచారం కోసం DEE (R&B) సబ్ డివిజన్ : కామారెడ్డి , యెల్లారెడ్డి, బాన్స్‌వాడ & బిచుకుండకు కాపీ చేయండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్ : కామారెడ్డి
DIPR R.O. No. : 6283-PP/CL/ADVT/2026-27, Date: 18-07-2026

# ఎర్రసముద్రంలో రాకపోకలు ఆపేస్తాం

• భవిష్యత్తులో భీకర యుద్ధం • అమెరికాకు ఇరాన్ హెచ్చరిక • 12 రోజుల్లో 50 మంది ఇరానీయులు మృతి:500మందికి గాయాలు • 10 ఇరాన్ క్షిపణులు కూల్చేసిన జోర్డాన్



**టెహ్రాన్/వాషింగ్టన్:**ఎంయు ఒప్పందానికి కాలం చెల్లిందని,ఎదురుచూపుల సమయం ముగిసిందన్న ప్రకటనలమధ్య అమెరికా–ఇరాన్ దేశాల సైన్యాల పరస్పర దాడులు ఆగకుండా కొనసాగాయి.శనివారం తెల్లవారకముందే ఏడోరోజు రాత్రి కూడా ఇరాన్‌పై భారీ దాడులు పూర్తిచేసినట్లు అమెరికాసైన్యం సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలు, జాతీయ రహదారులు, నీటిశుద్ధి కేంద్రాలు, నిఘా కేంద్రాలు, భూగర్భ ఆయుధ నిల్వలు,సముద్రతల ఆయుధ సంపద, ఇతర పౌర మౌలిక సదుపాయాలపై సెంట్‌కామ్ దాడులు చేయగా, అమెరికా మిత్రదేశాలు బహ్రైన్, జోర్డాన్, కువైట్‌లలో అమెరికా స్థావరాలపై ఐఆర్‌జిసి ప్రతిదాడులు కొనసాగించింది. ఇరాన్ నగరం యజ్ద్,జలసంధిని ఆనుకుని ఉన్న ఖేష్మ్‌ద్వీపం,బందర్‌అబ్బాస్ ఓడరేవులు పేలుళ్ళతో దద్దరిల్లాయి. ఉత్తర హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో 100కు పైగా టెలికమ్యూనికేషన్స్ టవర్స్‌ను ధ్వంసం చేయడంతో మొబైల్‌ఫోన్లు,ఇంటర్‌నెట్ సేవలు స్తంభించచాయి. మరోవైపు బహ్రైన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, కువైట్‌లోని అల్ అహ్మది పోర్టుపై ఐఆర్‌జిసి క్షిపణి దాడులు చేసింది.ఒక విద్యుత్‌ప్లాంటు,చమురు కేంద్రం, నీటిశుద్ధి కర్మాగారం తీవ్రంగా దెబ్బతిన్నట్లు కువైట్ ప్రకటించింది.కువైట్‌దేశం 90 శాతం త్రాగునీటి అవసరాలకోసం సముద్రనీటిశుద్ధిపైనే ఆధారపడుతోంది. ఇరాన్ దాడులవల్ల తీవ్రంగా మంటలు చెలరేగడంతో మంటలు ఆర్పే ప్రయత్నంలో అనేకమంది అగ్నిమాపకదళ కార్మికులు గాయపడ్డారు. ఇరాన్ కూడా ఒక ప్రకటన చేస్తూ ఇర్బిల్ నగరంపై ఇరాన్ ప్రయోగించిన క్షిపణు కూల్చివేశామని పేర్కొంది. తమ గగనతలంపైకి ఇరాన్ ప్రయోగించిన 10 క్షిపణులను కూల్చివేశామని, ఎలాంటి ప్రాణనష్టం,ఆస్తినష్టం లేకుండా వాటి శిథిలాలను కూడా మెరైన్ ఇంజనీర్లు శుభ్రం చేసేశారని జోర్డాన్ రక్షణ బలగాలు ప్రకటించాయి.ఇరాన్‌లోని దక్షిణ హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో అమెరికా గగనదాడులతో ముగ్గురు ఇరానీయులు మరణించారు. మరో ఎనిమిదిమంది గాయపడ్డారు. జాస్క్ సమీపంలో సముద్రనీటిని శుద్ధిచేసి త్రాగునీరుగా మార్చే ప్లాంట్లను యుద్ధ విమానాలు ధ్వంసం చేయడంతో 20 గ్రామాలలో ఉన్న వేలాదిమంది ప్రజలకు పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయిందని ఇరాన్ నేషనల్ వాటర్ కంపెనీ ప్రకటించింది. అదేవిధంగా జులై ఆరో తేదీ నుడి ఈనాటి వరకూ అమెరికా చేసిన దాడుల్లో 50 మంది ఇరానీయులు మరణించగా, మరో 500 మంది గాయపడ్డారని ఇరాన్ ప్రకటించినట్లు అల్‌జజీరా పేర్కొంది.గడచిన సోమవారం నుండి 26 మంది అమెరికా సైనికులు గాయపడగా, యుద్ధం మొదలైనప్పటినుండీ 14 మంది సైనికులు మరణించగా,427 మంది గాయపడినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. హోర్ముజ్ దక్షిణమార్గంలో వెళుతున్న రెండు చమురు ట్యాంకర్లు సముద్రంలో ఇరాన్ పెట్టిన మందుపాతరలను ఢీకొని ధ్వంసమయ్యాయి. మరో నాలుగు నౌకలను కదలకుండా స్తంభింజేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది.దేశంలో పౌర మౌలిక విద్యుత్ కేంద్రాలపై అమెరికా దాడులను ఇరాన్ ధృవీకరించింది.విద్యుత్ కొరత ఏర్పడిందని, పౌరులు పొదుపుగా కరంటు వాడుకోవాలని కోరింది. భవిష్యత్తులో పెను యుద్ధం జరుగుతుందని ఇరాన్ ప్రకటించింది. ఈ భారీ యుద్ధానికి సిద్ధంగా ఉండాల్సిందేనని తన మిత్రసైన్యాలకు పిలుపు ఇచ్చింది. ఇరాన్‌కు ఈ యుద్ధంలో హౌతీలు,హెజ్బొల్లాలు,హమాస్ సైన్యాలు ప్రధాన అండదండలుగా వస్తాయి. రాబోయే పెను యుద్ధానికి హెజ్బొల్లాలే నాయకత్వ పాత్ర వహించనున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు తెలియజేశాయి. మరోవైపు ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకలను నిలిపివేసేందుకు ఏ క్షణంలోనైనా సిద్ధంగా ఉండాలని హౌతీలకు జులై 16వ తేదీన ఇచ్చిన పిలుపును ఇరాన్ పునరుద్ఘాటించింది. ఇరాన్‌ను నాశనం చేసే వ్యూహాన్ని ట్రంప్ అమలు చేస్తే ఈసారి తమ దాడులు విస్తారంగా,విధ్వంసకరంగా ఉంటాయని ఐఆర్‌జిసి ఖతమ్–అన్బియా కేంద్ర కార్యాలయం ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫఘారీ రెండు రోజులక్రితమే ట్రంప్‌కు హెచ్చరిక చేశారు. హోర్ముజ్ జలసంధిని ఒక అభేద్యమైన "రెడ్‌లైన్"గా ఆయన అభివర్ణించారు. జలసంధి వ్యవహారాల్లో అమెరికా దురాక్రమణ జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు. ఇదిలాఉండగా, పశ్చిమాసియా యుద్ధం వల్ల ఈసారి చమురు సరఫరాలకు పెద్ద ప్రమాదం పొంచి ఉందన్న సందేహాలు వ్యక్తమవుతున్న తరుణంలో శనివారం చమురు ధర 1.2 శాతానికి పెరిగింది. బ్రెంట్‌క్రూడాయిల్ బ్యారెల్ ధర 86 డాలర్లకు చేరింది.

## 'రేపు' బ్రిటన్ ప్రధానిగా బర్న్‌హామ్ ప్రమాణ స్వీకారం



**లండన్:**బ్రిటన్ లేబర్‌పార్టీ అధినేతగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్ జులై 20వ తేదీన దేశ ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు కూడా చేపట్టనున్నారు. భారీ ప్రణాళికతో ఆయన బరిలోకి దిగుతున్నారు. పదవి చేపట్టాక ఉత్తర సముద్రంలో కొత్తగా గ్యాస్–చమురు తవ్వకాలకు సంబంధించిన ఒక ప్రణాళికను ప్రకటించనున్నారు. బ్రిటన్ మీడియా సమాచారం ప్రకారం,దేశంలో కొత్త లైసెన్సులు జారీ చేయకుండా, ఉన్న లైసెన్సులను గౌరవించి ఉత్తర సముద్రంలో చమురు–గ్యాస్ తవ్వకాలపై స్టార్‌మర్ కాలంలో చెలరేగిన వివాదాన్ని ముగించాలని ఆయన కోరుకుంటున్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో సొంత వనరులను సద్వినియోగం చేసుకోలేకపోవడం అవివేకమని ఆయన వ్యాఖ్యానించారు. గడచన పది సంవత్సరాలుగా దేశం ఎదుర్కొంటున్న అస్థిరత,రాజకీయ సంక్షోభానికి తెరదించి, వర్తమాన ఆశ్రిత ప్రపంచ రాజకీయాల్లో దేశాన్ని స్వయంసమృద్ధి దిశగా తీసుకువెళ్ళి 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి లేబర్‌పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కృతనిశ్చయంతో ఉన్నారు. దానికి తగ్గట్టుగా ఒక ముందస్తు ప్రణాళికలో ఆయన రంగ ప్రవేశం చేస్తున్నారు. లేబర్‌పార్టీని సంస్కరించడానికి, దేశంలో పరివర్తన తీసుకురావడానికి ఐదు మార్గదర్శకాంశాలను బర్న్‌హామ్ ప్రకటించారు. ప్రజల జీవన వ్యయాల భారాలు తగ్గిస్తామని, ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడంపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. గడచిన నాలుగు దశాబ్దాల బ్రిటన్ రాజకీయాలలో రాబోయే పరివర్తనకాలాన్ని అత్యంత ముఖ్యమైన ఘట్టంగా ఆయన అభివర్ణించారు. దేశంలో,లేబర్‌పార్టీలో మార్పులు తెచ్చేందుకు సిద్ధమయ్యారు.ఎలాంటి పోటీ లేకుండా లేబర్‌పార్టీ నాయకుడుగా శుక్రవారం విజయం సాధించిన తర్వాత జరిగిన ప్రత్యేక సదస్సులో బర్న్‌హామ్ తన భవిష్యత్ ప్రణాళిక గురించి చెప్పారు. 2024లో పార్టీ అధికారంలోకి రావడానికి ప్రకటించిన ప్రణాళిక అంశాలను, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తామని చెప్పారు. పార్టీలో అంతర్గత కలహాలను అంతం చేస్తానని, భిన్నాభిప్రాయాలకు విలువ ఇస్తానని చెప్పారు. బ్రిటన్‌లో సరికొత్త రాజకీయ వ్యవస్థ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రధానమంత్రి నివాసం,కార్యాలయమైన టెన్ డౌనింగ్ స్ట్రీట్ అధికారుల నుండి అత్యంత ప్రమాదకరమైన,పొంతనలేని ప్రకటనల సంస్కృతికి కూడా అంతం పలుకుతానని చెప్పారు. గడచిన పది సంవత్సరాలుగా బ్రిటన్ రాజకీయాలు ఎదుర్కొంటున్న అస్థిరత,గందరగోళానికి అంతం పలకాలని కోరుకుంటున్నానని, వీలైనంత ఏకాభిప్రాయాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. గడచిన పది సంవత్సరాలలో బ్రిటన్ ఇప్పటికి ఏడుగురు ప్రధానమంత్రులను (కాబోయే బర్న్‌హామ్ సహా)చూసింది.

## చైనాలో కొండచరియలు పడి 8మంది మృతి

**10 భవనాలు నేలమట్టం: 34 మంది గల్లంతు మెక్సికో,గౌతమాలా,చైనాలో భారీ భూకంపం**

**ఛోంగ్‌కింగ్:** చైనాలోని ఛాంగ్‌క్వింగ్ నగరంలో కొండచరియలు విరిగిపడ్డాయి. పది నివాసిత భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో ఎనిమిది మంది సజీవసమాధి అయ్యారు. మరో 34 మంది జాడ తెలియడంలేదు. వారు సజీవంగా ఉండి ఉంటారన్న ఆశతో సహాయబృందాలు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. పెంగ్‌షూయిా కౌంటీలో శుక్రవారం ఉదయం ఘటన జరిగాక ఈ ప్రాంతం నుండి 1100 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సిసిటీవీలలో చూసిన సమాచారం ప్రకారం కొండ చరియల నుండి కింద భవంతులపైన పడిన పెద్ద పెద్ద రాళ్ళు బహుళ అంతస్తుల భవనాల సైజు కంటే చాలా పెద్దవిగా ఉండి దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో చాలారోజులుగా ఆగకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కొండ చరియల నుండి 18,000 క్యూబిక్ మీటర్ల రాళ్ళు,మట్టి ఈ జారి ఈ భవంతులపై పడింది. వీటిల్లో అతిపెద్దదైన ఒకేఒక్క కొండరాయి 3000 క్యూబిక్ మీటర్లు ఉంటుందని అంచనావేసినట్లు పెంగ్‌షూయిా కౌంటీ ప్రణాళిక,ప్రకృతి వనరుల విభాగాధిపతి వాంగ్ ఛౌన్‌జున్ పత్రికాగోష్టిలో చెప్పారు. ఇదిలా ఉండగా దక్షిణ మెక్సికోలో,గౌతమాలా,ఎల్‌సాల్వడార్‌లలో దీంతో పసిఫిక్‌లోని కొన్ని ప్రాంతాలలో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఎల్‌సాల్వడార్‌లో కూడా తీవ్ర ప్రకంపనలు సంభవించాయి.

## రాజకీయాల్లోంచి తప్పుకుంటా

(3వ పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో శక్తి వంచన లేకుండా పనిచేశామన్నారు. ఉద్యోగాల విషయంలో 95 శాతం రిజర్వేషన్ల కోసం రెండేళ్ల పాటు ఫైలు పెండింగ్‌లో పెట్టారని, ఈ విషయంపై ప్రధాని మోదీని కలిసిన కెసిఆర్‌ను రాష్ట్రం దేశంలో ఉందనుకుంటున్నారా, లేక మీది సపరేటు దేశం అనుకుంటున్నారని ప్రశ్నించారని, తమ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నదే నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పి సాధించుకోవడం జరిగిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కొన్ని పొరపాట్లు జరిగాయన్నారు. టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్ అయింది. లీక్ వీరులను కాంగ్రెస్, బిజెపి పట్టుకోలేదు, మీడియా కూడా పట్టుకోలేదు, బిఆర్‌ఎస్ ప్రభుత్వమే పట్టుకుందని, వాళ్ళని కూడా ప్రభుత్వం శిక్షించిందని కెటిఆర్ చెప్పుకొచ్చారు. బిఆర్‌ఎస్ పాలనలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇచ్చామని, 24 లక్షల ప్రైవేటు ఉద్యోగాలు వచ్చాయని వెల్లడించారు. శనివారం రాకెట్ ప్రయోగించిన స్కైరూట్ టిహబ్‌లోనే పురుడుపోసుకుందని కెటిఆర్ అన్నారు. ఖాళీగా ఉన్న 20వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయాలని దిల్‌సుఖ్‌నగర్ నిరుద్యోగలు ఉద్యమిస్తే... ఏ డ్రిన్ తాగి సచ్చినా, బావిలోపడి సచ్చినా ఇవ్వనుగాక ఇవ్వనని రేవంత్ రెడ్డి అంటున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. కెసిఆర్ 48 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చినప్పుడు, మీరు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. 'రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డికి డెత్ డిక్లరేషన్ రాయాలి. యూత్ డిక్లరేషన్ పేరిట మోసం చేసిన కాంగ్రెస్ నేతలకు డెత్ డిక్లరేషన్ ఇవ్వాలి. యువతరంతో పెట్టుకుంటే తరాలపాటు పుట్టగతులు లేకుండా పోతారు. రాహుల్‌కు మన భాష రాదు, మన బాధ తెలవదు. యూత్ డిక్లరేషన్‌లో రాహుల్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? తెలంగాణలో నోటిఫికేషన్లు లేవు, లూటిఫికేషన్లే ఉన్నాయి. యువతకు జాబులు లేవు. రాహుల్‌గాంధీ జేబులే నిండుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాహుల్‌గాంధీ జేబు నింపుతున్నారు' అని కెటిఆర్ మండిపడ్డారు.

## అనుమానాలు

(3వ పేజీ తరువాయి)

ప్రదేశం నుండి బలవంతంగా తరలించాలని ఆదేశించలేదన్నారు. అయితే తాజా పరిణామాలు ప్రభుత్వ ఉద్దేశాలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయని, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆకస్మికంగా మార్చడం, ఆ తర్వాత శాంతియుత ఉద్యమంపై ఈ అణచివేత చర్యలు చేపట్టడం, పెరుగుతున్న విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసి, 20న పార్లమెంటుకు ప్రతిపాదిత యాత్రను అడ్డుకోవడమే లక్ష్యమనే అనుమానాలను మరింత బలపరిచాయని డి. రాజా తెలిపారు. శాంతియుత ప్రజాస్వామ్య నిరసనలపై ఇటువంటి పెత్తందారీతనానికి రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో చోటు లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే తన అణచివేత విధానాన్ని విడనాడి, శాంతియుత నిరసనకారులందరి ప్రజాస్వామ్య హక్కులు, భద్రతను కల్పించి, విద్యార్థి ఉద్యమంతో అర్థవంతమైన సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు. పదేపదే పరీక్షలు విఫలమవడానికి ప్రభుత్వం వహించాల్సిన బాధ్యతను ఎలాంటి బలప్రయోగం చెరిపివేయలేదన్నారు. న్యాయం కోసం చేస్తున్న డిమాండ్‌ను లాఠీఛార్జ్ చేసి అణచివేయలేరని, దేశ పరీక్షా వ్యవస్థ కుప్పకూలడానికి నైతిక, రాజకీయ బాధ్యతను అంగీకరిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ తన డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తోందని డి. రాజా పేర్కొన్నారు.

## 'కమిటీ కుర్రోళ్లు'

(3వ పేజీ తరువాయి)

విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వాళ్లకు అవార్డులు ప్రదానం చేస్తారు.

అవార్డుల జాబితా

ఉత్తమ తెలుగు చిత్రం : కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ పాపులర్ చిత్రం : కల్కి 2798 ఏడీ
ఉత్తమ బాలల చిత్రం : 35 చిన్న కథ కాదు
ఉత్తమ మేకప్ : పి.రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు)
బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ (ఒరిజనల్): సుకుమార్ (పుష్ప2)
బెస్ట్ డైలాగ్ రైటర్ : వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ : దీపాలి నూర్, శీతల్ శర్మ (పుష్ప2)
బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ : నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2798 ఏడీ)
ఉత్తమ చిత్రం : ఆర్టికల్ 370
ఉత్తమ నటుడు : మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్ (ఇద్దరికీ)
ఉత్తమ నటి : యామీ గౌతమ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ దర్శకుడు : రాజ్‌కుమార్ పెరియస్వామి (అమరన్)
ఉత్తమ నేపథ్య గాయని : వైకోం విజయలక్ష్మి (ఎఆర్ఎం)
ఉత్తమ నేపథ్య గాయకుడు : అభయ్ జోధ్ పుర్కర్
బెస్ట్ సినిమాటోగ్రఫర్ : జలాల్ (భ్రమయుగం)
ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రం : కెప్టెన్ మిల్లర్ (తమిళం)
బెస్ట్ ఎడిటర్ : కలైవన్నన్ (అమరన్)
బెస్ట్ సౌండ్ డిజైనర్ : మానస్ చౌదరి (భూల్ బులియా)
బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ : యోగేశ్ దేశ్‌పాండే
ఉత్తమ పాటల రచయిత : మనోజ్ ముంతాసిర్ (మైదాన్)
ఉత్తమ నేపథ్య సంగీతం : జివి ప్రకాశ్ కుమార్ (అమరన్)
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు) : శశ్వంత్ సచ్‌దేవ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ తమిళ చిత్రం : రాయన్
ఉత్తమ మలయాళ చిత్రం : ఫెమినిస్ట్ ఫాతిమా
ఉత్తమ కన్నడ చిత్రం : మిథ్య (ఇల్యూజన్)
ఉత్తమ హిందీ చిత్రం : శ్రీకాంత్
ఉత్తమ గుజరాతీ చిత్రం : మారన్ (ద హంట్)
ఉత్తమ బెంగాలీ చిత్రం : చల్‌చిత్ర ఎకో
బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ : సంజీవ్ శ్రీవాస్తవ (హిందీ)
సినిమాలపై ఉత్తమ పుస్తక రచయిత : ప్రదీప్‌కుమార్ శెట్టి (కన్నడ)
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ ద చోలా డోరా ఔర్ సూయి
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ భద్రకాళి నాటకం
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ స్క్రిప్ట్ ఓబుర్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ సినిమాటోగ్రఫీ లైవ్ ఇన్ లూమ్
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డైరెక్షన్ ఆనంద్ రాయ్ (స్టాట్యూ ఆఫ్ యూనిటీ)
నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డాక్యుమెంటరీ రామ్ నమీ
స్పెషల్ మెన్షన్ మేయళగన్ (తమిళం)
స్పెషల్ మెన్షన్ తమిళ చిత్రం కెప్టెన్ మిల్లర్ (ధనుష్)




## నిర్బంధాలు ఆపాలి

(3వ పేజీ తరువాయి)

సాంప్రదాయ హక్కులను కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ పేరుతో ఆదివాసీలను వారి పురిటిగడ్డ నుండి దూరంచేసే ఏ ఒక్క చర్యను కూడా సహించేది లేదని హెచ్చరించారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే హక్కుల సాధన కోసం యువత పెద్ద ఎత్తున కదలాలన్నారు. భవిష్యత్‌లో గిరిజన ఐఖ్యతను చాటే విధంగా మరిన్ని ఉమ్మడి ఉద్యమాలను ఉధృతం చేస్తామని చేశారు.

**అణిచివేతలపై ఉద్యమించక తప్పదు : కూనంనేని**

అడవిపై ఆధారపడి బతుకుతున్న గిరిజన బిడ్డలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని, ఇలాంటి అణిచివేతలపై ఉద్యమించక తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. తరాలుగా సాగుచేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. పాలకుల అణిచవైత వైఖరిపై ఐఖ్య ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ మహాసభల ద్వారా గిరిజన సమస్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించి రాబోయే రోజుల్లో బలమైన పోరాటాలు నిర్మిస్తామన్నారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులను ఇతర రంగాలకు మళ్లించడాన్ని తక్షణమే ఆపాలని, జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసారు. అడవి బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తాము ఎల్లవేళలా ముందుంటామని శాసన సభ లోపల వెలుపల వారి గొంతుకగా నిలబడతానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కొండంత అండగా ఉన్న ఉపాధి హామీ పథకం పేరు మార్చి దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికల్పనను దెబ్బతీసే ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలునిచ్చారు. ఉపాధిహామీ నిధులను తగ్గించడం వల్ల వలసలు పెరిగిపోయే ప్రమాదం ఉందని, స్థానికంగానే పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఐటిడిఏల పనితీరును మెరుగు పరచాలని స్థానిక సంస్థలకు నిధులు విధులను బదిలీ చేయాలని కోరారు. అటవీహక్కుల చట్టం2006ను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పోడుభూముల సమస్యను శాశ్వత పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలందరినీ ఏకం చేసి హక్కుల సాధన కోసం అతిపెద్ద జాతీయ ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం అనీ రాజా, కూనంనేని బంజార సంప్రదాయ బిందెలను నెత్తిన ఎత్తుకున్నారు. ఇందులో భాగంగా అనీరాజా బంజారా మహిళా వస్త్రధారణకు చెందిన చెంగును నెత్తిన వేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, రమావత్ అంజయ్య నాయ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మునిస్పల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం కల్లూరి వెంకటేశ్వరు నరాటి ప్రసాద్ సరెడ్డి పుల్లారెడ్డి ఎస్‌డి సలీం సలిగంటి శ్రీనివాస్ మున్నా లక్ష్మీ కుమారి జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు వాసిరెడ్డి మురళీ ఉప్పుశెట్టి రాహూల్ ముష్వా వెంకటేశ్వర్లు రేసు ఎల్లయ్య గిరిజన సమాఖ్య నాయకులు జువారి రమేష్ నాయక్ స్వరూప సొందు కుటుంబ రావు భూక్య శ్రీనివాస్ బి వెంకట్ బానోత్ రాంబాబు గణేష్ వివిధ జిల్లాల ప్రతినిధులు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులురులు పాల్గొన్నారు.

## 70వేల ఉద్యోగాలు

(3వ పేజీ తరువాయి)

ఏడాది కాలంలోనే ఎల్‌బి స్టేడియం, శిల్పారామంలో తల్లిదండ్రుల సాక్షిగా 70 వేల మందికి ఉద్యోగాలచ్చామన్నారు. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని వరస నోటిఫికేషన్లతో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో అందెశ్రీ జయంతి సందర్భంగా రూ 3.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అందెశ్రీ స్మృతివనానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. బిఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకివ్వలేదని సిఎం రేవంత్ ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు మాత్రం కోట్లు దోచుకునేందుకు రాజకీయ పదవులతో కూడిన ఉద్యోగాలిచ్చారన్నారు. ఒక పక్క గ్రూప్ పరీక్షలు నిర్వహించి ప్రశ్నాపత్రాలను జిరాక్స్ సెంటర్లలో పల్లి, బఠానీల్లా దొడ్డిదారిలో అమ్మి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారని దుయ్యబట్టారు.

**అందెశ్రీ స్ఫూర్తే తమ ప్రభుత్వానికి శ్రీ రామరక్ష :** ప్రజా కవి అందెశ్రీ గానాలు తనలో స్ఫూర్తి నింపాయని, అవే తమ ప్రభుత్వానికి శ్రీ రామరక్ష అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నాటి బిఆర్‌ఎస్ పాలనలో నిర్బంధానికి గురైన అందెశ్రీ జయజయహే గీతం తెలంగాణా రాష్ట్ర గీతంగా చేర్చామన్నారు. పెన్నుల మీద మన్ను కప్పితే అవి గన్నులై మొలకెత్తినట్లు ఆ నిర్బంధం నుండి తెంచుకుని ప్రతి గుడిలో, ప్రతి బడిలో అందెశ్రీ పాట వినిపిస్తుందన్నారు. కేవలం దళితుడన్న భావంతోనే కెసిఆర్ అందెశ్రీ పాట, మాటను నిర్బంధించారన్నారు. అయినప్పటికీ ఆయన ఆత్మగౌరవంతో దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పారన్నారు. ప్రజాగాయకుడు గద్దర్‌ను ప్రగతి భవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టి కెసిఆర్ అవమానించారన్నారు.

**కుటుంబం మొత్తానికి ఫామ్‌హౌస్‌లే :** తెలంగాణ సెంటిమెంట్‌తో పదేళ్ల పాటు అధికారం చెలాయించిన కెసిఆర్ కుటుంబమంతా లక్షల కోట్లు గడించటానికే ఆలోచించారే తప్ప ఏనాడూ ఏ కోణంలోనూ ప్రజల గురించి పట్టించుకున్న పాపానికి పోలేదని సిఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కెసిఆర్ 100 ఎకరాల్లో, కెటిఆర్ 100 ఎకరాల్లో, హరీష్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారన్నారు. పాస్‌పోర్టు బ్రోకర్ కెసిఆర్ సిఎంగా, అమెరికాలో దొడ్లు కడిగే కెటిఆర్‌కు మంత్రి పదవులు అనుభవించారన్నారు. తెలంగాణాకు రూ. 8 లక్షల కోట్లు అప్పు మిగిల్చిన కెసిఆర్ కుటుంబం మాత్రం నిజాంల కంటే ఆస్తిపరులు ఎలా అయ్యారని సిఎం ప్రశ్నించారు. కెసిఆర్‌ను ఆయన ఫామ్‌హౌస్‌లోనే సమాధి చేస్తామన్నారు. ఇకపై దోచుకుంటామంటే రానివ్వమని, రాష్ట్రం తులసి వనమని, గంజాయి మొక్క ల్లాంటి కెసిఆర్ కుటుంబాన్ని మరో సారి కెసిఆర్ మొలకెత్తకుండా చూస్తానన్నారు.

## సోనమ్ తరలింపు

(3వ పేజీ తరువాయి)

నిరాహారదీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త ఆరోగ్యం క్షీణించడంపై ఆయనను అక్కడి నుంచి తరలించే క్రమంలో సోనమ్ వాంగ్‌చుక్‌పై పోలీసులు దురుసుగా ప్రవర్తించాడన్ని కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన (యుబిటి), ఆప్ ఇతర ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ చర్య ప్రజాస్వామ్యానికి మాయమచ్చ అని అభివర్ణించాయి. కాగా, అభిజీత్ దీప్కే ప్రసంగిస్తున్న సమయంలో ఆయనపై ఓ మహిళ సిరా లాంటి ద్రవాన్ని విసిరింది. దీంతో మరో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనతో మద్దతుదారులు వేదిక వైపు దూసుకురావడంతో కార్యక్రమానికి కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది, దీంతో గందరగోళం చెలరేగింది. దీక్షను అడ్డుకోవడంపై వామపక్ష విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. ముంబాయిలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, నిపుణులైన వైద్యుల సలహా, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అవసరమైన వైద్య సంరక్షణ కోసం వాంగ్‌చుక్‌ను తరలించినట్లు ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ దీక్ష వల్ల ఆయన బలహీనపడ్డారని, ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, శరీరంలోని కీలక ఆరోగ్య సూచికలను సాధారణ స్థితికి తీసుకురావడానికి నిరంతర పర్యవేక్షణ, చికిత్స అవసరమని ఒక అధికారి తెలిపారు. కాగా, పోలీసుల చర్య తర్వాత, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే స్పందిస్తూ, నిరసనకారులపై పోలీసులు కఠిన చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు తనపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారని దీప్కే ఎక్స్‌లో పోస్టు చేశారు. తాను ఫ్రెష్ అయ్యేందుకు ఒక స్నేహితుడి ఇంటికి వెళ్లినప్పుడు పోలీసులు తనను కొట్టారని, కొంతసేపు అదుపులో ఉంచారని దీప్కే ఆరోపించారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే, ఎఐఎస్ఎ సభ్యులైన నేహా, అమీన్, మనీష్ 21వ రోజున కూడా నిరసన స్థలంలో తమ నిరాహార దీక్షను కొనసాగించారు.

**నా అనుమతి లేకుండా ఏ చికత్సా చేయవద్దు : వాంగ్‌చుక్ సతీమణి**

పోలీసుల తీరుపై సోనమ్ సతీమణి గీతాంజలి జె ఆంగ్మో తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్స చేయకూడదని హెచ్చరించారు. 'ఆయన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతి లేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతి ఒక్కరిని బాధ్యులను చేస్తా. ఆయన శుక్రవారం బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీల్లేదు. అది మా హక్కు' అని సోనమ్ సతీమణి గీతాంజలి మీడియాకు స్పష్టంచేశారు.

**ఉద్యమం ఆగదు : అభిజీత్ దీప్కే**

జంతరమంతర్ వద్ద నిరాహారదీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకుని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం నాడు నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. తమ ఉద్యమం ఆగదన్నారు. పోలీసుల చర్య అనంతరం, యువత నేతృత్వంలోని ఈ సంస్థ తమ ఆందోళనను తీవ్రతరం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 20న తాము తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేసింది. వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన తర్వాత, తాను నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభిస్తున్నానని దీప్కే ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో, 'మోదీ రాజీనామా చేయాలి!' అంటూ సిజెపి తమ నిరసన తీవ్రతను పెంచింది. ఢిల్లీ పోలీసులు వాంగ్‌చుక్ పట్ల దురుసుగా ప్రవర్తించి, బలవంతంగా తొలగించారని, ఈ ఆపరేషన్ సమయంలో కొందరు నిరసనకారులపై దాడి జరిగిందని సిజెపి ప్రతినిధి అశుతోష్ రాంకా ఆరోపించారు. ఉదయం, నిరసనకారులు స్నానం చేసి, సేదతీరడానికి 10–15 నిమిషాల విరామం తీసుకుంటారని, ఆ సమయంలో ఢిల్లీ పోలీసులు ఈ పిరికిపంద చర్యకు పాల్పడ్డారన్నారు. ఇప్పుడు అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష ప్రారంభించారని, ఇక తాము ఇక్కడి నుండి కదలమని తేల్చి చెప్పారు. 20న, పార్లమెంట్ వరకు జరిగే యాత్రలో తమతో చేరాలని, ఇది దేశాన్ని కాపాడే పోరాటమని, మనం వెనక్కి వెళ్లకూడదని రాంకా పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సాగుతున్న శాంతియుత నిరసనలపై ఢిల్లీ పోలీసు చర్యపై విపక్షాలు భగ్గుమన్నాయి. నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త ఆరోగ్యం క్షీణించడంపై ఆయనను అక్కడి నుంచి తరలించే క్రమంలో సోనమ్ వాంగ్‌చుక్‌పై పోలీసులు దురుసుగా ప్రవర్తించాడన్ని కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన (యుబిటి), ఆప్ ఇతర ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ చర్య ప్రజాస్వామ్యానికి మాయమచ్చ అని అభివర్ణించాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వ మూల సూత్రాలు అసత్యం, హింస అని ఎక్స్ వేదికగా లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. పరీక్షా పత్రాల లీకేజీలు, పెరుగుతున్న విద్యా వ్యయం, విద్యార్థుల ఆత్మహత్యలు భారతదేశ భవిష్యత్తుకు సంబంధించిన కీలక సమస్యలని రాహుల్ పేర్కొన్నారు. బిజెపిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని, అత్యంత ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజాస్వామ్య విరుద్ధమైన రాజకీయ పార్టీ పాలించడం సిగ్గుచేటన్నారు. కోటా, డెహ్రాడూన్ నుండి 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గొంతుక) వినిపించడం మొదలైందని, అది కచ్చితంగా ఢిల్లీ గడప వరకు చేరుతుందని ఆయన అన్నారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా, శాంతియుత నిరసనలను కేంద్రం అణచివేస్తోందని ఆరోపిస్తూ, కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, కాక్రోజ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేలపై పోలీసుల చర్యను సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఖండించారు. ఆరోపిత పేపర్ లీక్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని బేబీ ఎక్స్‌లో తీవ్రంగా విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విమర్శించింది. బలప్రయోగానికి బదులుగా కేంద్రం ఆయనతో చర్చలు జరిపి ఉండాల్సిందని పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు ఆసుపత్రికి తరలించడాన్ని ఎన్‌సిపి (ఎస్‌పి) విమర్శించింది. ఈ చర్య ప్రజాస్వామ్య అసమ్మతిని అణచివేయడమేనని, ఇది ప్రభుత్వ నిరంకుశ మనస్తత్వాన్ని చూపిస్తోందని పేర్కొంది. సోనమ్ డిమాండ్లను సరిగా పరిగణనలోకి తీసుకోకుండా ఆసుపత్రికి తరలించడం 'తీవ్ర ఆందోళనకరం' అని అన్నారు. ప్రభుత్వానికి పౌరుల ప్రాణాలపై విలువ లేదని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న యువతతో చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరారు.

# కామన్వెల్త్ క్రీడలకు 126 మంది

### భారత పతాకధారులుగా లొవ్లీనా, మీరాబాయి..!

ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడలకు మరో ఐదు రోజుల్లో తెరలేవనుంది. గ్లాస్గో వేదికగా జరుగనున్న ఈ విశ్వక్రీడలల్లో భారత బృందాన్ని ఒలింపిక్ విజేతలు మీరాబాయి చాను, లొవ్లీనా బొర్గొహైన్‌లు నడిపించనున్నారు. జూలై 23, గురువారం మొదలయ్యే ఆరంభ వేడుకలో మీరా బాయి, లొవ్లీనాలు 126 మందితో కూడిన భారత బృందానికి నాయకత్వం వహించను న్నారు. అంటే.. వీరు పతకధారులుగా వ్యవహ రించనున్నారు. భారత ఒలింపిక్ సంఘం ఈ విషయాన్ని శనివారం అధికారికంగా వెల్లడిం చింది. కామన్వెల్త్ క్రీడలకు భారత బృందం సిద్ధ మవుతోంది. స్కాట్లాండ్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి 126 మంది ఎంపికవ్వగా.. ఈ బృందానికి ఒలింపిక్ విజేతలు మీరా



బాయి చాను, లొవ్లీనా బొర్గొహైన్‌లు సారథ్యం వహించనున్నారు. జూలై 23, గురువారం జరిగే ఆరంభ వేడుకల్లో.. వీరిలో ఒకరు మువ్వన్నెల జెండాను చేతబూని.. మరొకరు కామన్వెల్త్ క్రీడా జ్యోతిని పట్టుకొని సగర్వంగా నడుస్తారని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష పే ర్కొంది. 'గ్లాస్గోలోని ఓవో హైడ్రో స్టోర్స్ అరీనాలో జరుగనున్న ఆరంభ వేడుకల్లో మీరాబాయి, లొవ్లీనాలు భారత ప్రతినిధులుగా వ్యవహరించనుండడం ఎంతో గర్వపడాల్సిన విషయం. వీరితో పాటు భారత బృందానికి ఆల్ ది బెస్ట్' అని ఉష వెల్లడిం చింది. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన మీరాబాయి.. ఈసారి కామన్వెల్త్ క్రీడల్లో మహి ళల 48 కిలోల విభాగంలో పోటీపడనుంది. టోక్యో విశ్వక్రీడల్లోనే కంచు మోత మోగించిన లొవ్లీనా.. గ్లాస్గోలో మాత్రం 75 కిలోల విభా గంలో తలపడనుంది. గ్లాస్గోలో మొత్తంగా.. బాస్కెట్ బాల్(3స3) వీల్ ఛెయిర్ విభాగంలో.. నలుగురు, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో ఎనిమిది మంది పాల్గొననున్నారు. అథ్లెటిక్స్ విషయాని కొస్తే.. ట్రాక్ ఈవెంట్లలో 14 మంది. ఫీల్ విభా గంలో.. 18 మంది బరిలో ఉన్నారు. పారా అథ్లె ట్లలో.. ట్రాక్ అండ ఫీల్డ్ 11 మంది పోటీ పడు తున్నారు.

**లాన్ బౌల్స్** – ఆరుగురు
**బాక్సింగ్** – 14 మంది
**జూడో** – 14 మంది
**పారా పవర్‌లిఫ్టింగ్** – ఏడుగురు
**స్విమ్మింగ్** – ఐదుగురు
**పారా స్విమ్మింగ్** – ఐదుగురు
**ట్రాక్ సైక్లింగ్** – ఆరుగరు
**పారా ట్రాక్ సైక్లింగ్** – లిషా దాస్ (మహిళల విభాగం)
**వెయిట్‌లిఫ్టింగ్** – 12 మంది.

## తొలి ఫైనల్‌కు సింధు



### రెండేళ్ల టైటిల్ కరువు తీరేనా !

ఒలింపిక్ విజేత పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణ ఫలించింది. వరసగా నిరాశ పరుస్తున్న తెలుగుతేజం జపాన్ ఓపెన్ ఫైనల్లో అడుగుపెట్టింది. లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టిలు తేలిపోయిన చోట భారత పతకం ఆశలు మోస్తున్న సింధు సెమీఫైనల్లో అదిరే విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. సెమీస్‌లో చెన్ యూఫీని చిత్తు చేసి ఈ మెగా టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్ చేరిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. అంతేకాదు ఈ మధ్య కాలంలో పరాజయాలతో విసిగిపోయిన భారత షట్లర్ 2024 తర్వాత తొలి ఫైనల్ ఆడబోతోంది. మహిళల సింగిల్స్‌లో ఒకప్పటిలా టైటిళ్లు గెలవలేకపోతున్న పీవీ సింధు ఎట్టకేలకు ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ రెండేళ్ల కాలంలో అయితే.. క్వార్టర్స్ లేదంటే తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సింధు జపాన్ ఓపెన్‌లో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. శనివారం జరిగిన సెమీస్‌లో చెన్ ఫీ(చైనా)పై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించింది. మొదటి సెట్‌ను 21–19తో గెలుచుకున్న సింధు.. రెండో సెట్‌లోనూ జోరు చూపించింది. 15–10తో భారత షట్లర్ ఆధిక్యంలో ఉండగా చెన్ కండరాల గాయంతో ఇబ్బంది పడింది. తాను ఆట కొనసాగించలేకపోవడంతో తెలుగు తేజం ఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైంది సింధు. 'ఫైనల్‌కు చేరడం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో ప్రతి మ్యాచ్‌ను చాలా ముఖ్యమైనదిగా భావించాడు. ఈరోజు మ్యాచ్ మరింత కీలకం కాబట్టి.. మొదటి నుంచి ఫోకస్‌గా ఆడాను. ఎందుకంటే.. టాప్ ర్యాంకర్లను ఓడించాలంటే ప్రతి పాయింట్ చాలా ముఖ్యం' అని ఆమె పేర్కొంది. రెండో సెమీఫైనల్ ఆడనున్న అకనే యమగుచి(జపాన్), పుత్రి కుసుమ వర్దానీ(ఇండోనేషియా)లలో ఒకరిని ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో సింధు ఢీకొట్టనుంది.

## హసికాకు రజతం

భారత యువ రెజ్లర్ హసికా లాంబా బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్‌లో రజతంతో మెరిసింది. 19 ఏండ్ల ఈ హర్యానా అమ్మాయి.. శుక్రవారం జరిగిన మహిళల 55 కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్లోతడబడి స్వర్ణాన్ని కోల్పోయింది. ఫైనల్‌లో ఆమె.. 05తో ఉక్రెయిన్‌కు చెందిన నటాలియా క్లివ్చుస్క చేతిలో ఓడి రెండోస్థానంలో నిలిచింది. అంతకుముందు సెమీస్‌లో హసికా.. 107తో అనస్టేసియా బ్లావెస్ (జర్మనీ)పై గెలిచి పతక పోరుకు అర్హత సాధించింది.







### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 77,569.39 పాయింట్లు. ముగింపు 78,151.54 పాయింట్లు. లాభం 582.15 పాయింట్లు.
**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,206.90 పాయింట్లు. ముగింపు 24,334.30 పాయింట్లు. లాభం 127.40 పాయింట్లు.

## కొనుగోళ్లకు ఊతం!

ఈ వారం భారతీయ స్టాక్ మార్కెట్ సానుకూల ధోరణితో ముగిసింది. వారాంతంలో కొనుగోలు ఆసక్తి పెరగడం, ఐటి, బ్యాంకింగ్ రంగాల్లో బలమైన కొనుగోళ్లు నమోదవడం, ప్రముఖ కంపెనీల త్రైమాసిక ఫలితాలపై పెట్టుబడిదారుల్లో ఆశావహ భావన నెలకొనడం మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా ఐటి కంపెనీలు ప్రకటించిన మెరుగైన ఆర్థిక ఫలితాలు, ఆర్థిక రంగ షేర్లలో కనిపించిన కొనుగోళ్లతో సూచీలు వారాంతంలో ఉత్సాహాన్ని ప్రదర్శించాయి. అదే సమయంలో విదేశీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల కదలికల కారణంగా పెట్టుబడిదారులు పూర్తిగా దూకుడుగా వ్యవహరించకుండా అప్రమత్తతను కూడా కొనసాగించారు. ఈనెల 20 నుంచి 24 వరకు కొనసాగే వచ్చే వారంలో మార్కెట్ దిశను ప్రధానంగా



త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రభావితం చేసే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రిలయన్స్ వంటి భారీ కంపెనీల ఫలితాలు మార్కెట్‌కు కీలక సంకేతాలుగా మారనున్నాయి. ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేదా అంతకంటే మెరుగ్గా వస్తే కొనుగోళ్లకు మరింత ఊతం లభించే అవకాశం ఉంది. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ మార్కెట్ల ధోరణి, అమెరికా వడ్డీ రేట్లపై అంచనాలు, ముడి చమురు ధరల కదలికలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయి. మొత్తంగా చూస్తే సమీప కాలంలో మార్కెట్ సానుకూల పక్షపాతంతోనే కొనసాగినా, మధ్య మధ్యలో లాభాల స్వీకరణ కారణంగా స్వల్ప హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ

భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) దేశంలో తొలిసారిగా రూ. 10, రూ. 20 విలువ కలిగిన పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న కాగితపు నోట్లకు ప్రత్యామ్నాయంగా ఈ నోట్లను పైలట్ ప్రాజెక్టు రూపంలో ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో విడుదల చేయనున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, భవిష్యత్తులో ఇతర విలువల నోట్లకూ విస్తరించే అవకాశాన్ని పరిశీలిస్తారు. పాలిమర్ నోట్లు ప్రత్యేకమైన ప్లాస్టిక్ పదార్థంతో తయారవుతాయి. ఇవి సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. నీరు, తేమ, దుమ్ము, మురికి వంటి ప్రభావాలు వాటిపై తక్కువగా ఉంటాయి. ఫలితంగా, నోట్లు త్వరగా చిరిగిపోవడం లేదా పాడవడం తగ్గుతుంది. అలాగే ప్రత్యేక భద్రతా లక్షణాలు ఉండటంతో నకిలీ నోట్ల తయారీని అరికట్టడంలో కూడా ఇవి ఉపయోగపడతాయని ఆర్‌బిఐ భావిస్తోంది. మన దేశంలో కరెన్సీ నోట్ల ముద్రణ, వాటి నిర్వహణపై ప్రతి ఏడాది భారీ వ్యయం అవుతోంది. పాలిమర్ నోట్లు



ఎక్కువ కాలం చలామణిలో ఉండటం వల్ల కొత్త నోట్ల ముద్రణ అవసరం తగ్గి, దీర్ఘకాలంలో ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్, సింగపూర్ సహా అనేక దేశాలు పాలిమర్ కరెన్సీని విజయవంతంగా ఉపయోగిస్తున్నాయి. భారతదేశంలో కూడా ఈ ప్రయోగం విజయవంతమైతే, కరెన్సీ వ్యవస్థ మరింత మన్నికైనది, సురక్షితమైనది మరియు సమర్థవంతమైనదిగా మారే అవకాశాలు ఉన్నాయి.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
**24 క్యారెట్లు:** రూ. 1,43,280
**22 క్యారెట్లు:** రూ. 1,31,340
**18 క్యారెట్లు:** రూ. 1,06,900.
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

## పెరుగుతున్న ముడి చమురు ధరలు



అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు నిరంతరంగా పెరుగుతున్నాయి. అమెరికా సైన్యం ఇరాన్‌కు చెందిన వ్యూహాత్మక లక్ష్యాలపై దాడులు కొనసాగిస్తుండగా, హోర్ముజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో భద్రతా ఆందోళనలు పెరిగాయి. ఈ పరిస్థితుల కారణంగా ఆ ప్రాంతంలో వాణిజ్య నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. హోర్ముజ్ జలసంధి ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలక మార్గం. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గంలో రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు ఐదో వంతు ఈ మార్గం ద్వారానే వెళ్తుంది. ఇక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో చమురు సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందన్న భయంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరుగుతున్నాయి. చమురు ధరల పెరుగుదల ప్రభావం భారత్ వంటి దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాలపై కూడా పడే అవకాశం ఉంది. ముడి చమురు ఖరీదు పెరిగితే పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలపై ఒత్తిడి పెరగవచ్చు. అలాగే రవాణా వ్యయం పెరగడం వల్ల ద్రవ్యోల్బణం కూడా అధికమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లు అమెరికా–ఇరాన్ పరిణామాలను అత్యంత నిశితంగా గమనిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు మరింత తీవ్రమైతే చమురు ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, దౌత్యపరమైన చర్చలు ప్రారంభమై ఉద్రిక్తతలు తగ్గితే మార్కెట్లలో స్థిరత్వం తిరిగి నెలకొనే అవకాశముంది.

## మోదీ పాలనలో కుప్పకూలుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ




### 2040 వరకు దేశం అభివృద్ధి చెందకపోతే ఇక అన్ని రంగాల్లో అంధకారమే

### ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు డాక్టర్ పరకాల ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాని మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, తలసరి ఆదాయంలో ఆఫ్రికా దేశాలకంటే వెనుకబడి ఉన్నామని, దీనితోపాటు నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల భారీ పెరుగుదల వలన సామాన్యుల నడ్డివిరుగుతుందని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెండ్ 2040 సంవత్సరం వరకు దేశం అభివృద్ధి చెందకపోతే, ఇక ఎప్పటికీ అభివృద్ధి చెందే అవకాశమే లేదన్నారు. 57వ బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిటిబిఇఎఫ్) ఆధ్వర్యంలో



'భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్లుప్రాధాన్యత' అనే అంశంపై రాష్ట్ర సదస్సు హైదరాబాద్ గన్ ఫౌండ్రిలోని పర్వాన హాల్‌లో శనివారం జరిగింది. సదస్సుకు ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు బి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. తొలుత ఎఐబిఇఎ జాతీయ అధ్యక్షుడు బి.ఎస్.రాంబాబు స్వాగతం పలుకగా డాక్టర్ పరకాల ప్రభాకర్ ప్రసంగించారు. బ్యాంకిం గ్ రంగ ఉద్యోగులు సహా అన్ని రంగాల కార్మికులు పరస్పర సంఘీభావంతో పనిచేస్తేనే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు లు, సామాజిక భద్రత, ట్రేడ్ యూనియన్ రక్షణ వంటి హక్కు లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకుల జాతీయ కరణ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు కార్మిక సంఘాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎపిటిబిఇఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్ భాస్కర్, సమద్ ఖాన్,జె. జానకిరామ్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్




**ప్రజాపక్షం / కౌటాల/ కాగజ్ నగర్ :** ప్రజలకు, రైతాంగానికి పూర్తిస్థాయిలో ఆమోదయోగ్యమైన తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ డిమాండ్ చేశా రు. శనివారం సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీ, జలసాధన సమితి తదితర వామపక్షాల ముఖ్య నాయకుల బృందం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి అత్యంత తక్కువ ఖర్చుతో సాగునీరు అందించాలనే గొప్ప లక్ష్యంతో ఈ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత బిఆర్ఎస్) అధినేత కెసిఆర్ సైతం తానే స్వయంగా ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని అయినా ప్రాజెక్టును పూర్తి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ సెంటిమెంట్ తో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్నప్పటికీ, ఆహామీని పక్కనబెట్టి ఈ ప్రాజెక్టును ఎందుకు నిలిపివేశారో ప్రజలకు సమాధానం చెప్పలేకపోయారని మండిపడ్డారు. కేవలం వ్యయం, ఖర్చులు పెంచుకోవడం కోసం రీడిజైనింగ్ పేరుతో కొత్త తరహాలో ప్రాజెక్టును వేగతరం చేసి మూడేళ్లలో నిర్మించారని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం ఎంత వేగంగా పూర్తి చేశారో, అంతే వేగంగా నష్టం జరిగిందని, ప్రజాధనం పూర్తిగా దుర్వినియోగం అయిందని ఆరోపించారు. దీనివల్ల ఇప్పుడు రైతాంగానికి నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కట్టిన ప్రాజెక్టు కూడా భారీ ఖర్చుతో కూడుకున్నదని, ప్రతి ఏటా దానికోసం ప్రభుత్వం అప్పులు తెచ్చి ఖర్చులు పెట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు అనేది పూర్తిగా గ్రావిటీ లైన్ అని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి బాధ్యత ఉందని స్పష్టం చేశారు. స్వతంత్రం వచ్చిన అనంతరం ఎక్కువ సార్లు పరిపాలించిన బాధ్యత ఆపార్టీకి ఉందని, తెలంగాణకు గుండెకాయ లాంటి ఈ ప్రాజెక్టు ద్వారా తక్కువ ఖర్చుతో రైతాంగానికి సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా గత ప్రభుత్వం అక్కడ నిర్మాణం చేపడితే, ఇప్పుడున్న ప్రజా ప్రభుత్వం దానికి పట్టిన ఇబ్బందులను, లోపాలను రిపేర్ చేయడానికి కూడా సాహసం చేయడం లేదని విమర్శించారు. యుద్ధప్రాతిపదికన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి రైతాంగాన్ని ఆదుకుంటే ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న చెడ్డ పేరు పోయే అవకాశం ఉంటుందని హితవు పలికారు. లేనిపక్షంలో ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించి గత ప్రభుత్వం ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొని ఓడిపోయిందో, ఇప్పుడు కూడా అదే స్థితి పునరావృతమవుతుందని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు లేకపోయి నా నీటి లభ్యత ఉందని, తక్కువ వ్యయంతో ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే ఈ ప్రాజెక్టుపై ప్ర భుత్వం తక్షణమే స్పందించి వేగంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీల న కార్యక్రమంలో సిపిఐ జి ల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, మేకల దాసు, చిరంజీవి, సిపిఎం నాయకులు గోమాస ప్రకాష్, కోట శ్రీనివాస్, ఆనం ద్ కుమార్, న్యూ డెమోక్రసీ ప్రతినిధులు టి శ్రీనివాస్, లాల్ కుమార్, చాంద్ పాషా, శ్రీనివాస్, అందే మంగ, జలసాధన సమితి నాయకులు నైనాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

### ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారే శివశంకర్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ వెంటనే రాజీనామా చేయాలని ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండు చేశారు. శనివారం చారగొండ మండల కేంద్రంలోని హమాలీ కార్మికుల, సిరసనగండ్ల గ్రామంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పాల్గొని భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ కార్మికులకు పొట్టగొడుతున్నారని కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, కర్షకులకు అసంఘటిత రంగ కార్మికులకు చాలా రకాలుగా బెనిఫిట్స్‌ను రద్దు చేసే విధంగా ఉన్నాయన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చడం కోసం ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి తప్ప కార్మిక వర్గానికి ఎలాంటి ఉపయోగం లేదన్నారు. 1886 మే 1న ఆవిర్భవించిన ఎఐటియుసి కార్మిక సంఘం దేశంలోని మొట్ట మొదటి కార్మిక సంఘంగా అవతరించి భారతదేశంలో అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి 44 చట్టాలను సాధిస్తే ఇప్పుడు ఉన్న కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇంతవరకు పర్మినెంట్ చేయాలేదన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సామాజిక వేత్త సోనం వాంగ్ చుక్ నేటికీ 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నప్పటికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాజీనామా చేయకుండా నీట్ విద్యార్థుల జీవితాలలో చెలగాటమాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఎన్‌డిఎ బిజెపి కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు కార్పొరేట్ విద్యను, కార్మికులు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.
తాడూరు మండల కేంద్రంలో ఈనెల 26న జరిగే నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహసభలను విజయవంతం చేయాలని పిలుపున్చిరు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ శ్రీనివాసులు, ఎఐటియుసి చారగొండ మండల కా ర్యదర్శి మొగిల్లా శ్రీనివాసులు, సిరసనగండ్ల గ్రామ భవన నిర్మాణ కార్మికులు కొండల్, నరేష్, ఏం. జంగయ్య, రమేష్, చారగొండ ఎఐటియుసి మండ ల కార్యదర్శి మొగిలి శ్రీనివాసులు, చారగొండ గ్రా మ హమాలీ కార్మికులు గోరేటి రాములు , కీసరి వెంకటయ్య, బి.రామకృష్ణ, ఎరుకల సైదులు, గోరటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కెయుని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలి

### కెయు విద్యార్థి ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

### కెయు విద్యార్థి ఉద్యమకారుల జెఎసి డిమాండ్




**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** స్వరాష్ట్ర సాధన కోసం మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన కాకతీయ యూనివర్సిటీ (కెయు) విద్యార్థి ఉద్యమకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల జెఎసి డిమాండ్ చేసింది. శనివారం విలేఖరుల సమావేశంలో జెఎసి నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు (కెకె) ఆధ్వర్యంలో ఏర్పాటైన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తక్షణమే కాకతీయ యూనివర్సిటీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరింది. అలాగే రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, సంస్థ ల్లో కెయు విద్యార్థి ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కల్పించాలని విజ్ఞప్తి చేసింది.గత 12 సంవత్సరాలుగా ముఖ్యంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపాయని జెఎసి ఆవేదన వ్యక్తం చేసింది. తెలంగాణ ఉద్యమంలో తమ విలువైన సమయాన్ని, విద్యను, భవిష్యత్తును త్యాగం చేసిన విద్యార్థి ఉద్యమకారుల సంక్షేమా న్ని రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలని పేర్కొంది. గత ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులకే అధిక ప్రాధాన్యత ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కెయుపై అదే నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని విమర్శించింది. గతంలో ప్రతిపక్ష నాయకుడిగా కాకతీయ యూనివర్సిటీని సందర్శించిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేసి, కెయు విద్యార్థి ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరింది. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి (ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు), డాక్టర్ ఫిరోజ్ పాషా, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ ఎస్. అనిల్, డాక్టర్ ప్రేమ్, డాక్టర్ కుమారయ్య (టిఆర్ఎస్‌వి), డా.మహాలీష్, కే.చిరంజీవి, డా.క్రాంతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# కల్తీల నిరోధానికి కఠిన చట్టం



- సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆహార, ఔషధాల కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు అన్ని కల్తీల బారిన పడుతుండడంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యాల బారిన పడుతున్నారని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (టిజిఎఫ్‌డిసిఎ)పై సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని శనివారం హైదరాబాద్ ఎంసిహెచ్ ఆర్‌డిలో నిర్వహించారు. కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని సిఎం అధికారులకు సూచించారు. వివిధ అధ్యయనాల ఆధారంగా ఒక సమగ్రమైన నివేదికను తయారు చేయాలన్నారు. దానిపై బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రమైన చర్చ చేపడతామని సిఎం తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలని సిఎం తెలిపారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచార సేకరణకు విజిల్ బ్లోయర్లను నియమించాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సిఎం తెలిపారు. ఎరువులు, పురుగు మందుల భారీ వాడకంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని సిఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలు రకాల ఉత్పత్తులు అమ్ముతున్నారని, అధిక ధరలకు ప్రజలు వాటిని కొంటున్నప్పటికీ అవి సేంద్రియ ఉత్పత్తులే అని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు.

**క్యూర్ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టు**

కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక్కడ నిబంధనలు అమలు చేసి వాటి అమలులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు కొనసాగాలని సిఎం సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, ఎస్. శ్రీధర్, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది

- ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్‌కు స్థలాల కేటాయింపు
- ఫిక్కీ లేడీస్ తరహాలో మహిళల కోసం మరో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు
- సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారతే తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాది అని, మహిళల ఆర్థిక, రాజకీయ పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్న ఇండస్ట్రియల్ పార్క్ తరహాలో మహిళల కోసం మరో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సిఎం చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలపడిన దేశాల్లో అభివృద్ధి, జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్ ఆర్‌డిలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌ఓ) ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో సిఎం పాల్గొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు 22 జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నామని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని తెలిపారు. శిక్షణ, మార్కెటింగ్, వ్యాపార కార్యకలాపాలకు కేంద్రాలుగా కార్పొరేట్ స్థాయిలో ఈ భవనాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హైటెక్ సిటీలో శిల్పారామం సమీపంలో సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూమిని ఇందిరా మహిళా శక్తి బజార్ కోసం కేటాయించినట్లు సిఎం వెల్లడించారు. గ్రామీణ హస్తకళలు, సాంప్రదాయ ఉత్పత్తుల విక్రయానికి మహిళా స్వయం సహాయక సంఘాల కోసం ఏర్పాటు చేసిన 150కిపైగా దుకాణాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ అభ్యర్థన మేరకు శిల్పారామం సమీపంలో ఫిక్కీ కార్యాలయ నిర్మాణానికి వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీలో ఫిక్కీకి ఒక ఎకరం భూమి కేటాయించి, రాష్ట్ర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ సంస్థ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించిన సిఎం, ప్రపంచ అగ్రగామి ఫార్చ్యూన్500 కంపెనీలను అక్కడకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సలహాదారు కె.రామకృష్ణారావు, ఎఫ్‌ఎల్‌ఓ జాతీయ అధ్యక్షురాలు పూజా గర్గ్, ఎఫ్‌ఎల్‌ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ సీతా రెడ్డి గడ్డం, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేలా విద్యుత్ ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం

- నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాయే లక్ష్యంగా కార్యాచరణ
- కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనలో గత ప్రభుత్వానిది ఘోర వైఫల్యం
- విద్యుత్తు శాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున, భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రాకుండా, ప్రజలకు నాణ్యమైన కరెంటును అందించేందుకు పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విద్యుత్ శాఖ సమీక్షా సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు. ప్రధానంగా ప్రజల తాగునీటి అవసరాలకు, రైతుల వ్యవసాయ సాగుకు ఎటువంటి ఆటంకం కలగకుండా అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ రంగానికి ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కొనేలా అధికారులు ముందుచూపుతో అడుగులు వేయాలని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రతి విద్యుత్ వినియోగదారుడికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. 108 తరహాలో ప్రారంభించిన 'పవర్ అంబులెన్స్' సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత 30 నెలలుగా చేపట్టిన పురోగతి కార్యక్రమాలు తీసుకొచ్చిన సంస్కరణలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకు డిప్యూటీ సిఎం స్పందిస్తూ డీటీఆర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఏఐ ఆధారిత సాంకేతికతను విద్యుత్ శాఖలో విస్తృతంగా అమలు చేయాలని, ఈ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఎనర్జీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు.

**అంగన్‌వాడీలకు సోలార్ వెలుగులు**

రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో అభివృద్ధి చేసిన మోడల్ సబ్‌స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకుని, టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లను దశలవారీగా ఆధునికరించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో భూమి కొరత దృష్ట్యా ఫ్లైఓవర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**రాష్ట్ర ఇంధన అవసరాలకు అనుగుణంగా సింగరేణి కొత్త బ్లాక్‌లను సాధించాలి**

తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సింగరేణి సంస్థ కొత్త బొగ్గు బ్లాక్లను సాధించి, తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల మైనింగ్ లీజు లభించిన తాడిచర్ల–2 బ్లాక్‌కు సంబంధించి నిర్ణీత కాల పరిమితిలో అన్ని అనుమతులు సాధించి, యుద్ధ ప్రాతిపదికన ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులను ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో అవసరమైన కొత్త బొగ్గు బ్లాక్‌లను సాధించేందుకు ప్రయత్నించకపోవడం వల్ల ప్రస్తుతం అదనపు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ ప్రభావం సింగరేణిపై పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ మరింత పెరుగుతున్నందున బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, డిస్పాచ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్, సింగరేణి, జెన్‌కో, డిస్కమ్‌ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాల కోసం ఏకతాటిపైకి దక్షిణాది రాష్ట్రాలు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల పరిరక్షణతో పాటు దేశంలో వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు దక్షిణాది రాష్ట్రాలు సంఘటితంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ శనివారం కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు లేఖలు రాస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సంయుక్తంగా కలిసి ఆయిల్ పామ్ పంటకు కనీస హామీ ధర కల్పించాలని విజ్ఞప్తి చేయాలని కోరారు. దేశంలో జాతీయ వంటనూనెల మిషన్–ఆయిల్ పామ్ (ఎన్ఎంఇఓఒపి)కింద 6.50 లక్షల హెక్టార్ల సాగు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 2.73 లక్షల హెక్టార్లలో సాగు విస్తరించిందని మంత్రి తెలిపారు. ఇందులో దక్షిణాది రాష్ట్రాల వాటా 2.05 లక్షల హెక్టార్లు, అంటే మొత్తం సాగులో 75 శాతం ఉందని పేర్కొన్నారు. దేశంలో వంటనూనెల స్వయం సమృద్ధి సాధనలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు.ఆయిల్ పామ్ పంట దిగుబడులు రావడానికి 3 నుంచి 4 ఏళ్లు పడుతుందని, రైతులు దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల (ఎఫ్ఎఫ్‌బి) ధరలు అంతర్జాతీయ క్రూడ్ పామ్ ఆయిల్ (సిపిఒ) ధరలు, దిగుమతి సుంకాలపై ఆధారపడటంతో రైతులు తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2018లో 44 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 2022 నాటికి పూర్తిగా తగ్గించడం, అనంతరం 2024లో 27.5 శాతానికి పెంచడం, 2025 మే 31 నుంచి మళ్లీ 16.5 శాతానికి తగ్గించడంతో దేశీయ మార్కెట్ ధరలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పరిస్థితుల్లో క్రూడ్‌పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని మళ్లీ 44 శాతానికి పునరుద్ధరించడం గాని, ఆయిల్ పామ్ గెలల మెట్రిక్ టన్నుకు కనీస హామీ ధర (ఎంజిపి)ను రూ.25 వేలుగా నిర్ణయిం చి, సాగు వ్యయం, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని కాలానుగుణంగా సవరించే విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దక్షిణాది రాష్ట్రాలు సంయుక్తంగా ప్రధానమంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తే ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలు పరిరక్షించబడటంతో పాటు దేశం లో వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్య సాధనకు మరింత ఊతమిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వాంగ్ చుక్ తరలింపు నిరంకుశ చర్య

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న ఉద్యమకారుడు సోనమ్ చుక్ శనివారం పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్ళటాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చేయడాన్ని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యత వహించాలని శాంతియుతంగా దీక్ష చేస్తున్నప్పటికీ స్పందించకుండా, బెదిరింపు ధోరణితో దీక్షను భగ్నం చేయటానికి ప్రయత్నించటం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని నిదర్శమని ఆయన పేర్కొన్నారు. పేపర్ లీకేజీ కారణంగా 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు లేవనెత్తే అంశాలపై స్పందించటం ప్రభుత్వాల కనీస బాధ్యత అని, పలువురు విద్యార్థులతో సహా సోనమ్ వాంగ్ 20 రోజులకు పైగా దీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించకపోవడం అహంకారానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. ఆయన ప్రాణాలను కాపాడడం చాలా అవసరమని, అదే సమయంలో కోర్టును అడ్డం పెట్టుకొని సమస్య పరిష్కరించకపోవడం నిరంకుశత్వమని అన్నారు. పోలీసులు ఆసుపత్రికి తరలించిన వాంగ్ చుక్ అనుమతి లేకుండా దీక్షను భగ్నం చేయవద్దని కూనంనేని డిమాండ్ చేశారు.

# వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధం

- ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'సూపర్ ఎల్ నినో' ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సంసిద్ధంగా ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో 'సింపోజియం' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వాతావరణ మార్పులపై సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రానికి అనుకూల వర్షపాతం నమోదై రిజర్వాయర్లు సమృద్ధిగా నిండడంతో సాగు, తాగునీటి అవసరాలు సాఫీగా నెరవేరాయని తెలిపారు. అయితే ప్రస్తుత వర్షాకాలంలో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవని చెప్పారు. ఈ నేపథ్యంలో 'సూపర్ ఎల్ నినో' ప్రభావాన్ని ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తోందని, ప్రజలు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. నీటిపారుదల, వ్యవసాయం, తాగునీరు, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నాయని, రిజర్వాయర్ల నిర్వహణలో రియల్‌టైమ్ డేటా, శాస్త్రీయ విధానాలను వినియోగిస్తున్నామని చెప్పారు. వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితుల నుంచి రైతులను రక్షించగలగడమే ప్రభుత్వాలకు అసలైన పరీక్ష అని మంత్రి పేర్కొన్నారు. పట్టణాల్లో పెరుగుతున్న కాంక్రీటీకరణ కారణంగా భూగర్భ జలాల పునరుద్ధరణ తగ్గిపోతుండటంతో వర్షపు నీటి సంరక్షణ అత్యవసరమైందన్నారు. హైదరాబాద్‌లో చెరువులు, నీటి వనరులు, సహజ కాలువల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి హైడ్రాతో గతంలో జరిగిన ఆక్రమణల వల్ల పెరిగిన వరద ముప్పును తగ్గించేందుకు చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, సహజ డ్రైనేజీ వ్యవస్థల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# నీట్- 2026 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థుల సత్తా

- రికార్డు స్థాయిలో ర్యాంకులు.. జాతీయ స్థాయిలో మరోసారి ఆధిపత్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ 2026 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో తొలి ర్యాంకుతో పాటు టాప్12లో 9 ర్యాంకులు సాధించి దేశవ్యాప్తంగా తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో ఆర్యన్ గుప్తా తొలి ర్యాంకు సాధించగా, గౌరవ్ సింగ్ 9వ ర్యాంకు, క్రిష్ గుప్తా 15వ ర్యాంకు, కార్తిక్ చౌదరి 16వ ర్యాంకు సాధించారు. అలాగే టాప్100లో 18 మంది, టాప్1000లో 49 మంది విద్యార్థులు నారాయణ విద్యాసంస్థలకు చెందినవారే కావడం విశేషం. ఆల్ ఇండియా కేటగిరీలో టాప్12లో 9 ర్యాంకులు, టాప్100లో 45 ర్యాంకులు, టాప్1000లో 163 ర్యాంకులు సాధించడం నారాయణ విద్యాసంస్థల శిక్షణా విధానానికి నిదర్శనమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులకు కాన్సెప్ట్ ఆధారిత బోధన, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, వ్యక్తిగత శ్రద్ధ, సాంకేతికత ఆధారిత శిక్షణ, నిరంతర పరీక్షల నిర్వహణ వంటి అంశాలే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. సిబిటి విధానంలో ప్రత్యేక శిక్షణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత విశ్లేషణ, వ్యక్తిగత పనితీరు అంచనా వంటి ఆధునిక విధానాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం అభినందించింది. భవిష్యత్తులోనూ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా మరింత నాణ్యమైన శిక్షణ అందిస్తామని వెల్లడించింది.

## టిపిసిసి సంస్థాగత కార్యక్రమాలు భేష్



- ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీని గ్రామ, బూత్ స్థాయిల వరకు మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి బిఎల్‌ఏకు సూపర్వైజర్‌ను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. టిపిసిసి అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ కార్యక్రమాల అమలు తీరు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఆమె ప్రశంసించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ, బిఎల్ఏ శిక్షణా కార్యక్రమాలు, జనహిత పాదయాత్ర తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అమలు చేస్తున్న సంస్థాగత విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అమలు తీరును అధ్యయనం చేసేందుకు 11 రాష్ట్రాల నుంచి ఎఐసిసి నాయకులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు తెలంగాణ టిపిసిసిని అభినందించినట్లు తెలిపారు. సోషల్ మీడియా, కనెక్టింగ్ సెంటర్, సంస్థాగత కార్యక్రమాలను మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కనెక్టింగ్ సెంటర్ చైర్మన్ సెంతిల్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు పి. ప్రసన్న కుమార్ శర్మ, కొప్పుల ప్రవీణ్ కుమార్, గంప వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూళ్లకు షోకాజ్ నోటీసులు!

- వార్షిక పాలనా నివేదికలు ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు
- పాఠశాల విద్య సంచాలకులు నవీన్ నికోలస్ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆడిట్ స్టేట్‌మెంట్‌లతో కూడిన వార్షిక పాలనా నివేదికను సమర్పించని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలపై విద్యా శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ప్రాంతీయ విద్యాధికారులు (ఆర్‌జెడిలు), జిల్లా విద్యాధికారులను (జెడిఈఓలను) పాఠశాల విద్య సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాల 2023–24, 2024–25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన పూర్తి స్థాయి వార్షిక నివేదికలను, ఆడిట్ స్టేట్‌మెంట్‌లను విధిగా సమర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ నివేదికలను సమర్పించని స్కూళ్లను గుర్తించి, వాటికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. రాబోయే 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు స్పష్టతనిచ్చేలా పాఠశాలలు కీలక చర్యలు చేపట్టాలని సంచాలకులు ఆదేశించారు. ప్రతి స్కూల్ తమ నోటీస్ బోర్డులో లేదా అధికారిక వెబ్‌సైట్‌లో తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ఫీజుల విషయంలో పారదర్శకత లోపిస్తే సహించేది లేదని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం రైతులకు మరణశాసనం

- రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



**ప్రజాపక్షం/యాదాద్రి :** అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం పేరుతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని, అమెరికా వ్యవసాయ, డైరీ ఉత్పత్తులకు సున్నా శాతం దిగుమతి సుంకం కల్పిస్తే దేశంలోని కోట్లాది చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధి తీవ్ర ప్రమాదంలో పడుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఒప్పందంపై సంతకం చేయడం రైతులకు 'మరణశాసనం'తో సమానమని ఆమె విమర్శించారు. యాదగిరిగుట్టలో జూలై 18 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం 'అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందం రైతులపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పశ్య పద్మ ప్రసంగించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తే దేశీయ మార్కెట్లో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వంటనూనెలు, యాపిల్స్, డైరీ ఉత్పత్తుల ధరలు భారీగా పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆమె పేర్కొన్నారు. అమెరికా రైతులకు భారీ సబ్సిడీలు లభిస్తుండగా, భారత రైతులకు తగిన మద్దతు లేకపోవడం వల్ల ఈ పోటీని తట్టుకోవడం అసాధ్యమని చెప్పారు. గ్రామీణ మహిళల ఆధారిత పాడి, పౌల్ట్రీ రంగాలు కూడా ఈ ఒప్పందంతో దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందమైనా పార్లమెంటులో చర్చించి, ప్రజాభిప్రాయం సేకరించిన తర్వాతే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ ఆహార భద్రత, రైతుల జీవనోపాధి, వ్యవసాయ స్వావలంబనకు భంగం కలిగించే నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విదేశీ ఒత్తిళ్లకు లొంగకుండా దేశ సార్వభౌమాధికారాన్ని, వ్యవసాయ ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు హేమంతరావు, కొప్పూజు సూర్యనారాయణ, దొండపాటి రమేష్, కొల్లూరి రాజయ్య, మెడికంటి వెంకటరెడ్డి, ప్రభులింగం, దొడ్డ వెంకటయ్య, నెట్టెం నారాయణ, కార్యదర్శులు కందపర్తి గోవిందరావు, వెంకటయ్య, దేవబత్తుని సంధ్య, బి.జి. నరేంద్ర ప్రసాద్, గీత కార్మిక సంఘం నాయకులు గోదా శ్రీరాములు, రైతు సంఘం మాజీ ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల నీట్ ర్యాంకర్లు, స్వర్ణ పతక విజేత సాయి ప్రవల్లికను అభినందించిన సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో (టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్) చదివి నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు, తొలి ఆసియా అండర్23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్2026లో మహిళల 4స400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించిన సాయి ప్రవల్లిక శనివారం హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీట్‌లో ప్రతిభ కనబర్చిన గురుకుల విద్యార్థులను, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన సాయి ప్రవల్లికను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. విద్య, క్రీడల్లో గురుకుల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొం టూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పోలీస్ నియామకాల్లో పారదర్శకతకు తెలంగాణ ఆదర్శం

పేపర్ లీకేజీకి తావులేకుండా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ కొనసాగింది: డిజిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోని పలు నియామక సంస్థల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో ఇప్పటివరకు ఒక్క పేపర్ లీకేజీ కూడా జరగలేదని, పోలీస్ నియామకాల పారదర్శకతలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అన్నారు. త్వరలో చేపట్టనున్న పోలీస్ నియామక ప్రక్రియను కూడా ఇదే స్థాయి నిష్పాక్షికత, విశ్వసనీయతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు, పోలీస్ ట్రైనింగ్, పోలీస్ కమ్యూనికేషన్స్, పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగాల పనితీరుపై శనివారం డిజిపి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులు ప్రజెంటేషన్లు ఇవ్వగా, నియామకాలు, శిక్షణ, సాంకేతిక ఆధునికీకరణపై విస్తృతంగా చర్చించారు. రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వివి శ్రీనివాసరావు ఇప్పటివరకు చేపట్టిన నియామకాల వివరాలను వెల్లడించారు. 2022 23లో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పోలీస్ నియామక ప్రక్రియ ద్వారా 16,654 పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు, 1,743 డ్రైవర్ ఆపరేటర్ పోస్టులు, ఫింగర్ ప్రింట్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. రిక్రూట్మెంట్ విధానంలో బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఆన్‌లైన్ దరఖాస్తులు, ఆర్ఎఫ్ఐడి, సాంకేతికత, మొబైల్‌ఈమెయిల్ ఆధారిత రిజిస్ట్రేషన్, నెగెటివ్ మార్కింగ్ వంటి సంస్కరణలు అమలు చేసినట్లు సమావేశంలో వివరించారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను సాంకేతికంగా మరింత బలోపేతం చేయాలని డిజిపి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నూతన కమ్యూనికేషన్ సెట్లను డిజిపి ఆవిష్కరించారు. సమావేశంలో రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వివి శ్రీనివాసరావు, డిజి సిఐడి చారు సిన్హా, ఐజిపి గజరావు భూపాల్, డిఐజి కిరణ్ కుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విచారణ ఖైదీ ఆత్మహత్య కేసులో వివరాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జనగామ జిల్లా జైలులో విచారణ ఖైదీ మల్లయ్య ఆత్మహత్య ఘటనపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ, జైళ్లశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. మల్లయ్య భార్య వరాల హిమ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి, మేజిస్ట్రేట్ నివేదికతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 28కు వాయిదా వేశారు. జైలులో అవమానకరమైన పనులు చేయించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకుని రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని పిటిషనర్ కోరారు.

## ఆటస్థల భూమిపై హక్కుల పిటిషన్ కొట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అమ్ముగూడలో ఫుట్‌బాల్ మైదానంగా వినియోగంలో ఉన్న ప్రభుత్వ భూమిపై హక్కులు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అల్వాల్‌కు చెందిన సర్దార్ శాంతాభాయి తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, భూమిపై పిటిషనర్లకు హక్కులు లేవని రికార్డులు స్పష్టం చేస్తున్నాయని పేర్కొంది. ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన భూమిపై పదేపదే దరఖాస్తులు, పిటిషన్లు వేసి కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు పిటిషనర్లపై రూ.50 వేల జరిమానా విధించి, ఆ మొత్తాన్ని హైకోర్టు అడ్వొకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెల్లించాలని ఆదేశించింది.

## బండి, ఈటల మధ్య కుదిరిన సయోధ్య

రంగంలోకి దిగిన అధిష్ఠానం - వివాదాలకు ముగింపు
ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇరువురి నేతలతో అభయ్ పాటిల్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతర్గత విభేదాలపై బిజెపి అధిష్ఠానం దృష్టి సారించింది. చాలా కాలంగా విభేదాలతో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ మధ్య పార్టీ పెద్దల చొరవతో సయోధ్య కుదిరింది. బిజెపి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో జరిగిన సమావేశంలో ఇద్దరు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్, ఈటల రాజేందర్‌లతో అభయ్ పాటిల్ విడివిడిగా, అనంతరం సంయుక్తంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వ్యక్తిగత భేదాభిప్రాయాలను పక్కనబెట్టి, తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని సూచించినట్లు సమాచారం. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో పనిచేయాలని నేతలకు స్పష్టం చేసినట్లు తెలిసింది. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, ఈటల రాజేందర్ తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు. డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ విధానాలతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్థిక సంక్షోభం కారణంగా దురదృష్టకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 50 వేల పంట కుంటల నిర్మాణం

- మహిళా సంఘాలకు మరో అవకాశం
- ఉపాధి హామీ పథకం ద్వారా పనులు..
- భూమి ఉన్న మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యం
- ఆగస్టు 15 నాటికి తొలి దశ కింద 25 వేల కుంటల పూర్తి
- పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'విబి–జి రాం జి' కింద జలసిరి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం ద్వారా 50 వేల పంట కుంటల నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో తొలి దశగా రాబోయే ఆగస్టు 15 నాటికి 25 వేల పంట కుంటలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా సొంతంగా భూమి కలిగిన మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇందుకోసం భూమి ఉన్న లక్షకు పైగా స్వయం సహాయక సంఘాల మహిళల వివరాలను ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలకు అందజేసింది. ఈ పథకంపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ వర్షపు నీటిని వృథా కాకుండా రైతు పొలంలోనే నిల్వ చేసి, అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేలా ఈ పంట కుంటలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 'ఇటువంటి పంట కుంటలు పంటలకు నీటి భరోసా కల్పించడమే కాకుండా.. భూగర్భ జలాలను పెంచడం, మట్టి కోతను నివారించడం, పంటల దిగుబడిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా, వీటి ద్వారా చేపల పెంపకం వంటి అదనపు ఆదాయ వనరులను కూడా సృష్టించుకోవచ్చు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇవి రైతులకు శాశ్వత రక్షణగా నిలుస్తాయి' అని మంత్రి సీతక్క అన్నారు.

### ఉపాధి హామీ ద్వారానే పూర్తి కూలీ వ్యయం

పంట కుంటల నిర్మాణానికి అవసరమైన కూలీ వ్యయాన్ని పూర్తిగా ఉపాధి హామీ పథకం ద్వారానే భరిస్తారని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కుంట పరిమాణాన్ని బట్టి ఒక్కో పంట కుంట నిర్మాణానికి సాధారణంగా రూ. 80 వేల నుంచి రూ. 2 లక్షల వరకు వ్యయం అవుతుందని తెలిపారు. ఒక్కో పంట కుంట నిర్మాణానికి కనీసం 400 పనిదినాలు పడుతుందని, ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వందల కోట్ల రూపాయల విలువైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

### మహిళల భాగస్వామ్యంతోనే నిజమైన సాధికారత

'మహిళలను కేవలం పొదుపు సంఘాలకే పరిమితం చేయకుండా, భూమి ఉన్న ప్రతి మహిళా సంఘ సభ్యురాలు వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకుంటూ, కుటుంబ ఆదాయాన్ని బలోపేతం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మహిళల సాధికారత అంటే కేవలం సంక్షేమ పథకాల అమలు మాత్రమే కాదు, ఉత్పత్తి, ఉపాధి, ఆదాయ సృష్టిలో వారిని భాగస్వాములను చేయడమే నిజమైన సాధికారత' అని మంత్రి సీతక్క అన్నారు. అర్హులైన మహిళా సంఘ సభ్యులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

### బిఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు

## నెరవేరని హామీలతో దెబ్బతిన్న యువత జీవితాలు

బిఆర్ఎస్ 'యువ సంగ్రామ'లో కెటిఆర్ విమర్శలపై కాంగ్రెస్ నేతల ఫైర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ నిర్వహించిన 'యువ సంగ్రామ' సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దులు, నెరవేరని హామీలతో యువత జీవితాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్ల బిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ యువతను మోసం చేసిన నాయకులు ఇప్పుడు వారి గురించి మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. హైదరాబాద్‌లో శనివారం వారు వర్వేరుగా మీడియాతో మాట్లాడారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో టిజిపిఎస్‌సి విశ్వసనీయత దెబ్బతిన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని ప్రక్షాళన చేసి గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4, మెగా డిఎస్‌సి, పోలీస్, ఆరోగ్య, గురుకుల తదితర శాఖల్లో భారీగా ఉద్యోగ నియామకాలు చేపట్టిందని తెలిపారు. 'బిఆర్ఎస్‌ది పేపర్ లీకుల పాలన. కాంగ్రెస్‌ది కొలువుల జాతర' అని కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కాదు, నియామక పత్రాలు అందిస్తోందని, యువతకు ఉద్యోగ భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కెటిఆర్ నిర్వహించిన సభలో నిజమైన నిరుద్యోగులు, విద్యార్థులు కాకుండా పార్టీ కార్యకర్తలు, పెయిడ్ ఆర్టిస్టులే పాల్గొన్నారని ఆరోపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సభ నిర్వహించే ధైర్యం బిఆర్ఎస్‌కు లేదన్నారు. నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం, పరీక్షా పత్రాల లీకేజీలు, నిరుద్యోగుల పై కేసులు పెట్టడం బిఆర్ఎస్ పాలనలో జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 67,763 మందికి నియామక పత్రాలు అందించగా, మరో 13,197 పోస్టుల భర్తీ చివరి దశలో ఉందని, 30 వేలకుపైగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు బిఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం వంటి హామీలను అమ లు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన 30 నెలల్లో లక్షకుపైగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు.

## నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదు

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదేళ్లలో బిఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాల కంటే ఎక్కువగా తాము రెండేళ్లలో ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చామని, ఈ విషయంపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మాజీ సిఎం కెసిఆర్ 'ఇంటికో ఉద్యోగం' ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇప్పుడు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలు కొద్దిమందికే పరిమితమయ్యాయని, ప్రజలు ఆ దుష్టపాలనను మరచిపోలేదని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ యువ సంగ్రామ సభలో బిఆర్ఎస్ నేత కెటిఆర్ చేసిన విమర్శలపై గాంధీభవన్‌లో శనివారం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల పరిపాలనలో ఒక్క గ్రూప్1 నియామకాన్ని కూడా పూర్తి చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగాల భర్తీపై మాట్లాడటం విడ్డూరమని ఆయన విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. కులగణనపై కేంద్ర ప్రభుత్వం వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని బిఆర్ఎస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేసిందని తెలిపారు. కెసిఆర్ పాలనలో ప్రశ్నాపత్రాల లీకేజీలు జరిగాయని, ఇప్పుడు కేంద్రంలో కూడా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని, అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పాలనలో నీళ్లు, నిధులు, ప్రాజెక్టుల పేరుతో భారీ దోపిడీ జరిగిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో చెప్పిన 'మా నీళ్లు, మా ఉద్యోగాలు' నినాదాన్ని అధికారంలోకి వచ్చిన తర్వాత బిఆర్ఎస్ విస్మరించిందన్నారు. ఇదిలా ఉండగా, తుంగతుర్తి, ఎల్బీనగర్ నియోజకవర్గాలకు సంబంధించిన పార్టీ నేతల వివాదాలపై నివేదిక అందిందని, ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు.

## ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్‌కు భారీ ఊరట

- ఫీజుల నుంచి 100 శాతం మినహాయింపు
- ఇడబ్ల్యుఎస్, ఎల్ఐజి గృహాలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- త్వరిత అనుమతుల కోసం సింగిల్ విండో కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ హౌసింగ్ బోర్డు (టిజిహెచ్‌బి) ఆధ్వర్యంలో అమలవుతున్న ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ (అఫోర్డబుల్ అర్బన్ హౌసింగ్) పథకంలోని ఆర్థికంగా బలహీన వర్గాలు (ఇడబ్ల్యుఎస్), అల్పాదాయ వర్గాల (ఎల్ఐజి) గృహాలకు ప్రణాళిక, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన అన్ని రకాల రుసుములను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మినహాయించింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం భవన నిర్మాణ అనుమతి ఫీజు, స్క్రూటినీ, ప్రాసెసింగ్ ఫీజులు, డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలు, లేఅవుట్ ఆమోదం, సబ్‌డివిజన్ రుసుములు, భూ వినియోగ మార్పిడి ఛార్జీలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఫీజు, నగర మౌలిక సదుపాయాల ప్రభావ రుసుము, అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసి ఫీజులు, వర్షపు నీటి సంరక్షణ ఛార్జీలు, సమగ్ర రహదారి నిర్వహణ కార్యక్రమం (సిఆర్ఎంపి) కింద రోడ్డు ఛార్జీలు సహా పట్టణ స్థానిక సంస్థలు, మెట్రోపాలిటన్, ఇతర ప్రణాళికా సంస్థలు విధించే అన్ని రకాల ప్లానింగ్, బిల్డింగ్ పర్మిషన్ ఫీజులకు వంద శాతం మినహాయింపు వర్తించనుంది. అఫోర్డబుల్ అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులకు గడువులోగా అనుమతులు మంజూరు చేసేందుకు టిజిహెచ్‌బి అఫోర్డబుల్ అర్బన్ హౌసింగ్ సింగిల్ విండో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన పనిచేసే ఈ కమిటీలో హౌసింగ్ శాఖ, తెలంగాణ హౌసింగ్ బోర్డు, జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, అగ్నిమాపక శాఖ, నీటి సరఫరా సంస్థలు, విద్యుత్ పంపిణి సంస్థలు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, టిజి రేరా తదితర శాఖల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ప్రాజెక్టు ఉన్న ప్రాంతాన్ని బట్టి జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రణాళికా సంస్థల అధికారులు కూడా ఇందులో భాగస్వాములు కానున్నారు. ఈ కమిటీ బిల్డ్‌నౌ వేదిక ద్వారా ఒకే దరఖాస్తును స్వీకరించి భవన, లేఅవుట్ అనుమతులు, అవసరమైన ఎన్‌ఓసిలను నిర్ణీత గడువులో జారీ చేస్తుంది. లోపాలుంటే ఒకే సమగ్ర నోటీసు ద్వారా తెలియజేస్తుంది. చట్టపరంగా వీలున్న చోట డీమ్డ్ అప్రూవల్స్ ఇవ్వడంతో పాటు మినహాయింపు వర్తించే రుసుములను నిర్ణయిస్తుంది. నీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్, రహదారులు, అగ్నిమాపక భద్రత వంటి బాహ్య మౌలిక సదుపాయాల కల్పన కోసం సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తుంది. ఇప్పటికే డబుల్‌బెడ్‌రూమ్ గృహ పథకానికి అమలులో ఉన్న ప్రత్యేక నిబంధనలు, విధానపరమైన సడలింపులను కూడా ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ పథకానికి వర్తింపజేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే నిర్మాణ భద్రత, అగ్నిమాపక, పర్యావరణ, విమానయాన అనుమతులు తదితర చట్టబద్ధ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అలాగే పన్నులు, సెస్సు, యుటిలిటీ సేవల ఛార్జీలు యథావిధిగా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ పథకం ప్రతిపాదనల కోసం బిల్డ్‌నౌ పోర్టల్‌లో ప్రత్యేక ప్రాజెక్టు విభాగాన్ని ఏర్పాటు చేయాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌ను ప్రభు త్వం ఆదేశించింది. ఈ రాయితీలు తెలంగాణ హౌసింగ్ బోర్డు అమలు చేస్తున్న పథకంలోని ఇడబ్ల్యుఎస్, ఎల్ఐజి గృహాలకు మాత్రమే వర్తిస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## ట్రాన్స్‌జెండర్లకు రాజకీయ సాధికారతకు శ్రీకారం

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ట్రాన్స్‌జెండర్ సమాజాన్ని సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా పాలనలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. స్థానిక సంస్థల్లో కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించడం ద్వారా ట్రాన్స్‌జెండర్ సమాజానికి రాజకీయ సాధికారత కూడా లభిస్తుందని, ఈ నిర్ణయం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో ట్రాన్స్‌జెండర్లకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు.శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణకు చెందిన ట్రాన్స్ ఉమెన్, ట్రాన్స్ మెన్ హక్కుల ఉద్యమకారులు, ట్రాన్స్ హిజ్రా సంస్కృతి గురువులు, వివిధ ట్రాన్స్‌జెండర్ సంఘాల ప్రతినిధులు సహా సుమారు 25 మంది ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులు మంత్రిని కలిసి రాష్ట్ర కేబినెట్ నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించడం ద్వారా గ్రామాలు, మండలాలు, పట్టణాల అభివృద్ధిలో ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులు ప్రత్యక్షంగా భాగస్వాములు అయ్యే అవకాశం లభిస్తుందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవం, గుర్తింపు, నాయకత్వ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రైవింగ్, వంట, డ్రోన్ నిర్వహణ వంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడంతో పాటు, మెట్రో స్టేషన్లలో ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలో కూడా ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సేవలను వినియోగిస్తూ గౌరవప్రదమైన జీవనోపాధి కల్పిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులు మాట్లాడుతూ, తమకు రాజకీయంగా గౌరవప్రదమైన స్థానం కల్పించే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తమ సంక్షేమం కోసం కృషి చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, సమాజాభివృద్ధిలో మరింత బాధ్యతతో భాగస్వాములు అవుతామని పేర్కొన్నారు.

## ఒకే రోజు 840 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

రూ.30 వేల కోట్ల విలువైన భూములకు ఫెన్సింగ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరం నలువైపులా హైడ్రా శనివారం భారీ స్థాయిలో భూ పరిరక్షణ చర్యలు చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మొత్తం 840 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి రక్షించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ భూముల మార్కెట్ విలువ సుమారు రూ.30 వేల కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, భారీ పోలీసు బందోబస్తుతో కలిసి హైడ్రా ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించింది. తప్పుడు పత్రాలు, సర్వే నెంబర్లతో ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేస్తూ హైడ్రా చర్యలు చేపట్టింది. ఇందులో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలోని సర్వే నెంబర్లు 25, 26లో ఉన్న 650 ఎకరాలు, శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నెంబర్ 46లో 84 ఎకరాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో జివిఎల్ఆర్ నెంబర్లు 243, 255లో ఉన్న 106 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

### రాయదుర్గంలో కబ్జాలకు చెక్

రాయదుర్గంలోని మల్కం చెరువు ఎదురుగా ఉన్న కొండలు, గుట్టలు, పచ్చని చెట్లతో కూడిన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. టి హబ్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో ప్రైవేటు పట్టా భూమి కొనుగోలు చేసిన కొందరు, దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలోకి చొరబడి సుమారు ఎకరం మేర ఆక్రమించినట్లు తేలింది. ఎకరానికి సుమారు రూ.200 కోట్ల విలువ ఉన్న ఈ భూమిపై భవిష్యత్‌లో ఆక్రమణలు జరగకుండా హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

### కంటోన్మెంట్‌లో 106 ఎకరాల పరిరక్షణ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని 106 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇతర సర్వే నెంబర్ల పేరుతో ఆక్రమించి లేఔట్‌లు రూపొందించినట్లు అధికారులు గుర్తించారు. సహజసిద్ధమైన కొండలను పేల్చడం, పచ్చదనాన్ని ధ్వంసం చేయడం వల్ల వన్యప్రాణుల మనుగడకు ముప్పు ఏర్పడిందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రీ కాస్ట్ గోడలను తొలగించి మొత్తం భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చే శారు. హైడ్రా చర్యలను స్వాగతించిన స్థానికులు ర్యాలీలు నిర్వహించి సంబరాలు జరిపారు.



### శంషాబాద్‌లో 650 ఎకరాలకు రక్షణ

శంషాబాద్ విమానాశ్రయ రన్‌వేకు దక్షిణ భాగంలో, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న బహదూర్‌గూడ గ్రామంలోని 650 ఎకరాల ప్రభుత్వ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల దృష్టి పడినట్లు అధికారులు తెలిపారు. రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నాలు జరిగినట్లు గుర్తించారు. 1954 ఖాస్రా పహాణి ప్రకారం సర్వే నెంబర్లు 25, 26లోని 650 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నాయని అధికారులు వెల్లడించారు. 2002–2006 మధ్య నిర్వహించిన ఎంజాయ్‌మెంట్ సర్వే అనంతరం భూముల క్రమబద్ధీకరణ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించిందని, దీంతో ఈ భూములు ప్రభుత్వ ఆస్తిగానే కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ భూమిలో వ్యవసాయం, ఫామ్‌హౌస్‌లు, ఏర్పాటు చేసిన వారిని ఖాళీ చేయించి, మొత్తం భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలను పూర్తిగా అడ్డుకునేందుకు ఇలాంటి ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగిస్తామని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు.

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 20న ఉమ్మడి పది జిల్లాల్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి అవగాహన సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లు, ప్రత్యేక అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమావేశాల ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించడం, రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత వర్గాలతో సమావేశమై వర్షాభావ పరిస్థితులపై చర్చించి తగిన చర్యలను సూచించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ నెల 20న నిర్వహించే జిల్లా స్థాయి సమావేశాలకు నియమితులైన ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సిఎస్ ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అధికశాతం జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్న ఆయన, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయంపై ఏర్పడే సవాళ్లను రైతులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర కార్యాచరణ ప్రణాళికలు (కంటింజెన్సీ చర్యలు), పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు శాస్త్రీయ, సాంకేతిక సమాచారాన్ని అందించేలా ఈ కార్యక్రమాన్ని రోజంతా నిర్వహించే విధంగా రూపొందించినట్లు సంజయ్ జాజు తెలిపారు.

ప్రముఖ నిర్మాత గణేష్ బండ్ల కుమార్తె జనని బండ్ల వివాహం ఆగస్టు 16న జరగనున్న నేపథ్యంలో కుమార్తె వివాహానికి మెగాస్టార్ చిరంజీవి దంపతులను ఆహ్వానించారు. మెగాస్టార్ నివాసానికి వెళ్లిన బండ్ల గణేష్ దంపతులు చిరంజీవి-సురేఖను ఆహ్వానించి పెళ్లి పత్రికను అందజేశారు.

రీల్



# 'కొరియన్ కనకరాజు'తో దక్షా నాగర్కర్ స్పెషల్ సాంగ్

వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కొరియన్ కనకరాజు'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే భారీ అంచనాలను సృష్టించింది. టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'కంసంనిద', టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'రాసగుమ్మడి' ఫుల్ లిరికల్ సాంగ్‌ను 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వరుణ్ తేజ్, హీరోయిన్ దక్షా నాగర్కర్ కలర్ ఫుల్ లుక్‌తో విడుదలైన సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ మాస్‌ఫెస్టివ్ సాంగ్ వైబ్ ని క్రియేట్ చేస్తోంది.కొరియన్ కనకరాజు లో దక్షా నాగర్కర్ స్పెషల్ సాంగ్ చేస్తోంది. వరుణ్ తేజ్, దక్షా నాగర్కర్‌పై చిత్రీకరించిన రాసగుమ్మడి సాంగ్ కలర్‌ఫుల్ రాయలసీమ జాతర నేపథ్యంలో తెరకెక్కిన మాస్ డ్యాన్స్ నంబర్‌గా ఉండబోతోంది. థమన్ సంగీతం అందించిన ఈ పాట మరో చార్ట్ బస్టర్‌గా కానుంది.ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్. థమన్ సంగీతం అందించగా, మనోజ్ రెడ్డి కటసాని డిఒపిగా పని చేస్తున్నారు.



## ఆగస్టు 7న కింగ్ జాకీ క్వీన్ రిలీజ్

విభిన్న కథాంశాలతో విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాలను అందుకుంటున్న నిర్మాత సుధాకర్ చెరుకూరికి తన ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్ నుంచి మరో ఆసక్తికరమైన చిత్రం కింగ్ జాకీ క్వీన్ ప్రేక్షకుల ముందుకు రానుంది. 1990 కాలం నేపథ్యంలో సాగే పీరియడ్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం లో 'దసరా', 'ది గర్ల్ ఫ్రెండ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. ఆయనకు జోడీగా నూతన నటి శశి ఓదెల పరిచయం అవుతుండగా, యుక్తి తరేజా మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన కెకె గత ఏడాది కన్నుమూశారు. ఆయన సినిమాపై ఉన్న పాషన్, విజన్ కి నివాళిగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు. ఇప్పటికే వినూత్నమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్, పవర్‌ఫుల్ టీజర్‌తో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. 'కేజేక్యూ కింగ్ జాకీ క్వీన్' ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో ముగ్గురు ప్రధాన పాత్రలను స్ప్లిట్ ఫ్రేమ్‌లో చూపించారు. మధ్యలో శశి ఓదెల ఇంటెన్స్ లుక్ లో ఆకట్టుకోగా, తుపాకీ గురిపెట్టి కనిపిస్తున్న దీక్షిత్ శెట్టి పాత్ర ఆకట్టుకుంది. కుడివైపు చేతిలో సిగరెట్‌తో యుక్తి తరేజా కనిపిస్తూ తన పాత్రలోని మిస్టరీని సూచిస్తున్నారు.ఈ చిత్రానికి నాగేశ్ బనెల్ సినిమాటోగ్రఫీ అందించగా, పూర్ణచంద్ర తేజస్వి సంగీతం సమకూరుస్తున్నారు. శ్రవణ్ కటికనేని ఎడిటర్‌గా, శ్రీకాంత్ రామిశెట్టి ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ నగేష్ బానెల్, సంగీతం పూర్ణచంద్ర తేజస్వి, ఎడిటర్ శ్రవణ్ కటికనేని, ప్రొడక్షన్ డిజైనర్ శ్రీకాంత్ రామిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శేఖర్ యలమంచిలి.

# 'ఇల్లీగల్ యాక్టివిటీస్' జరగడం లేదు

- కొంతమంది ఇంచార్జిలు డాన్సర్ల డబ్బులు దోచుకుంటున్నారు
- డాన్సర్లకు అన్యాయం జరిగితే ఊరుకోను
- 'ప్రజాపక్షం'తో డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత

ఒక సినిమా నిర్మాణం జరగాలంటే తెర మీద కనిపించే హీరో హీరోయిన్‌లే కాకుండా తెరవెనుక ఇరవై నాలుగు విభాగాలు పని చెయ్యాల్సి ఉంటుంది. ఈ ఇరవై నాలుగు విభగాల్లో డ్యాన్సర్‌లు ఎంతో కీలకం. అందుకే డ్యాన్సర్‌లకు సినిమా రంగంలో మంచి మర్యాదకు ఉంటాయి. అంతే స్థాయిలో పేరు ప్రఖ్యాతలు కూడా ఉంటాయి. ఈ రోజుల్లో డ్యాన్సర్‌లకు, డ్యాన్స్ డైరెక్టర్లకు కేవలం సినిమాలే కాకుండా బుల్లి తెర షోలు కూడా భారీ ఎత్తున స్వాగతం పలుకుతున్నాయి. అయితే వీరంతా తెలుగు ఫిలిం డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ లో సభ్యులుగా ఉండాలి. ఈ అసోసియేషన్ కు సుమలతా దేవి అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య అయిన సుమలత దేవి డాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా పోటీ చేసి మరీ గెలిచారు. అధ్యక్షురాలు ఏకపక్ష ధోరణితో పని చేస్తున్నారనే కారణం చేస్తా పదిమంది సభ్యులు తమ పదవికి రాజీనామా చేశారు. ఈ వివాదం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన తరుణంలో 'ప్రజా పక్షం' సుమలతతో ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది.

**ప్రశ్న : డాన్సర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా ఉన్నారు ఎందుకు వివాదాలకు కేంద్ర బిందువు అవుతున్నారు ?**

**సుమలత :** డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ ముప్పై అయిదేళ్ల క్రితం ఏర్పడింది. ముప్పై అయిదేళ్ల చరిత్ర ఉన్న ఈ అసోసియేషన్‌కు నేను అధ్యక్షురాలిగా గెలవడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్న. వివాదాలు ఇప్పుడే కాదు గతంలో చిన్న చిన్న తప్పులు, పెద్ద పెద్ద తప్పులు కూడా జరిగాయి. అసోసియేషన్ లో ప్రెసిడెంట్‌గా భాద్యత తీసుకుని ముందుకు నడిపించాలి అంటే చిన్న మాట కాదు. ఎవరు తప్పు చేసిన సరే అది ప్రెసిడెంట్ మీదకే వస్తుంది. ప్రెసిడెంట్‌గా మీరు ఏం చేశారు ? తప్పు జరిగితే ప్రెసిడెంట్‌గా ఎందుకు ప్రశ్నించలేదు ? అనే మాట నాకు రాకుండా ఉండటం కోసమే నా ప్రయత్నం . తప్పులు జరుగకుండా చూడటమే కదా నా బాధ్యత. అందుకే ఏ చిన్న తప్పు జరిగిన అడుగుతూనే ఉన్న. నేను సభ్యులను ప్రశ్నించడం వాళ్లకు నచ్చడం లేదు . అందుకే ఈ వివాదం మొదలెట్టారు.

**ప్రశ్న : తప్పులు జరిగాయి అంటున్నారు కదా ఎలాంటి తప్పులు జరిగాయి ? ఎవరు తప్పు చేశారు ?**



**సుమలత :** గత బాడీలో ప్రెసిడెంట్, సెక్రెటరీ, కోశాధికారి వల్ల ఫండ్స్ మిస్ యూజ్ జరిగాయి. దీని ప్రశ్నించడం వల్లే అసోసియేషన్ ప్రాబ్లమ్స్ స్టార్ట్ అయ్యాయి. గతేడాది మేము పోటీ చేసినప్పుడు జోసెఫ్ మాస్టర్ మాకు పోటీగా నిలబడ్డారు. జోసెఫ్ ఓడిపోయాడు. అప్పటి నుంచి మామీద వ్యతిరేకత. మేము ఇంతమంచి పని చేసిన సరే ఎదో ఒకటి వేలెత్తి చూపాలి అనే వాయిస్‌లోనే ఉన్నారు. దానివల్లే ఈ ప్రాబ్లమ్ తప్ప లేకపోతే మేమంతా ఒక్కడే. డాన్సర్స్ అయినా, కొరియోగ్రాఫర్స్ అయినా అందరం కలిసి మెలిసి ఉన్నాము.

**ప్రశ్న : మీరు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారు అనేది మీ మీద ఉన్న ప్రధాన అభియోగం? దీనికి ఏమంటారు?**

**సుమలత :** ఇవన్నీ అబద్ధాలు. నేను అందరి అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకుంటా తప్ప. ఏకపక్ష నిర్ణయాలు ఉండవు. ఇప్పుడైతే ఏకంగా ఫెడరేషన్ కు వ్యతిరేకంగా కూడా నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు. వాళ్ళు చెప్పేవన్నీ అవాస్తవాలు. అసోసియేషన్ ఏ నిర్ణయం తీసుకున్న లీగల్ ఒపీనియన్ తీసుకుని మాత్రమే ముందుకెళ్తున్నాము. ఎక్కడ కూడా ఇల్లీగల్ యాక్టివిటీస్ జరగలేదు

**ప్రశ్న : మీరు వచ్చిన తరువాత ఇంతవరకు ఏమి చేశారు ? ఎలాంటి కార్యక్రమాలు తీసుకున్నారు ?**

**సుమలత :** డాన్సర్స్ సంక్షేమం కోసం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాము. సభ్యులందరికి హెల్త్ ఇన్సూరెన్స్ కూడా కడుతున్నాము. గత బడిలో జరిగిన తప్పులన్నీ ఒక ఫైల్ చేసి పెట్టాము. కొంతంనుండి ఇంచార్జిలు నిర్మాతల దగ్గరి నుంచి అంటే మా జనరల్ సెక్రెటరీ తో పాటు ఇంకొంతమంది ఇంచార్జ్ లు కావొచ్చు నిర్మాత దగ్గర ఒక అమౌంట్ రాస్త్రారు. యూనియన్ లో ఇంకొక అమౌంట్ ఇస్తారు. దీనివల్ల డాన్సర్స్ తీవ్రంగా నష్టపోతున్నారు. నేను వచ్చాక ఫస్ట్ ఇది ఐడెంటిఫై చేశాను. డ్యాన్సర్లకు రావలసిన పూర్తి స్థాయి డబ్బులు రావడం లేదు. అందరు కాదు ... కొంతమంది ఇంచార్జి లు డ్యాన్సర్స్ డబ్బులను అన్యాయంగా దోచుకుంటున్నారు ఇది నిజం, నేను ఇది బయట పెట్టినప్పటి నుంచి నా మీద వ్యక్తిరేకత వచ్చింది . అసోసియేషన్ ను తప్పు దారి లో తీసుకుపోవడం కానీ, ప్రెసిడెంట్ గా నేను అన్యాయం చెయయడం కానీ జరగలేదు. అవినీతి బయటపడినందుకే జెనరల్ సెక్రెటరిని సస్పెండ చేశాము ఆయన కూడా రాజీనామా చేశారు. కమిషన్ రూపంలో డ్యాన్సర్స్ డబ్బులను తీసుకున్నారు. అవినీతిని ప్రశ్నించినందుకు వాళ్ళు రాజీనామాలు చేశారు తప్ప మేము చేసే పనులు నచ్చక కాదు.

**ప్రశ్న : సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌ను వ్యతిరేకిస్తున్నారా? ఫెడరేషన్ నుంచి బయటికి వచ్చారా ?**

**సుమలత :** రాజీనామా చేసింది కేవలం పదిమంది అయితే మమ్ములను కూడా దిగిపొమ్మని అంటున్నారు. మా బైలలో ఎక్కడా లేదు. ఫెడరేషన్ బైలలో కూడా ఎక్కడ లేదు. మా అంతర్గత సమస్యలో ఫెడరేషన్ జోక్యం ఎందుకు అని మాత్రమే అన్నాము. ఉన్న ఏడుగురు మేము ఏమి తప్పు చెయ్యలేదు. మమ్ముల్ని కూడా దిగిపోండి అంటే మేమెలా దిగిపోతాం. మీటింగ్ ఈ ఎజెండా పెట్టలేదు అని ఫెడరేషన్ వాళ్ళు వెళ్లిపోయారు తప్ప ఫెడరేషన్ కు వ్యతిరేకంగా మేము ఉప ఎన్నిక జరుపుతున్నామని మాట అవాస్తవం. ఫెడరేషన్ ప్రకారమే పని చేస్తున్నాము. వాళ్లకు వ్యతిరేకంగా మేము ఏ పని చెయయలేదు. మేము ఫెడరేషన్ తోనే ఉన్నాము.

**ప్రశ్న : అసోసియేషన్‌లో ఏం జరుగుతుందో అసలు చాలా మంది దాన్సర్లకు తెలియడం లేదు అంటున్నారు?**

**సుమలత :** అలాంటిదేమి లేదు సార్.. అన్ని విషయాలు అందరికీ తెలుస్తున్నాయి. గతంలో అంటే తెలియకపోయేది . కానీ ఇప్పుడు అందరూ చదువుకున్నవారున్నారు. అందరికి నాలెడ్జ్ ఉంది. అందరూ యాక్టివ్ గా పని చేస్తున్నారు.

**ప్రశ్న : కమీషన్ డబ్బులు మరి ఇంచార్జి నుంచి అసోసియేషన్ వాసూల్ చేస్తుందా ?**


**సుమలత :** తప్పకుండ వాసులు చేయడానికీ ప్రయత్నిస్తున్నాము. డాన్సర్స్ దగ్గర కమీషన్ తీసుకుని అన్యాయం చేస్తే మేమెలా ఊరుకుంటాం సార్. ఖచ్చితంగా వసులు చేస్తాం. తప్పుడు బిల్స్ పెట్టారు అవన్నీ కూడా వారి దగ్గరి నుంచి వసూలు చేస్తాం. అసోసియేషన్ కు నష్టం కలగకుండా, డాన్సర్లకు అన్యాయం జరగకుండా చూస్తాం.

## విజయవంతం

(3వ పేజీ తరువాయి)

అభినందనలు తెలియజేశారు. దేశ అంతరిక్ష ప్రయాణంలో విక్రమ్–1 రాకెట్ ప్రయోగాన్ని ఒక కీలక ఘట్టంగా అభివర్ణించారు. రాబోయేకాలంలో ప్రైవేటురంగంలో భారతదేశం ప్రపంచ అగ్రదేశాలతో పోటీపడి ముందుకు దూసుకువెళ్ళడానికి, లెక్కలేనంతమంది భారతదేశ యువతీయువకుల మేలైన కలలను సాకారం చేసేందుకు, వారందరూ ముందుకు పురోగమించేలా ప్రోత్సహించేందుకు ఈ ప్రయోగం గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని ఎక్స్‌వేదికగా మోదీ రాశారు. ఈ ప్రయోగ విజయం దేశ స్వావలంబన సాధనకు చిహ్నమని పేర్కొన్నారు. భూమి వాతావరణానికి ఆవల బాహ్య అంతరిక్షాన్ని తాకి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన ఈ రాకెట్ ప్రయోగం ద్వారా వచ్చే ఫలితాలను తదుపరి వాణిజ్య రాకెట్లను మరింత మెరుగైన పద్ధతిలో ప్రయోగించేందుకు, వాటి మార్గాలను మరింత ఖచ్చితంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగిస్తారు. నిర్ణీత ప్రకారం శనివారం ఉదయం 11.30 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ థావన్ అంతరిక్ష కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుండి ఈ రాకెట్ బయలుదేరాల్సి ఉన్నప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాలవల్ల బయలుదేరే సమయాన్ని సవరించి 35 నిమిషాలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.05 గంటలకు ప్రయోగించారు. ఏడు అంతస్తులు ఎత్తైన ఈ రాకెట్ నాలుగు దశల్లో ప్రయాణించి భూవాతావరణాన్ని దాటి బాహ్య అంతరిక్షాన్ని తాకింది. అక్కడకు 450 కి.మీ ఎత్తులోకి (లో ఎర్త్ ఆర్బిట్) చేరుకున్న తర్వాత ముందుగానే అందులో సిద్ధం చేసి ఉంచిన గ్రాహా స్పేస్,కాస్మోసెర్వ్,డీక్యూబ్,స్కైరూట్ స్కోప్ వంటి సాంకేతిక ప్రయోగాలకు సంబంధించిన అనేక ప్రాథమిక పేలోడ్‌లను వరుసగా లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టారు.

నారింజరంగు వర్ణాలను చిమ్ముకుంటూ ఈ రాకెట్ భారతదేశ శాస్త్ర,సాంకేతిక అంతరిక్ష వ్యవస్థకు దార్శనికులుగా నిలిచిన క్రమ్ సారాభాయ్,సర్ సి.వి.రామన్,ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ వంటి ప్రముఖుల సూక్ష్మ శిల్పాలతోపాటు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతిరాతతో ఉన్న ''వందే మాతరం' పోస్టుకార్డుసహా అనేక వస్తువులను ఈ రాకెట్ బాహ్య భూవాతావరణాన్ని దాటిన బాహ్య అంతరిక్ష కక్ష్యలోకి విజయవంతంగా మోసనుకు వెళ్ళింది. భారత అంతరిక్ష దార్శనికుల స్ఫూర్తికి నివాళిగా ఈ రాకెట్‌లోని ఇంజన్లకు విక్రమ్ సారాభాయ్,సి.వి.రామన్,కలామ్ పేర్లు పెట్టినట్లు ఈ రాకెట్ తీసుకువెళ్ళిన వస్తువులలో ఇంజనీర్లు,శాస్త్రవేత్తలు,భారత వ్యోమగాముల పోస్టుకార్డులతో పాటు వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి తన చేతిరాతతో రాసిన సందేశంగల పోస్టుకార్డును,18 క్యారెట్ల బంగారంతో చేసిన సూక్ష్మ విక్రమ్–1 రాకెట్‌ను కూడా ఇది ఎఇఓలోకి ప్రవేశపెట్టింది. పలువురు ప్రముఖులు ఈ ప్రయోగ కార్యక్రమం సందర్భంగా హాజరయ్యారు. అనేకమంది ఆ తర్వాత స్కైరూట్ సంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.అమెరికా,చైనా తర్వాత ప్రైవేటురంగంలో ఈ విధంగా రాకెట్లు ప్రయోగించగల సామర్థ్యాన్ని ప్రపంచ మూడవదేశంగా భారత్ సంతరించుకుంది.




## అధ్యయనం

(3వ పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. వ్యవసాయం, నీటి పారుదల, అటవీ, విద్యుత్, పశుసంవర్ధక, మత్స్య, విద్యాశాఖల ఉన్నతాధికారులతో పాటు ఇక్రిశాట్, ఐఎండి, క్రిడా, ఐఐఎంఆర్, ఐఐఓఆర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, మార్క్‌ఫెడ్ టిజిఆయిల్ ఫెడ్, నాబార్డ్ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేయడం, వ్యవసాయం, అనుబంధ రంగాలకు నష్టం తగ్గించే నివారణ, అనుసరణ చర్యలను ప్రభుత్వానికి సూచించడం, రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకు అమలు చేయాల్సిన అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం కమిటీ ప్రధాన బాధ్యతలుగా ప్రభుత్వం పేర్కొంది. కమిటీ సంబంధిత వర్గాలతో సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు, సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయనుంది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com